Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com
Journalism first!

సంపుటి: 56 • సంచిక: 113 • గురువారం 3 ఆగస్టు 2017 • హైదరాబాద్ ❋ పేజీలు: 12+12 • వెల: 5.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం | శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: శుద్ధ ఏకాదశి సా. 4.25 వరకు, అనంతరం ద్వాదశి; నక్షత్రం: జ్యేష్ఠ రా. 7.06 వరకు, అనంతరం మూల; అమృతకాలం: ఉ. 9.20 నుండి 11.05 వరకు; వర్జ్యం: తె. 3.58 నుండి 5.44 వరకు; దుర్ముహూర్తం: ఉ. 9.59 నుండి 10.50 వరకు; మ. 3.05 నుండి 3.57 వరకు; రాహుకాలం: మ. 1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు



జిల్లాలు తిరుగుతా... కాంగ్రెస్‌ని ఎండగడతా!

ఇక సహించను



తెలంగాణ సర్కార్ ఏర్పాటైన మూడేళ్ల కాలంలో 196 కేసులు నమోదు. ఒక్క సాగునీటి ప్రాజెక్టుల పైనే 164 కేసులు పెట్టడం దురదృష్టకరం.



విషపూరిత కుట్రలతో సామాజిక, సంక్షేమ, రైతుల అభివృద్ధిని, అడ్డుకుంటున్న కాంగ్రెస్‌కు ఇక మనుగడ లేదు. ప్రజలే బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైంది. ప్రజాక్షేత్రంలోకి వెళ్లి వారి బండారం బయటపెడతా



కమ్యూనిస్టులు మూర్ఖులు. ప్రజలు తిరస్కరించినా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు. అందుకే వారిని కలిసేందుకు ఇష్టపడటం లేదు. అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. ప్రాణాలు అడ్డుపెట్టి సాధించుకున్న తెలంగాణను, ఉద్యమ పార్టీని కించపరిస్తే ఉపేక్షించబోము.



కాంగ్రెస్ హయాంలో పెరిగిపోయిన విచ్చలవిడి అక్రమ వ్యాపారాలు, డ్రగ్స్ దందా, పబ్‌ల నిర్వహణ, పేకాట, నకిలీ, కల్తీ విత్తనాలు తదితర దురాగతాలపై స్థిరపడిన వ్యవస్థను కూకటివేళ్లతో పెకలించి ప్రక్షాళన చేస్తున్నాం.

- ఎన్ని కేసులు పెట్టినా అధిగమిస్తాం
- పిల్లలపై కాంగ్రెస్‌వి పిల్లి శకునాలే
- కాంగ్రెస్‌కు సిద్ధాంతాలు లేవు...
- నేతలకు సిగ్గులేదు
- ప్రజల దీవెనలు నాకున్నాయి
- కోర్టులు చీవాట్లు పెట్టినా బుద్ధిరావట్లేదు
- సీఎంని కదా అని గాంభీర్యం ప్రదర్శించా
- ఇక నిజమైన కేసీఆర్‌ను చూస్తారు
- వారసత్వ ఉద్యోగాలు మేమిస్తుంటే కాంగ్రెస్ రద్దు చేయించింది
- డ్రగ్స్ పట్టుకోవడంతప్పా?
- కేబినెట్ మంత్రి ఉన్నా వదలవద్దని చెప్పా

- అభివృద్ధి పథంలో నన్నెవరూ ఆపలేరు
- తాత్కాలిక ఉద్యోగుల అర్థాకలి తీరుస్తాం
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సీఎం భరోసా
- కోర్టు స్ఫూర్తి అభినందనీయం
- రిజర్వేషన్లపై పట్టువదలం: కేసీఆర్

వివరాలు 2లో...

జీవనోపాధి లేకుండా చేయలేం: హైకోర్టు

10 లో

రాష్ట్రపతి కోవింద్‌తో గవర్నర్ భేటీ



అంతర్గత భద్రత సలహాదారుగా

నరసింహన్?

ప్రధాని కార్యాలయంలో గంటకుపైగా మంతనాలు

మోడీ, జితేందర్ సింగ్‌లతో భేటీలు

అంతకుముందు మర్యాద పూర్వకంగా రాష్ట్రపతితో సమావేశం


న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ మరింత కీలక బాధ్యత చేపట్టనున్నారని తెలుస్తోంది. రాజ్యాంగ పదవి నుంచి కేబినెట్ ర్యాంకు స్థాయి కలిగిన పదవిలోకి ఆయన్ను తీసుకుంటారని జోరుగా చర్చ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ఊహాగానాలకు మరింత బలమిచ్చేలా ఆయన బుధవారం గంటకు పైగా ప్రధాని కార్యాలయంలో మంతనాలు సాగించారు. ఉదయం మర్యాద పూర్వకంగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసిన గవర్నర్ సాయంత్రం 3.40 నిముషాల సమయంలో పార్లమెంటుకు చేరుకున్నారు. నేరుగా ప్రధాని కార్యాలయ సహాయ మంత్రి జితేందర్ సింగ్‌తో సమావేశమయ్యారు. అప్పటికి ప్రధాని పార్లమెంటులో లేకున్నా, అరగంట తర్వాత మోడీ కూడా తన

➪ 3వ పేజీలో...

ఆర్థికం కాదు... ఆరోగ్యం ముఖ్యం

గ్యాస్ సబ్సిడీపై పునరాలోచించాలి • ప్యారిస్ ఒప్పందానికి తూట్లు పొడవద్దు

ప్రభుత్వం సబ్సిడీల భారాన్ని తగ్గించుకునే ప్రయత్నంలో దీనివల్ల కలిగే నష్టాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడంలేదు. ద్రవ్యోల్బణాన్ని స్థూల జాతీయోత్పత్తిలో రెండుశాతానికి పరిమితం చేయాలన్న ప్రపంచబ్యాంక్ ఆదేశాల నేపథ్యంలో పరోక్ష సంకేతాల్ని పట్టించుకోవడం లేదు. ఇది భావి భారత సమాజంపై తీవ్ర ప్రభావం చూపించే అంశంగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. చిన్నపాటి సబ్సిడీని తప్పించుకునే యత్నంలో భవిష్యత్ తరాల ఆరోగ్యం, మేథోశక్తి, రోగనిరోధక వ్యవస్థలపై ప్రభావం చూపే నిర్ణయాన్ని కొనసాగించడం సరికాదని సూచిస్తున్నారు.



(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాలు తమ భవిష్యత్ తరాలు అత్యున్నత ఆరోగ్యంతో శక్తివంతంగా, మేథోసంపత్తి కలిగిన వారిగా ఉండాలని తలపోస్తున్నాయి. ఇందుకోసం గత కొన్నేళ్ళ నుంచి పలుచర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగానే తల్లీపిల్లల ఆరోగ్యం, ఉచిత వైద్యసేవలు, పౌష్టికాహార సరఫరా వంటి పథకాల్ని అమలు చేస్తున్నాయి. స్వతంత్రమొచ్చిన తొలినాళ్ళలో భారత పాలకులు కూడా అభివృద్ధితో పాటు సంక్షేమానికి సమాన ప్రాధాన్యతనిచ్చారు. బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్ద సంఖ్యలో కేటాయింపులు జరిపారు. రాన్రాను ప్రభుత్వాలు తమ లక్ష్యాల్ని మార్చుకుంటున్నాయి. సంక్షేమాన్ని గాలికొదిలేస్తున్నాయి. ప్రభుత్వ నిర్వహణలో ప్రజాసంక్షేమం కంటే వ్యాపార దృక్పథాన్ని పెంచుకుంటున్నాయి. ఆర్థిక నిల్వలు, బంగారు నిల్వలు, సైనికసంపత్తి, వ్యాపార సామ్రాజ్య విస్తరణల వైపు మొగ్గుచూపుతున్న ప్రభుత్వాలు రాన్రాను భవిష్యత్ తరాల ఆరోగ్యం, నైపుణ్యాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. తాజాగా కేంద్రం వంటగ్యాస్ సరఫరాపై అంచెల వారీగా సబ్సిడీ ఎత్తివేతకు నిర్ణయించింది. ఇది దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. సుమారు 40ఏళ్ళ నుంచి దేశంలో ఎల్‌పీజీ గ్యాస్‌ను సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఇందుక్కారణం మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టడమే. పర్యావరణ సమతుల్యతను కాపాడటం కూడా ఇందుకు మరో కారణం. మోడీ అధికారంలోకొచ్చాక దేశవ్యాప్తంగా వంటగ్యాస్ సిలెండర్ల సరఫరా అనూహ్యంగా పెంచేశారు. దాదాపు ప్రతి ఇంటికి గ్యాస్ కనెక్షన్ అందుబాటులోకి తెచ్చేశారు. ఇదే సమయంలో ఉన్నత వర్గాలు గ్యాస్ సబ్సిడీని వదులుకోవాలంటూ మోడి ఇచ్చిన పిలుపునకు అనూహ్య స్పందన వచ్చింది. ఏకంగా 1.22 కోట్ల మంది తమ గ్యాస్ సబ్సిడీని స్వచ్ఛందంగా వదులుకున్నారు. దీంతో సబ్సిడీ భారం తగ్గింది. ఈ సమయంలో అంతర్జాతీయంగా కూడా గ్యాస్ ధరలు తగ్గుముఖం పట్టాయి. ఇది సబ్సిడీని మరింతగా తగ్గించేసింది. అయినప్పటికీ కేంద్రం ఈ మాత్రం భారాన్ని కూడా తాము మోసేందుకు

➪ 3వ పేజీలో...



న్యూఢిల్లీ: కర్ణాటక మంత్రి డి. కె. శివకుమార్ నివాసంలోకి సోదాల కోసం వెళుతున్న ఆదాయ పన్నుశాఖ అధికారులు

కాంగ్రెస్‌కు ఐటీ షాక్

కర్ణాటక మంత్రి, ఎంపీ నివాసాల్లో దాడులు

ఏకకాలంలో 64 చోట్ల సోదాలు

రూ. 10 కోట్ల నగదు, ఆభరణాలు జప్తు

బెంగళూరు, ఢిల్లీ ప్రాంతాల్లో తనిఖీలు

గుజరాత్ ఎమ్మెల్యేలున్న రిసార్ట్‌లోనూ సోదా

ఐటీ దాడులను తప్పుబట్టిన కాంగ్రెస్

బెదిరింపు చర్యలంటూ పార్లమెంట్‌లో రభస

ప్రతిపక్షం ఆరోపణలను తిప్పికొట్టిన జైట్లీ

వివరాలు 11లో...

ఔరా..!




పక్కా ప్లాన్

కథ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్ అంతా విక్రమ్ గౌడే

దర్యాప్తులో నిగ్గుతేలిన నిజాలు: సీపీ

7 లో





భారత్‌పై మళ్లీ డ్రాగన్

మా భూభాగంలోకి చొరబడ్డారు...

తక్షణమే వైదొలగాలంటూ చైనా హెచ్చరికలు

వెనక్కు తగ్గేది లేదని తేల్చిచెప్పిన భారత్

10 లో

డ్రగ్స్ దందా కేసు

రానా పార్శిల్‌పై నిఘా



హైదరాబాద్, ఆంధ్రప్రభ: డ్రగ్స్ కేసులో రెండో లిస్టు ఉండబోతోందని, అన్ని వర్గాలతో పాటు సినీ ప్రముఖులలో మరికొందరి పేర్లు ఈ లిస్ట్‌లో ఉండబోతోందని, ముఖ్యంగా ఆ సినీ ప్రముఖుల లిస్టులో దగ్గుబాటి రానా పేరు ఉండవచ్చునని ప్రచారం కొనసాగింది. దీంతో, ఈ కేసులను విచారిస్తున్న ఎక్సైజ్ సిట్ మరో ముందడుగు వేసింది. దర్యాప్తు జోరుని పెంచింది. సినీ రంగ ప్రముఖులకు విదేశాలనుంచి వచ్చే పార్సిల్స్‌పై అధికారులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో బుధవారం హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోకు విదేశాల నుంచి అందిన ఓ పార్సిల్ పరిశీలనకు ఎక్సైజ్ సీఐ కనకదుర్గ ఆధ్వర్యంలో

➪ 7వ పేజీలో...



హైడల్ ప్రాజెక్ట్ భారత్ హక్కు

కిషన్, గంగ, రాట్లే జలవిద్యుత్ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ • సాంకేతికత సాకుతో పాక్ అడ్డుపుల్ల • భారత్ వాదనకు ప్రపంచ బ్యాంక్ ఓకే

11

జిల్లాలు తిరుగుతా..కాంగ్రెస్‌ని ఎండగడతా!

ఇక సహించను

•అభివృద్ధి పథంలో నన్నెవరూ ఆపలేరు!



బుధవారం ప్రగతిభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్.

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను దశల వారీగా అమలు చేయడంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు తేల్చిచెప్పారు. ముఖ్యంగా అర్థాకలితో విధులు నిర్వర్తిస్తూ దినదిన గండంగా కుటుంబాలను పోషించుకుంటున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపట్ల ప్రభుత్వం సానుకూల వైఖరితో ఉందని స్పష్టంచేశారు. అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో క్రమబద్ధీకరణ సాధ్యం కాకుంటే వారందరికీ ప్రభుత్వోద్యోగులతో సమానంగా జీతభత్యాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. తమ రాజకీయ ఉనికిని చాటుకునేందుకు ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నాయకులు అడుగడుగునా అడ్డుకుంటున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎవరెన్ని అడ్డంకులు కలిగించినా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటానని, ఉద్యోగులంతా నిబద్ధతతో, ఆత్మస్థైర్యంతో ఉండాలని పిలుపు చేశారు. ఈ సందర్భంగా బుధవారం ప్రగతి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం కేసీఆర్ ప్రతిపక్షాల కుట్రలు, రాజకీయ రాద్ధాంతంపై అసహనం వ్యక్తంచేశారు. ఆచరణ యోగ్యమైన సలహాలు, సూచనలు ఇవ్వా సుహృద్ పాలనకు దోహద పడాల్సిన బాధ్యతగల స్థానంలో ఉన్న ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజకీయ లబ్ధికోసం, తమ వ్యక్తిగత మనుగడ కోసం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకునే ప్రయత్నం చేయడం తగదన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం అదిరే, బెదిరే స్థాయిలో లేదని, సరైన సమయంలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. విష పూరిత విలన్‌గా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఆగడాలను తిప్పికొట్టాలని, సంక్షేమాన్ని అడ్డుకుంటున్న ఆ పార్టీ నాయకులను గ్రామాల్లో తిరగకుండా చేయాలని రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ పిలుపునిచ్చారు. సుదీర్ఘ పోరాటం అనంతరం సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించే ప్రయత్నం చేస్తుంటే అధికార భంగం నుంచి ఇప్పటికీ కోలుకోలేని కాంగ్రెస్ న్యాయపరమైన చిక్కులు సృష్టించడం దురదృష్టకరమన్నారు. తెలంగాణలో ఉన్నంత విచిత్రమైన రాజకీయ పరిస్థితులు దేశంలో మరెక్కడా లేవని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. సాక్ష్యాత్తు శాసనసభలో తెలంగాణకు పైసా కూడా ఇవ్వనని ఉమ్మడి రాష్ట్రంలోని ఆఖరి ముఖ్యమంత్రి కుండబద్దలు కొట్టినట్లు ప్రకటించి తెలంగాణను కించపరిస్తే ఈ ప్రాంతానికి చెందిన ఏ ఒక్క నాయకుడూ నాడు మాట్లాడలేదని ధ్వజమెత్తారు. 14 ఏళ్ళుగా అనేక అవమానాలను భరిస్తూ దేశ రాజకీయ వ్యవస్థను ఒప్పించి, మెప్పించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుంటే, అర్థాకలితో మగ్గుతున్న పేద వర్గాలు, చిరుద్యోగులను ఆదుకునే ప్రయత్నం చేస్తుంటే కుటిల రాజకీయాలు చేస్తున్నారంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక, ప్రజాభిమానాన్ని తట్టుకోలేక ఇక భవిష్యత్తులో తమకు మనుగడ లేదన్న సంకేతాలు కనిపిస్తున్న నేపథ్యంలోనే కాంగ్రెస్ ఈ దురాగతాలకు పాల్పడుతోందని అన్నారు.

మీరసలు తెలంగాణ బిడ్డలేనా?

ఉద్యోగాల భర్తీ కోసం జారీచేసిన నోటిఫికేషన్లపై, రహదారులు, ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంపై, ప్రతిష్ఠాత్మకమైన మిషన్ భగీరథ, కాకతీయ పథకాల అమలుపై, మరీ ముఖ్యంగా ఉద్యోగుల సంక్షేమాన్ని అడుగడుగునా న్యాయస్థానాలను ఆశ్రయిస్తూ అడ్డుకుంటున్న మీరు అసలు తెలంగాణ బిడ్డలేనా అని సీఎం కేసీఆర్ ప్రతిపక్ష కాంగ్రెస్, వామపక్ష పార్టీలను ప్రశ్నించారు. కేవలం సాగునీటి ప్రాజెక్టులపై 164 కేసులు పెట్టడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం ఏర్పాటైన మూడేళ్ల కాలంలో 196 కేసులు నమోదు కావడం దేశంలో మరెక్కడా లేదన్నారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు అడ్డుకునేందుకు కేవలం 20 రోజుల్లోనే ఆరు కేసులు నమోదు కావడం కాంగ్రెస్ దురాగతానికి నిదర్శనమని పేర్కొన్నారు. చివరకు ఈ కేసులన్నింటిని సుప్రీంకోర్టు నిర్దాక్షిణ్యంగా కొట్టేస్తే గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి అడ్డు పుల్లలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆనాడు పుణ్యాత్ముడు చంద్రబాబు మొదలుపెట్టిన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థ నేడు లక్షలాది కుటుంబాలు అర్థాకలితో అలమటించే విధంగా చేసిందని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ దుష్టపన్నాగం

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీళ్ళు వస్తాయంటే కాంగ్రెస్ నాయకుల గుండెలు అవిసిపోతున్నాయని సీఎం కేసీఆర్ అన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నపుడు ఈ ప్రాజెక్టు కింద కేవలం 70వేల ఎకరాలకు మాత్రమే నీళ్ళిచ్చి చేతులు దులుపుకుంటే, తమ ప్రభుత్వం 5 లక్షల 4వేల ఎకరాలకు నీళ్ళిచ్చే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. అలాగే డిండి, కొండపోచమ్మ తదితర ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తామంటే స్థానిక రైతులను ఉసిగొల్పి భూ సేకరణను అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కొండపోచమ్మ ప్రాజెక్టుకు సంబంధించి మూడు గ్రామాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉన్నందున అక్కడ భూముల విలువ ఎక్కువగా ఉందన్నారు. అయినప్పటికీ వారిని పిలిపించి కోరిన మేరకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటే హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలుచేసి ప్రభుత్వానికి, రైతులకు పంచాయితీ పెట్టారని ధ్వజమెత్తారు. ఈ ప్రాజెక్టు కోసం అవసరమైన 4,400 ఎకరాల భూమిలో ఇప్పటి వరకు 4,200 ఎక రాల సేకరణ పూర్తయ్యిందన్నారు. కేవలం 200 ఎకరాల కోసం ఒక గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలను అడ్డుపెట్టుకుని చిల్లర రాజకీయాలకు పాల్పడ్డారంటూ అసహనం వ్యక్తంచేశారు.

ప్రజలే గుణపాఠం చెబుతారు


విషపూరిత కుట్రలతో సామాజిక, రైతుల అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్ పార్టీకి ఇక రాజకీయ మనుగడ లేదని కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఇలాంటి వారికి ప్రజలే బుద్ధి సమయం ఆసన్నమైందన్నారు. యాదాద్రి, భద్రాద్రి పవర్ స్టేషన్లపై కూడా కేసులు పెట్టి ప్రజలను రెచ్చగొడుతున్న ఆ పార్టీ నేతల బతుకులు ప్రజాక్షేత్రంలో ఎండగట్టేందుకు అధికార పార్టీ తరపున త్వరలోనే కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. విద్యుత్ కోసం ఉద్యమించిన వారిపై నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపి 400 మంది ప్రాణాలను బలి తీసుకున్న కాంగ్రెస్ పార్టీ నేడు డిమాండ్‌కు మించి కరెంట్ సరఫరా చేస్తుంటే చూసి ఓర్వలేకపోతోందని అన్నారు. వైఎస్ హయాంలో తమ పార్టీతో దోస్తీ కట్టి తెలంగాణాను తీవ్రంగా నష్టపరిచిన సంఘటనలు తామింకా మరిచిపోలేదన్నారు. అవన్నీ కాదని నేడు ప్రత్యేక రాష్ట్రం ఏర్పా టైనప్పటికీ శిఖండి పాత్ర పోషిస్తూ ఆ పార్టీకి చెందిన కొందరు నేతలు నీళ్ళ రాజకీ యానికి పాల్పడు తున్నారని, ఇది క్షమించరాని నేరమని అన్నారు. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై చర్చిద్దామన్నా, సాగునీటి ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇద్దామన్నా పారిపోయిన ప్రతిపక్ష నేతలు నేడు క్షేత్రస్థాయిలో ప్రజాభిమానాన్ని పూర్తిగా కోల్పోతున్నారని పేర్కొన్నారు. ఇటీవల వరంగల్ ఉపఎన్నికలో, అచ్చంపేట మునిసిపల్ ఎన్నికలో ప్రజలు ఇచ్చిన తీర్పు కర్రకాల్చి వాత పెట్టినట్లు ఉందన్నారు. అయినా సిగ్గులేకుండా అభివృద్ధిని అడ్డుకోవడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు.

ఆ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నాం

కాంగ్రెస్ హయాంలో పెరిగిపోయిన విచ్చలవిడి అక్రమ వ్యాపారాలు, డ్రగ్స్ ముఠా, ఇష్టారాజ్యంగా పబ్‌ల నిర్వాకం, పేకాట, నకిలీ విత్తనాల సంస్థలు తదితర దురాగతాలతో స్థిరపడిన వ్యవస్థను కూకటివేళ్ళతో పెకిలించి ప్రక్షాళన చేస్తున్నామని సీఎం కేసీఆర్ అన్నారు. నకిలీ విత్తనాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహిస్తుంటే డ్రగ్స్ మాఫియా గుట్టు రట్టయ్యిందని ఆయన పేర్కొన్నారు. ఆ దిశగా జరుగుతున్న దర్యాప్తులో అనేక దుర్మార్గాలు బయటకు వస్తున్నాయని అన్నారు. ఇందులో ప్రమేయమున్న ఏ ఒక్కరిని వదిలిపెట్టకుండా కఠిన శిక్షలు పడేలా చూస్తామని, ఆ దిశగా పోలీసు అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. మొగ్గ దశలోనే తుంచి వేయాలన్న స్పష్టమైన సంకేతాలు ఇటీవల జరిగిన సమావేశంలో ఇచ్చామన్నారు.

కోర్టు స్ఫూర్తి అభినందనీయం

న్యాయపరమైన చిక్కులు సృష్టించి అభివృద్ధిని, ఉద్యోగుల సంక్షేమాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ కుట్రపూరితంగా కోర్టులను ఆశ్రయిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అయినప్పటికీ న్యాయ మూర్తులు సామాజిక కోణంలో ఆలోచిస్తూ ఉద్యోగులపట్ల మానవీయతను ప్రదర్శించారని, వారి స్ఫూర్తి అభినందనీయమని కేసీఆర్ పేర్కొన్నారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నెలసరి వేతనాన్ని రూ.21,724 లకు పెంచాలని బోర్డు ప్రతిపాదించి కోర్టుకు నివేదించిందని తెలిపారు. అయితే ఈ మొత్తాన్ని రూ.22వేలకు పెంచి చెల్లించాలన్న న్యాయస్థానం ఆదేశాలను స్వాగతిస్తున్నామన్నారు. ఈ నిర్ణయంపై తమ ప్రభుత్వం మరింత సానుకూలంగా ఉందని, మరో వెయ్యి రూపాయలు పెంచి రూ.23వేలు చెల్లించేందుకు నిర్ణయించామని ఈ సందర్భంగా తెలియజేశారు.



ఉక్కు సంకల్పంతో ముందుకు...



ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా, అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేసినా తమ ప్రభుత్వం వాటిని తిప్పికొట్టేందుకు సంసిద్ధమై ఉందని సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా స్పష్టంచేశారు. ఉక్కు సంకల్పంతో ముందడుగు వేసి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకునేందుకు, వారి ఆశలు, ఆకాంక్షలను నిలబెట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలంగాణ చరిత్రను ప్రతిబింబించే విధంగా ప్రతిష్టాత్మకమైన సచివాలయాన్ని నిర్మించాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని కూడా అడ్డుకుంటుండడం దురదృష్టకరమన్నారు. అయినప్పటికీ బైసన్‌పోలో మైదానంలో 60 ఎకరాల విస్తీర్ణంలో సువిశాల సచివాలయాన్ని నిర్మించి తీరుతామని సీఎం ధీమా వ్యక్తం చేశారు. ఉప్పల్, గచ్చిబౌలి స్టేడియంలతో పాటు నగరంలో 500 ఎకరాలకు పైబడి భూ విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణాలు ఉన్నప్పటికీ కేవలం 19 ఎకరాల్లో ఉన్న సికింద్రాబాద్ ప్రాంగణాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అయినప్పటికీ ఆ భూమి రాష్ట్ర క్రీడా ప్రాదికార సంస్థకు కంటోన్మెంట్ బోర్డు లీజుకు ఇచ్చిన విషయం వారింకా తెలుసు కోకపోవడం దురదృష్టకరమన్నారు. చివరకు అమరవీరుల స్థూపం నిర్మించాలన్న ప్రతిపాదనను కూడా అడ్డుకోవడం పైశాచికత్వమని అన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడం, హుస్సేన్‌సాగర్ ప్రక్షాళనను కూడా అడ్డుకునేందుకు దుర్మార్గంగా ముందుకు వెళుతున్నారని ఇవి దగాకోరు రాజకీయాలని అన్నారు. ఈ విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టంచేశారు.

జిల్లాలు తిరుగుతా! కాంగ్రెస్‌ని ఎండగడతా



ప్రతిపక్షాల రాద్ధాంతాన్ని, అభివృద్ధిని అడ్డుకుంటున్న తీరును ప్రజాక్షేత్రంలో ఎండగట్టేందుకు త్వరలోనే జిల్లా స్థాయి పర్యటనలకు సిద్ధమవుతున్నానని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. గడిచిన మూడేళ్ళుగా వందలాది సందర్భాల్లో ప్రభుత్వ సంకల్పాన్ని కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారని, ఇప్పటి వరకు చూస్తూ ఓపిక పట్టామని అన్నారు. పెరుగుతున్న వారి ఆగడాలను ఇకపై ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఏ ప్రజలను రెచ్చగొట్టి ప్రాజెక్టులను, అభివృద్ధి పనులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారో ఆ ప్రజలే తిరగబడి తరిమికొట్టే సమయం ఆసన్నమైందన్నారు. కాంగ్రెస్ చిల్లర రాజకీయాలను, న్యాయస్థానాలను ఆశ్రయించి ప్రభుత్వ కార్యకలాపాలను అడ్డుకుంటున్న తీరును క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరిస్తామన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వామ్యం కావలసిన బాధ్యతగల ప్రతిపక్షస్థానంలో ఉండి నీచ రాజకీయాలతో ఉద్యోగాల భర్తీని అడ్డుకోవడం, అర్ధాకలితో మగ్గుతున్న తాత్కాలిక ఉద్యోగుల పట్ల దుర్మార్గంగా వ్యవహరించడం లాంటి అంశాలను తమ పార్టీ తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన సందర్భంలో ప్రజాక్షేత్రంలో తీవ్రమైన భంగపాటుకు గురైన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం వ్యవహరిస్తున్న తీరుతో ప్రజల్లో విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని తెలిపారు. అభ్యుదయ రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న తమ ప్రభుత్వ సంకల్పాన్ని, లక్ష్యాన్ని ఇలాంటి పార్టీలెన్ని కూడగట్టుకుని వచ్చినా అడ్డుకోలేరని కేసీఆర్ ధీమా వ్యక్తంచేశారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు సీఎం మరో వరం

- పేస్కేలు కన్నా అదనంగా వేతనం
- కోర్టుస్ఫూర్తితో అదనంగా మరో వేయి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాంట్రాక్ట్ ఉద్యోగులకు ముఖ్యమంత్రి కెసీఆర్ మరో వరం ఇచ్చారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌ను హైకోర్టు నిలిపివేసినప్పటికీ జీతాలు మాత్రం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఇచ్చేందుకు అంగీకరించింది. దీంతో ఈ ఉత్తర్వుల ఆధారంగా సిఎం కెసీఆర్ వారిపై వరాల జల్లు కురిపించారు. రెగ్యులరైజేషన్ ప్రక్రియ కొంతకాలం నిలిచిపోయినా నష్టమేమీ లేదని, కోర్టు సూచనల ప్రకారం వారికి రావాల్సిన పేస్కేల్ కన్నా రూ.1000ఎక్కువగానే ఇస్తామని సిఎం ప్రకటించారు. రూ.22,000జీతం నిర్ణయించిన వారికి రూ.23,000, రూ.18వేలు ఇవ్వమని కోర్టు చెప్పిన వారికి రూ.19వేలు, రూ.15 వేలు ఉన్న వారికి రూ.16వేలు ఇస్తామని సిఎం ప్రకటించారు. కాంట్రాక్టు ఉద్యోగుల కష్టాలు చెప్పలేనివని, అర్ధాకలితో అలమటిస్తున్నారన్నారు. వారి కడుపు నింపేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్నారు. ఈ పెంపు ద్వారా విద్యుత్ సంస్థలకు రూ.25.8కోట్లు అదనపు భారం పడుతున్నప్పటికీ, కాంట్రాక్టు ఉద్యోగులను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

ఆ ఉన్న సీట్లనూ గెలువలేరు

అడుగడుగునా ప్రజలను అడ్డం పెట్టుకుని సంక్షేమాన్ని అడ్డుకుంటున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడున్న సీట్లను కూడా గెలిచే పరిస్థితుల్లో లేరని సీఎం అన్నారు. అధికార దాహంతో ఉన్మాదులుగా మారి దురాగతానికి పాల్పడుతున్న ఆ పార్టీ నాయకుల విధానాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారని తెలిపారు. చివరకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నా... ఆ అంశాన్ని కూడా రాజకీయ లబ్ధికోసం వాడుకునే ప్రయత్నం చేయడం ఏ మేరకు సమంజసమని ప్రశ్నించారు. ఇకనైనా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ ప్రగతికి సహకరించాలని ఈ సందర్భంగా కేసీఆర్ కాంగ్రెస్ పార్టీకి విజ్ఞప్తి చేశారు. లేకుంటే పొరుగు రాష్ట్రం మాదిరిగా వచ్చే ఎన్నికల్లో పుట్టగతులు లేకుండా పోతారని వ్యాఖ్యానించారు.

సీట్లు పెంచకున్నా... పోయేదేమీలేదు!

జైరాం రమేష్ నిర్వాకమే కారణం



ఇటీవల ఢిల్లీలో ప్రధాన నరేంద్రమోడీని కలిసిన సందర్భంలో ఆయన మాటలను బట్టి చూస్తే తెలుగు రాష్ట్రాల్లో నియోజక వర్గాల పునర్వ్యవస్థీకరణ ఇప్పట్లో లేదన్న విషయం స్పష్టమైందని సీఎం కేసీఆర్ తెలిపారు. అయినప్పటికీ తమ పార్టీ ఆ దిశగా ఏనాడూ ఆశించలేదని స్పష్టంచేశారు. నియోజకవర్గాల పెంపు అంశంపై పునర్వ్యవస్థీకరణ చట్టంలో స్పష్టత ఇవ్వని కారణంగా మోడీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేక పోతోందన్నారు. అందుకు రాజ్యాంగ సవరణ తప్పనిసరి కావడంతో ఈ అంశం ఇప్పట్లో తేలేది కాదన్నారు. నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ స్తంభించడానికి విభజన బిల్లు డ్రాఫ్టు తయారు చేయడంలో కీలకపాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత జయరాం రమేష్ ముఖ్య కారకుడయ్యారని కేసీఆర్ ధ్వజమెత్తారు. అయినప్పటికీ నియోజకవర్గాల పెంపు తమ పార్టీకి ఏమాత్రం ఆవశ్యం కాదని స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో 119 నియోజక వర్గాల్లో గెలుపే లక్ష్యంగా ముందడుగు వేస్తామన్నారు. ఇప్పుడున్న 22 ప్రతిపక్ష స్థానాలు కూడా తమ ఖాతాలో వేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు.

త్వరలో హోంగార్డు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు
ఉద్యోగులతో సమానంగా వేతనం ఇస్తాం



కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించే ప్రక్రియ కొనసాగుతోందని సీఎం కేసీఆర్ తెలిపారు. అన్ని శాఖల నుంచి నివేదికలు తెప్పించుకున్న తర్వాత వారందరికీ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. విద్యుత్ శాఖ పరిధిలో పనిచేస్తున్న ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్ సంస్థల్లో తాత్కాలిక ఉద్యోగులందరికీ బోర్డు ప్రతిపాదించినకన్నా వెయ్యి రూపాయలు అదనంగానే వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 19వేల మంది హోంగార్డుల్లో సుమారు 11వేల మంది రాజధాని నగరంలోనే పనిచేస్తున్నారని తెలిపారు.

వారందరికీ కానిస్టేబుళ్ళతో సమానంగా త్వరలోనే జీతభత్యాలు పెంచబోతున్నట్లు ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో కేవలం రూ.6 వేలు మాత్రమే ఉన్న హోంగార్డు వేతనాలను ప్రస్తుతం రూ.12వేలకు పెంచిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. అలాగే సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరికీ ప్రభుత్వం వేతనాలు సవరించే దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు.



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానించిన ముస్లిం, గిరిజన రిజర్వేషన్లపై పట్టు వదిలే ప్రసక్తే లేదని సీఎం కేసీఆర్ తేల్చిచెప్పారు. ఈ అంశంపై ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నామన్నారు. ఢిల్లీ వెళ్ళిన ప్రతి సందర్భంలో ప్రధానిని కలిసి ఈ రిజర్వేషన్ల ఆవశ్యకతను వివరిస్తున్నానని చెప్పారు. పొరుగు రాష్ట్రం తమిళనాడులో ఏ విధమైన రిజర్వేషన్లు అమలులో ఉన్నాయో యధావిధిగా తెలంగాణాకు కూడా వాటిని వర్తింపజేయాలన్న ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం ఉంచినట్టు తెలిపారు. ఈ అంశంపై ఇటీవల ఢిల్లీ వెళ్ళినపుడు ప్రధానితో చర్చిస్తే తనకు స్పష్టమైన హామీ ఇచ్చారని ఈ సందర్భంగా వెల్లడించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ రెండు సామాజిక వర్గాలకు సంబంధించి రిజర్వేషన్లు సాధించి తీరుతామని ధీమా వ్యక్తంచేశారు. ఒకవేళ కేంద్రం సానుకూలంగా స్పందించకుంటే అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు.

గూర్ఖాలాండ్‌పై వ్యక్తిగతంగా స్పందించను

ప్రత్యేక రాష్ట్రాల ఏర్పాటుకు తమ పార్టీ మద్దతు ఇస్తుందని తెలిపిన సీఎం కేసీఆర్ గూర్ఖాలాండ్ ఆందోళన అంశంపై ఆచితూచి మాట్లాడారు. సరిహద్దు సమస్యతో ముడిపెట్టుకుని ఉన్న, దేశ అంతర్గత భద్రతకు సంబంధించిన ఈ ఉద్యమానికి తాను వ్యక్తిగతంగా స్పందించబోనని స్పష్టంచేశారు. ఇది రాజకీయ అంశమైనందున ఎలాంటి నిర్ణయం తీసుకున్నా పార్టీ ముఖ్య నేతలందరితో చర్చించి తగిన సందర్భంలో ప్రకటిస్తామన్నారు.

వామపక్షాలకు మనుగడే లేదు

అసంఘటిత కార్మికులు, ఉద్యోగులు, ప్రజాసమస్యలపై వామపక్షాల రాద్ధాంతం అర్థరహితమని కేసీఆర్ కొట్టిపారేశారు. అసలు ఆ పార్టీలకు ఇకపై మనుగడే లేదని ఆయన తేల్చిచెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో దేశవ్యాప్తంగా 38 రాజకీయ పార్టీలను కూడగట్టుకుని పోరాటం చేసిన తమ పార్టీ నేడు సంస్థాగతంగా స్థిరంగా ఉందన్నారు. ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ కార్యక్రమాలను ఎండగడుతున్న వామపక్ష పార్టీలకు ఒకశాతం ఓట్లు కూడా లేవని పేర్కొన్నారు. అలాంటి ప్రజాదరణ లేని నాయకుల ఆరోపణలపై తాను స్పందించబోనని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

మీరాకుమార్ పసలేని వ్యాఖ్యలు

కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు మీరాకుమార్ తమ ప్రభుత్వంపై చేసిన ఆరోపణలు, వ్యాఖ్యల్లో ఏమాత్రం పసలేదని కేసీఆర్ పేర్కొన్నారు. నేరెళ్ళలో దళితులపై జరిగిన దాడిని తాము సమర్థించడం లేదని, అయితే ఈ ఘటనను రాజకీయ రాద్ధాంతం చేసి లబ్ధి పొందాలని చూడడం కాంగ్రెస్ నేతల కుట్రేనని ధ్వజమెత్తారు. వాస్తవాలు తెలుసుకోకుండా మీరాకుమార్ మాట్లాడడం సరైన విధానం కాదన్నారు. ఇలాంటి అసందర్భ, ఆధారం లేని ఆరోపణలు చేసినందుకే భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్ షాను బహిరంగ క్షమాపణ డిమాండ్ చేసినట్టు కేసీఆర్ తెలిపారు.

జయరాం రమేష్‌కు కేసీఆర్ సవాల్

తాను జాతీయ స్థాయి నేతనని చెబుకుంటున్న కాంగ్రెస్ నాయకుడు జయరాం రమేష్‌కు ప్రజల్లో ఏమాత్రం ఆదరణ లేదని కేసీఆర్ అన్నారు. ఆయన ఇప్పటి వరకు సర్పంచ్‌గా కూడా గెలువలేదని, అలాంటి వ్యక్తి ఉద్యమ పార్టీని నిందించడం సమంజసం కాదన్నారు. ఆయన చేసిన ఆరోపణలు నిరూపించకుంటే ఆబిడ్స్‌లో నడిరోడ్డుపై ముక్కు నేలకు రాసేందుకు సిద్ధమా? అంటూ సవాల్ విసిరారు. ప్రభుత్వ కార్యకలాపాల్లో భాగంగా వాహనాలు కొనుగోళ్ళు చేస్తున్నా రాజకీయంగా రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పైరవీలు, దళారీ దందాలు పూర్తిగా నిర్మూలించిన తమ ప్రభుత్వంపై ఏ ఆరోపణలు చేసినా వాటిని నిరూపించాల్సిన బాధ్యత ఆయా పార్టీలపై ఉందన్నారు. లేదంటే తాము విసిరిన సవాళ్ళకు తలొగ్గి ముందుకు రావాలన్నారు.

శృతి మించితే పరువునష్టం కేసులు

ప్రతిపక్షాల ఆరోపణలు శృతి మించితే పరువునష్టం కేసులు తప్పవని సీఎం కేసీఆర్ హెచ్చరించారు. ఈ విషయంలో జాతీయ స్థాయి నేతలైనా, రాష్ట్రానికి చెందిన నాయకులైనా వదిలిపెట్టేది లేదన్నారు. నియమ నిబద్ధతతో ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి వందశాతం అభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేస్తున్న తమ ప్రభుత్వ ప్రతిష్టకు భంగం వాటిల్లితే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టంచేశారు. అడ్డగోలు రాజకీయాలు మానుకోకుంటే మనుగడే ప్రశ్నార్థకమవుతుందన్న విషయాన్ని ప్రతిపక్ష నేతలు గమనించాలన్నారు.



రిజర్వేషన్లపై పట్టువదలం

కేంద్రానికి అంశాలవారీ మద్దతు మాత్రమే



తమ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వానికి అంశాలవారీ మద్దతు మాత్రమే ఇస్తోందని సీఎం కేసీఆర్ ఒక ప్రశ్నకు సమాధానంగా స్పష్టంచేశారు. ఒక దళిత నేతను రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించినందుకు సంతోషిస్తూ ప్రధాని మోడీని నిర్ణయానికి మద్దతు తెలిపామన్నారు. అలాగే దక్షిణాది రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న తెలుగుబిడ్డ వెంకయ్య నాయుడును ఉపరాష్ట్రపతి పదవికి అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే మద్దతు తెలిపామన్నారు. కేంద్రంతో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో సహృద్భావ సంబంధాలు కలిగి ఉంటామని, ఆ ప్రభుత్వానికి ప్రత్యక్ష మద్దతు ఇవ్వాలన్న ఆలోచన తమ పార్టీకి లేదని పునరుద్ఘాటించారు. ఇటు రాష్ట్రాభివృద్ధితో పాటు అటు దేశ నిర్మాణంలోనూ తమవంతు భాగస్వామ్యంతో ముందడుగు వేస్తామన్నారు.



హైదరాబాద్,కెఎన్ఎన్ : తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ (ఎఫ్‌డీసీ) చైర్మన్ పుస్కూర్ రామ్‌మోహన్‌రావు-రేణుకరావుల కుమార్తె దీప్య వివాహం విష్ణుచరణ్‌తో బుధవారం జరిగింది. ఈ వివాహ వేడుకకు సీఎం కేసీఆర్, మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు, మంత్రులు హరీష్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ఇంద్రకరణ్ రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, నమస్తే తెలంగాణ సీఎండీ దామోదర్‌రావు, కేకే, జి.వివేక్, వినోద్, ఎర్రబెల్లి, యాదవరెడ్డి, సినీ ప్రముఖులు కృష్ణ సురేష్‌బాబు, సుధాకర్‌రెడ్డి, నితిన్, అల్లు అరవింద్, శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, కె.మురళీ మోహన్‌రావు, బీవీఎస్ఎన్ ప్రసాద్, సి.కల్యాణ్, ఆర్. నారాయణమూర్తి, వి.వినాయక్, జెమిని కిరణ్‌తోపాటు పలువురు రాజకీయ ప్రముఖులు విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు.



తమ కుమారుడి వివాహానికి రావాల్సిందిగా సీఎం కేసీఆర్‌ను ఆహ్వానిస్తున్న తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ మధుసూధనాచారిదృశ్యం.

అంతర్గత భద్రత సలహాదారుగా

నరసింహన్?



(మొదటిపేజీ తరువాయి)

ఛాంబర్‌కు చేరుకున్నారు. మోడీ వచ్చిన తర్వాత మరో అర గంట పాటు నరసింహన్ లోపలే ఉన్నారు. సాయంత్రం గం. 5 సమయంలో బయటికొచ్చిన నరసింహన్ నేరుగా అక్కణు?ంచి ఎయిర్‌పోర్టుకు బయల్దేరారు. ప్రధాని కార్యాలయం నుంచి బయటి కొచ్చిన సమయంలో నరసింహన్ చేతి నిండా అనేక దస్త్రాలతో కూడి పెద్ద ఫైల్ కనిపించింది. గంటకు పైగా దేనిపై చర్చించారని మీడియా ప్రశ్నించగా, సాధారణ సమావేశమేనంటూ ఆయన ఎప్పటిలా గోప్యతను ప్రదర్శించారు. తెలుగు రాష్ట్రాలకు వేర్వేరుగా గవర్నర్లను నియమిస్తారని జరుగుతున్న చర్చపై ప్రశ్నించగా ''మీరే అంటున్నారు. నాకేమీ తెలియదు. మీరే చెప్పాలి'' అంటూ సమాధానమిచ్చారు. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వంలో కీలక పదవి చేపట్టబోతున్నారని జరుగుతున్న ప్రచారం ప్రశ్నించినా అదే రకమైన జవాబు ఎదురైంది. చివరకు గంటకు పైగా కొనసాగిన భేటీలో అసలు దేని గురించి చర్చించారో చెప్పండని ప్రశ్నిస్తే ''అది మీరు అడిగినా నేను చెప్పకూడదు. చెప్పలేను కూడా'' అనుకుంటూ అక్కణ్ణుంచి వెళ్లిపోయారు.

సుదీర్ఘానుభవమే ప్రధానార్హత

గవర్నర్ నోటి నుంచి వచ్చిన సమాధానాల సంగతెలా ఉన్నా ప్రధాని కార్యాలయంలో గంటకు పైగా ఏ అంశాల గురించి చర్చించారన్నదే ఆసక్తికరంగా మారింది. కేంద్ర ప్రభుత్వంలోని అధికార వర్గాల ద్వారా అందుతున్న సమాచారం మేరకు నరసింహన్‌ను అంతర్గత భద్రతా సలహాదారుగా నియమించేఅవకాశముందని తెలుస్తోంది. 1968 బ్యాచ్ ఆంధ్రప్రదేశ్ క్యాడర్ ఐపీఎస్ అధికారిగా పనిచేసిన నరసింహన్, సుదీర్ఘకాలం పాటు కేంద్ర నిఘా విభాగం (ఇంటెలిజెన్స్ బ్యూరో)లో పనిచేశారు. 2006 డిసెంబర్ 31న పదవీ విరమణ పొందే వరకు ఐబీలో వివిధ ర్యాంకుల్లో పనిచేసిన నరసింహన్ ఆ విభాగాధిపతిగానూ సేవలందించారు. అంతర్గత భద్రతపై విశేషానుభవం కల్గిన నరసింహన్ సేవల్ని అంతర్గత భద్రత కోసమే ఉపయోగించుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

దోవల్‌తో సాన్నిహిత్యం నరసింహన్ బలం

నిజానికి జాతీయ భద్రతా సలహాదారుగా ఉన్న అజిత్ కుమార్ దోవల్, గవర్నర్ నరసింహన్ అత్యంత సన్నిహితులు. ఇద్దరూ 1968 బ్యాచ్ ఐపీఎస్ అధికారులే. అయితే దోవల్ కేరళ క్యాడర్ కాగా, నరసింహన్ ఏపీ క్యాడర్. ఇద్దరూ ఇంటెలిజెన్స్ బ్యూరోలోనే సుదీర్ఘకాలం సేవలందించారు. దోవల్ పదవీ విరమణ తర్వాత నరసింహన్ ఆ విభాగానికి అధిపతిగా పనిచేశారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య స్నేహం, సమన్వయంతో పాటు ఇద్దరికీ దేశ భద్రతకు సవాళ్లు విసిరే వివిధ అంశాలపై సుదీర్ఘానుభవం ఉంది. అందుకే జాతీయ భద్రతా సలహాదారుగా పనిచేస్తున్న దోవల్ అండదండల కారణంగానే నరసింహన్ ఇంతకాలం గవర్నర్ పదవిలో కొనసాగుతున్నారు. యూపీఏ హయాంలో నియమించిన గవర్నర్లందరినీ ఎన్డీయే ప్రభుత్వం పక్కనపెట్టినప్పటికీ నరసింహన్‌ను మాత్రం పక్కన పెట్టలేదు.

కాశ్మీర్ సమస్యే కారణం

జాతీయ భద్రతా సలహాదారుగా ఉన్న దోవల్ అటు దేశానికి శత్రుదేశాల నుంచి ఎదురయ్యే ముప్పు, సవాళ్లతో పాటు అంతర్గతంగా ఎదురయ్యే సవాళ్లను కూడా చూడాల్సి వస్తోంది. అయితే అంతర్గత భద్రత కోసం ప్రత్యేకంగా నరసింహన్‌ను నియమించుకోవాలని దోవల్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. కొన్ని దశాబ్దాలుగా దేశాన్ని ఇబ్బందిపెడుతున్న అంతర్గత సవాళ్లలో వామపక్ష తీవ్రవాదం ఒకటి. ఇప్పుడు దాన్ని మించి కాశ్మీర్ వేర్పాటువాదం కేంద్ర ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. అందుకే అంతర్గత భద్రతా సలహాదారును నియమించుకుని ఈ రెండు సవాళ్లను మరింత సమర్థవంతంగా ఎదుర్కోవాలని కేంద్ర ప్రభుత్వం కూడా భావిస్తోంది. ఆ క్రమంలోనే నరసింహన్ ట్రాక్ రికార్డుకు తోడు దోవల్‌తో ఉన్న సాన్నిహిత్యం కలిసొచ్చాయని తెలుస్తోంది.

కేబినెట్‌తోపాటు కొత్త పోస్టు

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ముగిసిన వెంటనే జరగనున్న కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణతో పాటు ఖాళీగా ఉన్న అనేక రాష్ట్రాల గవర్నర్ల పోస్టులను భర్తీ చేయనున్నారు. బిహార్ గవర్నర్‌గా పనిచేసిన రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రపతి అయ్యారు. దీంతో బిహార్, తమిళనాడు సహా మరికొన్ని రాష్ట్రాల్లో గవర్నర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పార్టీలో సీనియర్ నేతలకు గవర్నర్ వంటి రాజ్యాంగ పదవులను ఇవ్వడం పరిపాటి. ఆ క్రమంలో తెలుగు రాష్ట్రాలకు కూడా వేర్వేరుగా గవర్నర్లను నియమించనున్నారని తెలుస్తోంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గుజరాత్ మాజీ సీఎం ఆనందిబెన్ పటేల్, తెలంగాణకు కర్ణాటకకు చెందిన బీజేపీ సీనియర్ నేత శంకరమూర్తి రానున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ తరుణంలో ప్రస్తుత గవర్నర్ నరసింహన్ ప్రధానితో మంతనాలు సాగించడం చర్చనీయాంశమైంది. కొత్త బాధ్యతల నియామకానికి సంబంధించే ప్రధాని కార్యాలయ సహాయ మంత్రి జితేందర్ సింగ్, ఆ తర్వాత ప్రధాని నరేంద్ర మోడీతో నరసింహన్ చర్చించారు. నియామక పత్రాలు సైతం సిద్ధమవుతున్నాయని తెలుస్తోంది.

ఆర్థికం కాదు ఆరోగ్యం ముఖ్యం

(మొదటిపేజీ తరువాయి)

సిద్ధపడటంలేదు. ఇప్పటికే అలవాటుగా మారిన వంటగ్యాస్‌పై సబ్సిడీ తొలగిస్తే ఆర్థిక భారాన్ని పేదలు మోయగలరో లేదోనన్న ఆలోచన కూడా ఈ ప్రభుత్వానికి పట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఎందరో సంపన్నులు తమ వద్దనున్న బిలియన్ల కొద్దీ సంపదను సామాజిక కార్యక్రమాలకు ఉపయోగించాలని నిర్దేశిస్తూ వీలునామాలు రాసేశారు. బిల్‌గేట్స్, వారెన్‌బఫెట్, జుకర్‌బర్గ్ నుంచి మనదేశానికి చెందిన ఇన్ఫోసిస్ నారా యణమూర్తి వంటి తదితరులంతా తమ సంపదను ఆరోగ్యకరమైన భావిభారత నిర్మాణ నిమిత్తం ట్రస్ట్‌ల ద్వారా విరాళాలుగా ఇచ్చేస్తున్నారు. ముఖ్యంగా తల్లీపిల్లల సంక్షేమానికి, ఆరోగ్యానికి పెద్దపీటేసే కార్యక్రమాలకే ఈ నిధుల్ని అందిస్తున్నారు. వీరి లక్ష్యం ఒకటే.. భవిష్యత్‌లో రోగాల్ని తట్టుకుని అత్యున్నత మేధావులుగా, శారీరకంగా దృఢంగా ఉండే బలమైన జాతి నిర్మాణం. అయితే అది ఇప్పుడు ప్రభుత్వాలకు కొరవడినట్లుగా కనిపిస్తోంది.



దేశంలో వ్యాపార వినియోగ సిలెండర్లకు ఎలాగూ సబ్సిడీ లేదు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 24కోట్ల ఇళ్ళుంటే 14కోట్ల మందికి గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. గ్రామాలు, కొండ ప్రాంతాల్లోని పదికోట్ల ఇళ్ళల్లో ఇంకా వంట చెరకు, పేడతో చేసిన పిడకలు, బొగ్గునే వంటింటి ఇంధనంగా వినియోగిస్తున్నారు. మోడీ అధికారంలోకొచ్చాక ఉజ్వల పేరిట గ్యాస్ కనెక్షన్ల జారీని పెద్ద ఎత్తున ప్రారంభించారు. ఈ పథకంలో ఏకంగా 1.60 కోట్ల కుటుంబాలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందించారు. అంతకుముందు కొన్ని రాష్ట్రాల్లో దీపం వంటి పథకాల ద్వారా మహిళలకు ఉచితంగానే గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారు. గతేడాది దేశం మొత్తమ్మీద 19మిలియన్ టన్నుల వంట గ్యాస్‌ను వినియోగించారు. ఏటేటా ఇది పదిశాతం చొప్పున పెరుగుతోంది. తాజా అంచనాల మేరకు మొత్తం గ్యాస్ కనెక్షన్లలో 35శాతం వరకు ఎస్సీ, ఎస్టీ కుటుంబాల వద్దే ఉన్నాయి. 43శాతం కనెక్షన్లు దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలు వినియోగిస్తున్నాయి. మోడీ ప్రకటించిన ''గివ్ ఇట్ అప్'' పథకంతో ఉన్నత వర్గాలన్నీ సబ్సిడీని వదిలేసుకున్నాయి. దీంతో ఏటా 21వేల కోట్ల సబ్సిడీ ఆదాఅవుతోంది. ఇదే సమయంలో గ్యాస్ సబ్సిడీని నేరుగా వినియోగదార్ల ఖాతాల్లో జమ చేయడం మొదలెట్టారు. దీంతో నకిలీ కనెక్షన్ల బెడద తొలగిపోయింది. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలోని ప్రతిపైసా నేరుగా వినియోగదారుడికి చేరుతున్నది. గత రెండేళ్ళలో గ్యాస్ ధర అనూహ్యంగా తగ్గిపోయింది. దీంతో ఏటా సబ్సిడీ భారం రూ.20 వేల కోట్లకు పరిమితమైంది.

గతంలో వంటచెరకుతో పాటు కిరోసిన్‌ను కూడా విరివిగా వినియోగించేవారు. అయితే మార్కెట్లో కిరోసిన్ ధర విపరీతంగా పెరిగింది. దీన్ని ప్రభుత్వం సబ్సిడీపై కొన్నాళ్ళు సరఫరా చేసింది. గ్యాస్ కనెక్షన్ల పెంపుతో ఈ సబ్సిడీ భారాన్ని ఇప్పటికే కేంద్రం ఉపసంహరించుకుంది. ఇప్పుడు కేంద్రం ఒక్కో రేషన్ కార్డుపై ఒక లీటర్ కిరోసిన్‌ను మాత్రమే సబ్సిడీపై సరఫరా చేస్తోంది. ఇది వంటకు ఏ మూలకు సరిపోదు. ఈ సమయంలో గ్యాస్‌పై సబ్సిడీ తొలగింపు పేద, బడుగు వర్గాల కుటుంబీకులకు అదనపు భారమౌతుంది.

కేంద్రం ఎల్పీజీ కనెక్షన్లను ఉచితంగా అందించడంలో మరో లక్ష్యం కూడా ఉంది. గ్యాస్ కనెక్షన్లు రాకముందు గ్రామాల్లో ఎక్కువగా వంటచెరకును వినియోగించేవారు. ఇందుకోసం దగ్గరున్న అడవుల నుంచి కట్టెల్ని సేకరించేవారు. అంచెలవారీగా చెట్లు నరకడంతో అటవీ సంపద విస్తీర్ణంపై ఇది ప్రభావం చూపుతోంది. ఓ వైపు కేంద్రంతో పాటు అంతర్జాతీయ సమాజం కూడా మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టిపెట్టాయి. ఉన్నచెట్లను నరికేందుకు పర్యావరణ నిపుణులు అంగీకరించడం లేదు. దీన్ని కట్టడి చేసేందుకు గ్యాస్ కనెక్షన్ల విస్తృత పంపిణీ దోహదపడింది. అలాగే వంటచెరకు, బొగ్గు, పిడకలతో వంట నిర్వహణవల్ల వాతావరణంలో పెద్దఎత్తున కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్‌లు మిళితమౌతున్నాయి. ఇది పర్యావరణానికి హానిచేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ హానికారక విషతుల్యాలను తగ్గించాలని ప్యారిస్ ఒప్పందం నిర్దేశిస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని కూడా ప్రభుత్వం పెద్దసంఖ్యలో ఉచితంగానే గ్యాస్ కనెక్షన్లను ఇచ్చేసింది. ఓ వైపు వనం-మనం, నీరు-చెట్టు, కోటిమొక్కలు అంటూ మరోవైపు తిరిగి చెట్లను నరికి వంటకు వినియోగించడాన్ని ప్రోత్సహించే విధంగా గ్యాస్‌పై సబ్సిడీ తొలగింపునకు కేంద్రం తెరదీస్తోందన్న విమర్శలున్నాయి. గ్యాస్ ధర భరించలేని దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలు తిరిగి పాతతరం నాటి వంట విధానాల్ని ఆశ్రయించక తప్పదని సామాజిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇది పర్యావరణానికి, మహిళల ఆరోగ్యానికి తీవ్ర చేటుతెస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక మేరకు వంటచెరకుతో ఒక గంట సేపు వంట చేస్తూ పొయ్యివద్ద కూర్చున్న మహిళకు ఆవహించే పొగ నాలుగొందల సిగరెట్లు కాల్చడంతో సమానమంటూ నిర్దేశించింది. అలాగే వంట చెరకు, పిడకలు, బొగ్గుల ద్వారా వెలువడే పొగలో వందల సంఖ్యలో విషతుల్యాలుంటాయి. ముఖ్యంగా టోటల్ సస్పెండెడ్ పర్టిక్యులేట్స్, పోలీసైక్లిక్, ఆరోమేటిక్, హైడ్రోకార్బన్స్, కార్బన్ మోనాక్సైడ్‌లు ఇందులో ప్రధానమైనవి. పోలీసైక్లిక్ ఆరోమేటిక్ హైడ్రో కార్బన్స్‌గా పరిగణించే బెంజోపైరైన్, నాఫ్తలిన్, ఫ్లూరేన్, ఫెనంతరేన్, ఎసెనఫ్‌థేన్‌లు కూడా వెలువడతాయి. ఇవన్నీ క్యాన్సర్ కారకాలుగా ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రిసెర్చ్ ఆన్ క్యాన్సర్ సంస్థ ప్రకటించింది. అలాగే హైడ్రోసైఫరేన్ ద్వారా మూత్రపిండ వ్యాధులు ప్రబలుతాయి. వంట చెరకును అత్యధికంగా వినియోగించే బురుండిలో ప్రపంచ స్థాయిలోని మూత్రపిండ సగటు రోగులతో పోలిస్తే 30రెట్లు అధికంగా ఉన్నట్లు తేలింది. బొగ్గును వంటకు వినియోగించడం ద్వారా కార్బన్ మోనాక్సైడ్ అత్యధికంగా విడుదలౌతుంది. ఇది ఊపిరితిత్తుల వ్యాధులకు కారణమౌతుంది. వంటపొగ కారణంగానే భారత్, టర్కీ, నైజీరియాలలో బ్రాంకైటీస్, ట్యూబర్‌ఫులోసిస్ అత్యధికంగా ఉన్నట్లు తేలింది. ఇక పశువులపేడతో తయారుచేసిన పిడకల్ని వంటకు వినియోగించడం వల్ల వెలువడే పొగనుంచి ఆస్మాకు గురిచేసే విషవాయువులు వెలువడతాయి. ఇవి లంగ్‌కేన్సర్‌కు కారణమౌతాయి. వీటన్నింటికి మించి ఈ పొగ కళ్ళకు తీవ్రహాని చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా వంటచెరకు వినియోగం కారణంగా అంధులైనవారి సంఖ్య 1.30కోట్లు. ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా దేశాల్లోనే ఈ సంఖ్య అత్యధికంగా ఉంది. అలాగే వంటకు వీటిని వినియోగించే మహిళలకు పుట్టే పిల్లలు తక్కువ బరువుతో జన్మిస్తున్నారు. కార్బన్ మోనాక్సైడ్ కారణంగా తల్లిగర్భంలోని శిశువులు కూడా అనారోగ్యం పాలౌతున్నారు. దీంతో పాటు వీరికి రోగనిరోధక శక్తి కూడా తగ్గిపోతున్నట్లు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం సబ్సిడీల భారాన్ని తగ్గించుకునే ప్రయత్నంలో దీనివల్ల కలిగే నష్టాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడంలేదు. ద్రవ్యోల్బణాన్ని స్థూల జాతీయోత్పత్తిలో రెండుశాతానికి పరిమితం చేయాలన్న ప్రపంచబ్యాంక్ ఆదేశాల నేపథ్యంలో పరోక్ష సంకేతాల్ని పట్టించుకోవడం లేదు. ఇది భావి భారత సమాజంపై తీవ్ర ప్రభావం చూపించే అంశంగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. చిన్నపాటి సబ్సిడీని తప్పించుకునే యత్నంలో భవిష్యత్ తరాల ఆరోగ్యం, మేథోశక్తి, రోగనిరోధక వ్యవస్థలపై ప్రభావం చూపే నిర్ణయాన్ని కొనసాగించడం సరికాదని సూచిస్తున్నారు.



చేప పిల్లల పంపిణీపై అవగాహన సదస్సులు

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తలసాని

హైదరాబాద్, ఆంధ్రప్రభ :చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని జిల్లాల్లోని రిజర్వాయర్ల వద్ద జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. బుధవారం సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో చేప పిల్లల పంపిణీ మరియు గొర్రెల పంపిణీ కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లు, చెరువులలో ఈ సంవత్సరం సుమారు 70 కోట్ల చేపపిల్లలను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో గొర్రెల అభివృద్ధి సమాఖ్య చైర్మన్ కె.రాజయ్య యాదవ్, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, గొర్రెల అభివృద్ధి సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సదస్సులకు జిల్లాలకు చెందిన మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మత్స్యసహకార సొసైటీ సభ్యులు, చేపపిల్లల సరఫరా కాంట్రాక్టర్లను ఆహ్వానించాలని పిలుపునిచ్చారు. చేపపిల్లలను నీటిలో విడుదల చేసే సమయంలోనే నిబంధనల ప్రకారం ఉన్న చేపపిల్లలను మాత్రమే పరిశీలించి వదలాలని ఈ కార్యక్రమాన్ని వీడియోలో బంధించాలని కోరారు. నిబంధనల ప్రకారం లేని చేపపిల్లలను తిరిగి వెనక్కు పంపించాలని ఆదేశించారు.

చేపపిల్లల నాణ్యతలు పరిశీలించే సమయంలో ఆయా మత్స్యసహకార సొసైటీల సభ్యులు ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. చేపపిల్లలను వదిలాక ఫిర్యాదులు వస్తే ఏమీ చేయలేని పరిస్థితి ఉంటుందని చెప్పారు. మత్స్యశాఖలో సిబ్బంది కొరత ఉన్నందున నీటిలో చేపపిల్లలను వదిలేటప్పుడు రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల సిబ్బంది సేవలను తీసుకోవాలని పేర్కొన్నారు. మరో వారం రోజుల్లో సంచార పశువైద్య వాహనాలను సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. 1962 టోల్‌ఫ్రీ నెంబరు ద్వారా ఈ సంచార పశువైద్య వాహనాలు గొర్రెల మంద వద్దకు వెళ్లి వైద్య సేవలనందిస్తాయని తెలిపారు. గొర్రెల కొనుగోళ్లలో సమస్యలు ఉత్పన్నమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. గొర్రెల కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, నిధుల కొరత లేదని తలసాని తెలిపారు. గొర్రెల పంపిణీ కార్యక్రమంతో రాష్ట్రంలో గొర్రెల సంఖ్య పెరిగిందని తెలిపారు.

నిరుపేదలకు శాపం



నిరుపేదల శ్రేయస్సే లక్ష్యమంటూ పథకాలను ప్రవేశ పెట్టే కేంద్ర ప్రభుత్వం వైఖరి వారి పాలిట శాపంగా మారింది. సబ్సిడీలతో మేలు చేస్తుందని భావిస్తుంటే నడ్డివిరిచే నిర్ణయాలతో ఆగాధంలోకి నెట్టివేస్తున్నాయి. సబ్సిడీ ఎత్తివేతతో సామాన్య ప్రజలకు తీవ్రనష్టం జరగడం ఖాయం. ఆ నష్టాలను ఎవరు భరించలేరు. కావున వినియోగదారులకు అందించే సబ్సిడీలో ఎలాంటి మార్పులు లేకుండా చూడాలి. **-భాగ్యలక్ష్మి, గృహిణి, తాండూరు**


సామాన్య ప్రజలు భరించలేరు



అసలే అంతంత మాత్రంగా కొనసాగుతున్న సామాన్య ప్రజలకు ఈ గ్యాస్ పై ఉన్న సబ్సిడీ తొలగిస్తే మరో 250 రూపాయల అదనపు భారం పడుతుందని ఇది సామాన్య ప్రజలకు ఇబ్బంది కరం అని వికారాబాద్ పట్టణంలోని శివరాం నగర్ రేషన్ షాపు డీలర్ బిఎం.శ్రీనివాస్ అభిప్రాయ పడ్డారు.ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలతో పాటు కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటగా ఈ గ్యాస్ సబ్సిడీ రద్దుతో మరింత అదనపు భారం పడుతుందని అన్నారు.కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి గ్యాస్ సబ్సిడీ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో ప్రజల ఆగ్రహానికి గురి కాక తప్పదని ఇది తన మాట కాదని సామాన్య ప్రజల మాటగా ఆయన తెలిపారు.


- రేషన్ డీలర్ బిఎం.శ్రీనివాస్

రోజువారీ కూలీలు బతకలేరు



గ్యాస్ సబ్సిడీ ఎత్తివేసి, రేట్లు పెంచడం వల్ల కార్మికులు, రోజుకూలీలు, వ్యవసాయ, రైతువారీ కుటుంబాలు ఇబ్బందికి గురవుతాయని నాల్గవ తరగతి రిటైర్డు ఉద్యోగి ఎన్.పిచ్చయ్య అభిప్రాయ బడ్డారు. ధనవంతులు, ఉన్నత వర్గాలకు సబ్సిడీలు తొలగించి పేదలకు కొనసాగించాలని, ఉచితంగా గ్యాస్ ఇచ్చినా ఇబ్బంది ఉండదని సూచించారు. చిరుద్యోగులకు కూడా సబ్సిడీ కొనసాగించాలని, ధనవంతులు, అధిక ఆదాయం కల్గిన వారిని సర్వే చేసి సబ్సిడీ నుండి తొలగించాలని, పేదలకు తొలగించడం ఇబ్బందిగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. **-రిటైర్డు నాల్గవతరగతి ఉద్యోగి ఎన్.పిచ్చయ్య**

ధర తగ్గించి సబ్సిడీ ఎత్తేయండి



సామాన్య మధ్యతరగతి పేద కుటుంబాలకు ఎటువంటి ప్రయోజనం ఉండ దని రోడ్డు వెంబడి బడ్డీ టీ స్టాల్ నిర్వాహకుడు గాజుల రాములు అభిప్రాయబడ్డారు. గ్యాస్ రేట్ తగ్గించి సబ్సిడీ తొలగిస్తే ఇబ్బంది లేదు. కాని అందరినీ ఒకే రీతిలో ప్రభుత్వం చూస్తూ తొలగించడం, గ్యాస్ రేట్లు పెంచడం మాలాంటి సామాన్యులు భరించ లేదు. రోజుకు తాను టీ అమ్మడం ద్వారా రూ.300 చొప్పున నెలలో 25రోజులు టీ అమ్మడం ద్వారా రూ.7500 నెలకు వస్తాయి. వీటితో కుటుంబం గడవడం ఇబ్బందికరంగా ఉంది. దీనికితోడు గ్యాస్ రేటు పెంచితే కష్టమే. **- టీస్టాల్ నిర్వాహకుడు గాజుల రాములు**

సబ్సిడీని ఎత్తివేయద్దు



గ్యాస్‌పై సబ్సిడీని ఎత్తివేయవద్దని శామీర్‌పేట మండలం తూంకుంట గ్రామానికి చెందిన గృహిణి గుడూరి రాణి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మహిళలు ముఖ్యంగా గ్యాస్‌లేనిదే వంటింట్లో ఏమి చేయలేరని, గ్యాస్‌పై ధర పెంచడం దారుణమని ఆమె అన్నారు. ఇది పేద ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆమె చెప్పారు. అసలే మార్కెట్లో నిత్యావసర ధరలపై పేద, మధ్యతరగతి ప్రజలం సతమతమవుతుంటే గ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పేదలు బతుకు భారంగా మారుతుందని ఆమె అన్నారు. గ్రామాల్లో కూలీనాలీ చేసుకునే పేద వర్గాలపై గ్యాస్ పెంపు పెనుబండగా మారుతుందని అన్నారు. గ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వెనుకకు తీసుకోకపోతే మహిళల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. **-రాణి, గృహిణి**

సామాన్యుల నడ్డివిరచడమే



మనిషికి నిత్యవసరమైనటువంటి వంట గ్యాస్‌పై ధరను పెంచుతూ సబ్సిడీ ఎత్తివేయాలనుకోవడం సామాన్య ప్రజల నడ్డివిరచడమేనని తూంకుంట గ్రామ నివాసి గంగారెడ్డి అన్నారు. పేద ప్రజలపై భారం మోపుతూ కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపుకోవడం సమంజసంకాదని పేర్కొన్నారు. గ్యాస్‌పై సబ్సిడీ ఎత్తివేయడం భావ్యంకాదని, ధరలపై నియంత్రణ ఉండేల ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని నెలనెల 4 రూపాయలు పెంచడం ధారుణమని ఆయన అన్నారు. పేద ప్రజల ఆర్థిక స్థితిని బట్టి ధరల నిర్ణయం ఉండాలని చెప్పారు. గ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వ నిర్ణయం పేద, మధ్యతరగతి వర్గాలపై పెనుభారం పడుతుందని అన్నారు. గ్యాస్‌పై పెంచిన ధరను వెనుకకు తీసుకోని సబ్సిడీ కొనసాగించాలని గంగారెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. **- గంగారెడ్డి, రైతు**

గ్యాస్ ధర పెంచొద్దు



చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకొని జీవించే కుటుంబాలకు గ్యాస్ ధర పెంపు మోయలేని భారంగా మారుతుంది. కేంద్రం తీసుకునే నిర్ణయం హేయమైన చర్య. కేవలం సబ్సిడీని ఎత్తివేసేందుకు పన్నిన కుట్ర. ప్రతినెలా ధరల పెంపువల్ల సామాన్య జీవితం అతలాకుతలం అవుతుంది.

-సింగం యాదగిరి, శేరిపల్లి టీఆర్ఎస్ అధ్యక్షుడు

సామాన్యులపై భారం



మోడీ ప్రభుత్వం నోట్ల రద్దుతో సామాన్యుల నడ్డి విరవడమే కాకుండా బడాబాబుల నల్లధనాన్ని తెలుపు చేయడం జరిగింది. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరగడమే కాకుండా ఇప్పుడు వంటగ్యాస్ పెంచడం సామాన్యుల నడ్డి విరవడమే. కేంద్రంలో నిరంకుశపాలన కొనసాగుతుంది. పన్నుల పేరిట మోయలేని భారాన్ని మోపిస్తున్నారు. గ్యాస్ ధర పెంచడం సరికాదు.

- మామిళ్ళ ఆంజనేయులు, కాంగ్రెస్ నేత, మెదక్

ప్రజలపై భారం మోపొద్దు



కేంద్ర ప్రభుత్వం బీద, మధ్య తరగతి ప్రజలపై భారం మోపుతూ గ్యాస్ సిలిండర్లపై సబ్సిడీని ఎత్తివేయడం సబబు కాదు. గతంలో మాదిరిగా ప్రభుత్వం సబ్సిడీని యథావిధిగా కొనసాగించారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా జీఎస్టీని అమలు చేస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవడంపై ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. నిత్యవసరాల్లో భాగంగా గ్యాస్ సిలిండర్ తప్పని సరి కావడంతో సామాన్య ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయి.

- టి. రాంమోహన్‌రెడ్డి (పరిగి ఎమ్మెల్యే)

సబ్సిడీ లేకుంటే కష్టమే



కేంద్ర ప్రభుత్వం తీసుకున్న సబ్సిడీ ఎత్తివేత నిర్ణయంతో మహిళలకు వంట చేసుకోవడం ఇబ్బందికరంగా మారుతుంది. కట్టెల పొయిపై వంట చేసుకునే పరిస్థితులు నేటి సమాజంలో లేవు. కావున కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనకి తీసుకొని సబ్సిడీని కొనసాగించాలని కోరుతున్నారు.

- డా. ఇందిరాదేవి (జడ్పీటీసీ) ..

చిరు వ్యాపారులకు గడ్డు కాలం



గ్యాస్‌పై సబ్సిడీ ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చిరు వ్యాపారులకు గడ్డు కాలంగా మార నుంది. చిరు వ్యాపారులను దారిద్ర్యరేఖ దిగువనున్న ప్రజలకు దృష్టిలో ఉంచుకొని సబ్సిడీని కొనసాగించాలి. ఈ నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలి.

- బ్లూసీ జాని, సూర్యాపేట పట్టణం

పేదలపై తీవ్ర ప్రభావం



గ్యాస్ ధరలు చీటికి మాటికి పెరుగుతున్నాయి. దాంతోనే పేదలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పుడు సబ్సిడీ ఎత్తివేస్తే పేదలపై తీవ్ర ప్రభావం పడుతుంది. గ్యాస్ వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. గతంతో పోల్చుకుంటే ఇప్పుడు గ్యాస్ ధరలు దశల వారిగా పెరుగుతూనే ఉన్నాయి. మళ్లీ ధరలు పెంచి సబ్సిడీ ఎత్తివేసి పేదలను అష్టకష్టాల పాలు చేసేందుకే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. **- షేక్ మొసిన్ - ఎంఐఎం ప్రెసిడెంట్ (ఇచ్చోడ)**

దీపం ఎందుకు సారూ..



ప్రధాని నరేంద్రమోడీ ఈ నిర్ణయం తీసుకోవడం వల్ల దీపం కనెక్షన్లకు అర్థం లేకుండా పోతుంది. దీపం ద్వారా గ్యాస్ బుడ్డి వచ్చినందుకు సంతోష పడ్డాం. ఇప్పటికే రేట్లలో తరచూ మార్పులు ఉంటుండటంతో గ్యాస్‌ను పొదుపుగా వాడుకుంటున్నాం, ఇగ సబ్సిడీ ఎత్తివస్తే గ్యాస్ ఎలా వాడేది, ఇప్పటికైనా సర్కారు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి.

- గాదె వెంకటమ్మ, అర్కాలపల్లి, చిగురుమామిడి, కరీంనగర్ జిల్లా

ఢిల్లీ ఆకాశవాణి కేంద్రం అధిపతిగా తెలుగు మహిళ

శైలజాసుమన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ :ఢిల్లీలోని ఆకాశవాణి కేంద్రం డైరెక్టర్ పదవిలో తొలి తెలుగు మహిళ నియమితులయ్యారు. గత 35 సంవత్సరాలుగా ఆకాశవాణి, దూరదర్శన్ మార్కెటింగ్ విభాగాల్లో వివిధ పదవులు నిర్వహించిన మల్లాది శైలజాసుమన్‌ను ఢిల్లీ ఆకాశవాణి కేంద్రం డైరెక్టర్‌గా నియమిస్తూ కేంద్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. శైలజా సుమన్ ఆధ్వర్యంలో రూపొందించిన అనేక కార్యక్రమాలకు ప్రతిష్టాత్మక రాష్ట్ర ప్రభుత్వ స్వర్ణ నంది, రజిత నంది అవార్డులు వచ్చాయి. విజయవాడలో దూరదర్శన్ సప్తగిరి కేంద్రం పూర్తి స్థాయిలో ఏర్పాటు కావడానికి ఆమె విశేష కృషి చేశారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఓ మహిళ ఢిల్లీలోని ఆకాశవాణి కేంద్రానికి అధిపతిగా నియామకం కావడం ఇదే ప్రథమం.

కమ్యూనిస్టులు మూర్ఖులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కమ్యూనిస్టులు మూర్ఖులు... ఇష్టారాజ్యంగా వ్యాఖ్యలు చేస్తున్నారు.. అందుకే వారికి అపాయింట్ ఇస్తలేను అని సీఎం కేసీఆర్ ఒక ప్రశ్నకు సమాధానంగా తీవ్రమైన ఆగ్రహం వ్యక్తంచేశారు. తాను వ్యవసాయ క్షేత్రానికి వెళితే జల్సాలు చేయడానికేనని తన ప్రతిష్టదెబ్బతినేలా మాట్లాడడం వారి సంస్కారహీనానికి నిదర్శమని ధ్వజమెత్తారు. ఇప్పుడున్న కమ్యూనిస్టు నేతలంతా మూర్ఖులు. ప్రజలు తిరస్కరించినా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు. అందుకే వారిని కలిసేందుకు నేను ఇష్టపడడం లేదంటూ అసహనంతో మాట్లాడారు. ప్రాణాలు సైతం అడ్డుపెట్టి పోరాడి



సాధించుకున్న తెలంగాణను, ఉద్యమ పార్టీని కించపరిస్తే ఉపేక్షించబోనని హెచ్చరించారు. జోకర్, బ్రోకర్ లాగా ప్రతి అంశాన్ని రాద్ధాం తం చేస్తూ చిల్లరగా, నీచంగా ప్రవర్తిస్తున్నారని కేసీఆర్ తీవ్రమైన ఆగ్రహం వ్యక్తంచేశారు. అర్థరహితమైన చర్చావేదికలు నిర్వహిస్తున్న అదో పార్టీ, ఆ పార్టీకున్నది ఓ వార్తా పత్రిక అంటూ అసహనం ప్రదర్శించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కించ పరుస్తూ వార్తలు రాసేందుకా పేపర్లు ఉన్నాయంటూ వ్యాఖ్యానించారు.



సచివాలయంలో ఎన్నికల ప్రధాన అధికారి బన్వర్‌లాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న వామపక్ష నేతలు

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

గురువారం 3 ఆగస్టు 2017

మంచిమాట తెలివి గల వ్యక్తి చాలినంత దొరికినా అదే పుష్కలం అనుకుంటాడు. యూరిపిడెస్

మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయి. కాశ్మీర్‌ని వివాదాస్పదం చేసేందుకు ఈ రెండు దేశాలూ శక్తివంచన లేకుండా పాటుపడుతున్నాయి. భారత్‌లో అంతర్భాగమైన కాశ్మీర్ వివాదాస్పద ప్రాంతం ఎలా అవుతుంది? ఈ ప్రశ్నకు ఈ రెండు దేశాల వద్ద స్పష్టమైన సమాధానం లేదు. కాశ్మీర్ సమస్యను అడ్డుపెట్టుకుని భారత్‌తో కయ్యానికి కాలుదువ్వుతున్నాయి. ఆక్రమిత కాశ్మీర్ (పీఓకె)ని స్వతంత్ర కాశ్మీర్‌గా పాక్ పాలకులు పిలుస్తున్నారు. పాక్‌తో కలిసి ఉండలేమంటూ ఆక్రమిత కాశ్మీర్ ప్రజలు సాగించే ఉద్యమాలను పాక్ పాలకులు ఉక్కు పాదాలతో అణచివేస్తున్నారు.

చైనా, పాక్ బంధం గుట్టు విప్పిన ఆర్మీ జనరల్!

పాకిస్తాన్ చైనాకు ఎందుకంత విధేయతగా ఉంది. పాక్ పట్ల చైనా ఎందుకంత అవ్యాజమైన ప్రేమను ఒలకబోస్తోంది? అంతర్జాతీయ పరిణామాలను జాగ్రత్తగా గమనించే వారికి ఈ సందేహాలు రాకపోవచ్చు, కానీ, సామాన్య జనానికి ఇవి ఖచ్చితంగా సందేహాలే. పొరుగుదేశాల భూభాగాలను దురాక్రమణ చేయడంలో చైనా,పాక్‌ల మధ్య సారూప్యత ఉంది. ముఖ్యంగా, భారత్ పట్ల ఈ రెండు దేశాలూ శత్రువైఖరిని అనుసరిస్తున్నాయి. గిల్లికజ్జాలకు సిద్ధమవుతున్నాయి. మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయి. కాశ్మీర్‌ని వివాదాస్పదం చేసేందుకు ఈ రెండు దేశాలూ శక్తివంచన లేకుండా పాటుపడుతున్నాయి. భారత్‌లో అంతర్భాగమైన కాశ్మీర్ వివాదాస్పద ప్రాంతం ఎలా అవుతుంది? ఈ ప్రశ్నకు ఈ రెండు దేశాల వద్ద స్పష్టమైన సమాధానం లేదు. కాశ్మీర్ సమస్యను అడ్డుపెట్టుకుని భారత్‌తో కయ్యానికి కాలుదువ్వుతున్నాయి. ఆక్రమిత కాశ్మీర్ (పీఓకె)ని స్వతంత్ర కాశ్మీర్‌గా పాక్ పాలకులు పిలుస్తున్నారు. పాక్‌తో కలిసి ఉండలేమంటూ ఆక్రమిత కాశ్మీర్ ప్రజలు సాగించే ఉద్యమాలను పాక్ పాలకులు ఉక్కు పాదాలతో అణచివేస్తున్నారు. పీఓకె ప్రజలే కాదు, పాక్‌లో అంతర్భాగమైన బలూచిస్థాన్ ప్రాంతం ప్రజలు కూడా పాక్ నుంచి విముక్తం కోసం ఉద్యమాలు సాగిస్తున్నారు. బలూచిస్థాన్‌లో ఇద్దరు చైనీస్ పౌరులను ఉగ్రవాదులు కాల్చి చంపిన సంఘటనపై చైనా తీవ్రంగా స్పందించింది. పాక్ ఉగ్రవాదం వల్ల తామూ నష్టపోతున్నామంటూ గగ్గోలు పెట్టింది. పాక్ నమ్మదగిన దేశం కాదన్న అభిప్రాయం వచ్చే రీతిలో చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యాన్ని పరిశీలించినవారికి ఇరుదేశాల మధ్య సంబంధాలు బెడిసికొట్టాయని అనిపిస్తుంది. కానీ, వాస్తవ పరిస్థితి వేరు, చైనా తలపెట్టిన ప్రాజెక్టులు బృహత్తరమైనవి. పొరుగుదేశాల భూభాగాల మీదుగా, పొరుగు దేశాల సహకారంతో నిర్మాణం కావల్సి ఉన్న ఈ ప్రాజెక్టులను సాకారం చేసుకోవడానికి చైనా ఎంతకైనా తెగిస్తుందన్నదానికి సిక్కిం సరిహద్దుల్లో డోక్లామ్ వద్ద మన భూభాగంలోకి చొచ్చుకుని రావడమే. అలాగే, ఆక్రమిత కాశ్మీర్ మీదుగా ఆర్థిక నడవ (ఎకనామిక్ కారిడార్) నిర్మాణానికి పాక్ సాయం అవసరం కనుక, పాక్ ఏం చేసినా వంత పాడుతోంది. నలభై ఐదు బిలియన్ డాలర్ల వ్యయంతో చేపట్టిన ఈ కారిడార్ నిర్మాణాన్ని చేపట్టింది పాక్ సొంత భూభాగంలో కాదు. పాక్ ఆక్రమించిన కాశ్మీర్‌లో. తనది కాకపోతే ఎదుటి వారి సొత్తు ఎలా పోయినా పర్వాలేదన్న నానుడి చందంగా చైనా వ్యవహరిస్తోంది. కాశ్మీర్ విషయంలో అందిస్తున్న సాయానికి చైనాకు ఎప్పటికీ రుణపడి ఉంటామని పాక్ సైనిక దళాల ప్రధానాధికారి జనరల్ ఖమర్ జావేద్ బజ్వా వ్యాఖ్యానించడమే కాకుండా, ఇరుదేశాల మధ్య సైనిక బంధం ఉభయతారకమని అన్నారు. రావల్పిండిలోని చైనీస్ రాయబార కార్యాలయం వద్ద చైనీస్ పీపుల్స్ ఆర్మీ 90వ సంస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బజ్వా ఇరుదేశాల మైత్రి గుట్టు విప్పారు.

పరస్పర ప్రయోజనం ప్రాతిపదికపైనే తమ బంధం కొనసాగుతోందనీ, కాశ్మీర్ విషయంలోనే కాకుండా, అణు ఇంధన సరఫరా దేశాల కూటమి (ఎన్ఎస్‌జి) లో, షాంఘై సహకార సంస్థలో పాక్‌కి సభ్యత్వం కోసం పట్టుబట్టడం ఇరుదేశాల మైత్రికి నిదర్శనమని అన్నారు. ఎన్ఎస్‌జి భారత్‌కి సభ్యత్వం రాకుండా చైనా అడ్డుపడటానికి పాక్ నుంచి వస్తున్న ఒత్తిడే కార ణం. ఈ విషయాన్ని ఇప్పుడు పాక్ సైనికదళాల ప్రధానాధికారి బజ్వా ధ్రువీకరించారు. అంతేకాదు, చైనా మన దేశం పట్ల ఎడముఖంగా వ్యవహరించడానికి పాక్‌తో సాగిస్తున్న మైత్రే కారణం. ఇరుగు పొరుగు దేశాల మధ్య మైత్రి ఉభయతారకంగా ఉండాలని కోరుకోవడం సహజమే కానీ, మరో పొరుగు దేశానికి హాని కలిగించే రీతిలో అది ఉండకూడదు. భారత్ భూభాగాలను ఆక్రమించిన చైనా, పాక్‌లు అంతర్జాతీయ చట్టాలనూ, సంప్రదాయాలను ఏమాత్రం గౌరవించడం లేదు. కాశ్మీర్‌లో నిత్యం హింసను సృష్టిస్తున్న ఉగ్రవాద సంస్థల నాయకులకు చైనా వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి కమిటీలో తనకున్న వీటో హక్కును దుర్వినియోగం చేస్తోంది. పాక్ కేంద్రంగా పని చేస్తున్న జైష్ ఎ మహ్మద్ వ్యవస్థాపకుడు మసూద్ అజార్‌పై వేటు పడకుండా కాపాడుతోంది. అంతకుముందు లష్కర్ ఎ తోయిబా వ్యవస్థాపకుడు హఫీజ్ మహ్మద్ సయీద్ విషయంలోనూ చైనా ఇదే మాదిరి దన్ను ఇచ్చింది. ఈ నేపథ్యంలో పాక్ ఆర్మీ జనరల్ బజ్వా చైనాని ఆకాశానికి ఎత్తేస్తూ చేసిన వ్యాఖ్యలు ఇరుదేశాల దుర్నీతిని బహిర్గతం చేస్తోంది. బజ్వాని ఆ పదవిలో నియమించింది ఇటీవల గద్దె దిగిన ప్రధాని నవాజ్ షరీఫే. నమ్మకస్తునిగా ఉంటాడనుకున్న బజ్వాయే తనకు వ్యతిరేకంగా పావులు కదిపినట్టు షరీఫ్ ఆలస్యంగా తెలుసుకున్నారు. గతంలో ఇదే మాదిరిగా ఆర్మీ జనరల్ పదవిని చేపట్టిన ముషార్రఫ్ షరీఫ్‌పై తిరుగుబాటు చేసి అధికారాన్ని చేజిక్కించుకోగా, ప్రస్తుత ఆర్మీ జనరల్ తెరవెనక ఉండి కథ నడిపించారు. షరీఫ్‌ని పనామా పేపర్స్ కేసులో గద్దెదిగమని ఆదేశించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులంతా పూర్వపు అధ్యక్షుడు జనరల్ ముషార్రఫ్ హయాంలో నియమితులైన వారే. పాక్‌లో సైనికాధికారులు పాలనా వ్యవహారాల్లో తమ మాట చెల్లుబాటు అయ్యేట్టు చేసుకోవడం మొదటి నుంచి ఉన్నదే. అలాగే, తమ దేశ విదేశాంగ విధానాన్ని వారు ప్రభావితం చేస్తుంటారు. ముషార్రఫ్ ఆర్మీ జనరల్‌గా ఉన్నప్పుడు అమెరికాతో పాక్ మైత్రి బంధం పటిష్టం అయ్యేట్టు పావులు కదిపారు. అందుకు ప్రతిఫలంగా ఉగ్రవాదంపై అంతర్జాతీయ స్థాయిలో ఆనాటి అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ ప్రారంభించిన ఉద్యమంలో పాక్‌ని ప్రధాన భాగస్వామిగా ఆయన చేశారు. అప్పట్లో ఆయన నిర్ణయానికి యావత్ ప్రపంచ దేశాలు ముక్కున వేలువేసుకున్నాయి. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాక్‌తో చెట్టపట్టాలేసుకుని ఉగ్రవాదంపై పోరు సాగించడమేమిటని ఎద్దేవా చేశాయి. అయినా బుష్ లెక్క చేయలేదు. ప్రస్తుత ఆర్మీ జనరల్ బజ్వా చైనా అనుకూల ధోరణిని అనుసరిస్తున్నారన్న వార్తలు ఇంతకుముందే వచ్చాయి. ఇప్పుడు ఆయన తన మనసులోని మాటను చైనీస్ పీపుల్స్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బయటపెట్టుకున్నారు.

చారిత్రక, పర్యాటక ప్రాంతాలపై నిరాదరణ

పాఠకీయం

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలలోని చారిత్రక, పర్యాటక ప్రదేశాలు నిరాదరణకు గురవుతున్నాయి. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని పాండవుల గుట్ట, గణపురం మండలంలోని కోటగుళ్లు ఎంతో ప్రాశస్త్యం కల్గి ఉన్నా అభివృద్ధికి నోచుకోవడం లేదు. పరకాల భూపాలపల్లి ప్రధాన రహదారికి మధ్యలో రేగొండ మండలకేంద్రం దాటిన తర్వాత (2 కి.మీ. దూరంలో) పాండువుల గుట్ట ఉంటుంది. ప్రకృతిలో ఓలలాడే సుందరమైన వృక్షాలు, పక్షుల కిలకిలరావాలు, గుట్టపై భీముడి గుండు, మధ్యలోని దోనెలో దేవతామూర్తుల విగ్రహాలు, పురాతన కాలంలో పాండవులు వనవాస కాలంలో ఈ ప్రదేశానికి వచ్చి సేదతీరినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. వారి హస్తముద్రికలు సైతం కనిపిస్తాయి. ఆంధ్రా ప్రాంతంలోని బొర్రా గుహలకు వెళ్లిన అనుభూతి కలుగుతుంది. నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కోటగుళ్లలో గణపేశ్వరస్వామి ఆలయం వుంది. నిత్యపూజలు జరుగుతాయి. శిథిలావస్థకు చేరువలో కోటగుళ్లు ఉన్నాయి. దాతల సహకారంతో, కొద్దిమంది పాత్రికేయుల ధాతృత్వంతో విశేషపూజలు ఉగాది వేడుకలు, కార్తీక పౌర్ణమి, మిగతా పర్వదినాల వేడుకలు కన్నులపండువలా నిర్వహిస్తున్నారు. కోటగుళ్లు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో దీనికి జీవం పోస్తున్నారు. జయశంకర్ జిల్లాకే తలమానికమైన పాండవుల గుట్ట కోటగుళ్లను ప్రభుత్వం అన్నివిధాలా అభివృద్ధి చేయాలి.

-కామిడి సతీష్‌రెడ్డి, జడలపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

శాసనసభ స్థానాలను పెంచాలి

తెలంగాణాలోని 119 శాసనసభ స్థానాలను 175కు, ఎపిలో గల 175 శాసన సభ స్థానాలను 225కు పెంచాల్సిన పరిస్థితి రాష్ట్రా ల విభజన ద్వారా ఏర్పడింది. రాజ్యాంగంలోని 10(3) ఆర్టికల్ ద్వారా పెంపు జరపాలి. తెలంగాణాలోని నాలుగున్నర కోట్ల మంది ప్రజలకు 119 శాసనసభ స్థానాలవల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణాలో 31 జిల్లాలు ఏర్పాట్లు అయ్యాయి. జిల్లాకు 5 శాసనసభస్థానాలు ఉండాలని రాజ్యాంగంలో ఉంది. అంటే 155 కావాలి. మన తెలంగాణ సిఎం కేసీఆర్ గారు 18 గంటలు కష్టపడుతున్నారు. వీరి వారసుడు కేటీఆర్ అయితే డైనమిగ్‌గా డేరింగ్‌గా పరిపాలన ద్వారా ట్విట్టర్ ద్వారా ప్రజలకు సహాయపడుతున్నారు. అలాగే ఎపిలో జిల్లాలు పెంచాలి. చిత్తూరు జిల్లాను రెండుగా చేస్తూ బాలాజీ పేరున కొత్త జిల్లా ఏర్పాట్లు చేసి ప్రజలకు పరిపాలన ఫలాలు అందించాలని హైటెక్ సిఎం చంద్రబాబుని ప్రాధేయపడుతూ, వెలగపూడి సచివాలయంను కోట్ల ఖర్చుతో నిర్మించిన చంద్రబాబు గారిని అభినందిస్తూ, కొత్త శాసనసభ స్థానాల పెంపుపై పి.ఎం. గారితో మాట్లాడి అసెంబ్లీ సీట్లు పెంచుతూ ఎపి తెలంగాణా రాష్ట్ర తెలుగు ప్రజలకు పరిపాలన సౌకర్యాలు కల్పించాలని ప్రాధేయపడుతున్నాము.

-కోలిపాక శ్రీనువాసు-బెల్లంపల్లి, మంచిర్యాల జిల్లా

తరంతో మారిన ఉద్యమాల తీరు



కాలంతో పాటూ ఉద్యమాల తీరూ మారిపోయింది. అన్ని రంగాల్లోకీ కొత్త తరాలు వస్తున్నాయి. వ్యవసాయమూ అందుకు మినహాయింపేమీ కాదు. విద్యావంతులూ, ఉన్నతోద్యోగాలు చేస్తున్నవారూ కూడా ఈ రంగంలో ప్రవేశిస్తున్నారు. వీరి ప్రవేశంతో వ్యవసాయంలో ఆధునిక పద్ధతులకూ బీజం పడింది. సృజనాత్మకంగా మారింది. అలాగే ఉద్యమాలకూ ఒక ఊపొచ్చింది. సహేతుక కారణాలతో వారు పోరాటాలకు నడుం బిగిస్తున్నారు. మహేంద్ర సింగ్ తికాయత్ కాలంలో ఎడ్ల బళ్ళతో ప్రదర్శనలు చేస్తే.. గిట్టుబాటు దొరకని ఉత్పత్తులను రోడ్డుపై పారబోసి.. వర్తమాన తరం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది.

అది 1980వ దశకం..రైతు ఉద్యమాల దద్దరిల్లింది. అదే సమయంలో ప్రముఖంగా వినిపించిన పేరు మహేంద్ర సింగ్ తికాయత్. లక్నోలో తికాయత్ గర్జిస్తే ఢిల్లీ గద్దె కంపించేది. మాజీ ప్రధాన మంత్రి చరణ్ సింగ్‌కు అత్యంత సన్నిహితునిగా పేరొందిన తికాయత్ ఉత్తర ప్రదేశ్‌లోని పశ్చిమ ప్రాంతానికి చెందిన వారు. చెరకు రైతుల సమస్యలపై ఆయన ఉద్యమించారు. శరద్‌జోషికూడా మహారాష్ట్రలో ఆందోళనలు చేసి, ప్రభుత్వాలకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. కానీ రైతు ఉద్యమాలలో తికాయత్ పేరుకే ఎక్కువ విలువ ఉండేది. రైతు సంఘ నాయకుడే కాకుండా, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో ప్రాబల్యం కలిగిన ఝాట్ సామాజిక వర్గానికి చెందిన వాడు కావడమే దీనికి కారణం.

దాదాపు ముప్పయేళ్ళ క్రితం తికాయత్ ఢిల్లీలోని బోట్ క్లబ్‌లో వేలాది మంది రైతులతో పెద్ద ప్రదర్శనను నిర్వహించారు. రైతులు ఎడ్ల బళ్ళతో తరలి రావడం వల్ల బోట్ క్లబ్ మైదానం ఎడ్ల ప్రదర్శనగా మారిపోయింది. తికాయత్ 2011లో అస్తమించినా, ఆయన ఉద్యమ స్ఫూర్తి కొనసాగుతూనే ఉంది. భారతీయ కిసాన్ యూనియన్ ఆధ్వర్యంలో తరచూ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో వ్యవసాయం వాటా అప్పట్లో 30 శాతం ఉండేది. ప్రస్తుతం 15 శాతం మాత్రమే ఉంది. వ్యవసాయంపై ఆధారపడిన వారి సంఖ్య ఏమాత్రం తగ్గలేదు. దేశంలో ఇప్పటికీ 55శాతం మంది ప్రజలు వ్యవసాయం మీదనే ఆధారపడ్డారు. 1980 దశకంలో వీరి సంఖ్య 60 శాతం ఉండేది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా వ్యవసాయాధారితుల బతుకులు ఛిద్రమవుతున్నాయి. అప్పు తెచ్చి క్రమం తప్పకుండా వ్యవసాయం చేస్తున్నారు. కనీస పెట్టుబడి కూడా లభించక రుణగ్రస్థులవుతున్నారు.

వ్యవసాయంలోకి ఉన్నతోద్యోగులు..

ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నతోద్యోగాలు చేసుకునే వారు సైతం వ్యవసాయ రంగంలో ప్రవేశిస్తున్నారు ఢిల్లీకి చెందిన రమణదీప్ మాన్ అనే మెరైన్ ఇంజనీర్ తమ ఇంటి వ్యాపకమైన వ్యవసాయానికే ప్రాధాన్యం ఇచ్చినట్టు చెప్పారు. వ్యవసాయ రంగం ఇంత దారుణమైన స్థితిలో ఉందన్న విషయం ఇందులో ప్రవేశించిన తర్వాత కానీ తనకు తెలిసి రాలేదని ఆయన ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. రైతుల సమస్యలు,ఆందోళనలకు ఇప్పుడు నిరంతర వార్తా స్రవంతుల్లో కూడా తగిన ప్రాధాన్యం లభిస్తోంది. రైతుల్లో చైతన్యం తీసుకుని రావడానికి కొత్త తరం బాగా కృషి చేస్తోంది. వారు ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకుని తమ సహ రైతులకు అందజేస్తున్నారు. రైతులకు కావల్సిన విత్తనాలు, క్రిమిసంహారక మందులు వంటివి సకాలంలో సరఫరా అయ్యేట్టు, నకిలీల బెడద లేకుండా చూసేట్టు వారు ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తున్నారు. వ్యవసాయంపై ఆధారపడిన నష్టాలు పాలైన పాత తరం వారు ఇదంతా తమ ఖర్మ అని అనుకునే వారు.కొత్తతరానికి చెందిన వారు వినూత్నమైన రీతులలో ఆందోళనలు సాగిస్తూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను కదిలిస్తున్నారు.

- ఎ.పి. స్వామి

గిట్టుబాటు గగనకుసుమం..

వరుసగా 2014, 15 సంవత్సరాల్లో అనావృష్టి సంభవించిన తదనంతరం 2016-17 సంవత్సరంలో అన్నీ కూడదీసుకుని రైతులు పంటలు బాగా పండించినా, గిట్టుబాటు ధర గగనకుసుమమైంది. రైతులు పండించిన ఉత్పత్తులకు అయిన వ్యయం కన్నా, తక్కువ ధరకు దిగుమతి చేసుకోవడమే ఇందుకు కారణం. వ్యవసాయ రంగంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనడానికి ఇదే నిదర్శనం. గిట్టుబాటు ధరల కోసం దేశంలోని వివిధ ప్రాంతాల్లో రైతులు ఆందోళన చేపడుతున్నారు. సంఘటితం కాకపోవడంతో వారి వాణి ప్రభుత్వానికి వినిపించడం లేదు. దేశంలో 200కు పైగా రైతు సంఘాలున్నాయి. జూలై 31వ తేదీ నాటికి రైతులు తమ డిమాండ్లలో రెండు ప్రధానమైన వాటిని ప్రభుత్వ విధాన కర్తల దృష్టికి తెచ్చారు. మహారాష్ట్రలో పాడి రైతులు లీటర్ల కొద్దీ పాలను రోడ్లపై ఒలకబోసి నిరసన తెలిపారు. కూరగాయల ఉత్పత్తిదారులు తమ ఉత్పత్తులను జాతీయ రహదారులపై పోసి వాహనాలను నిలిపి వేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో చచ్చిన ఎలుకలను, మట్టి నమూనాలను తింటున్నట్టు అభినయించి నిరసన తెలిపారు. రుణాల మాఫీ కోసం రైతులు ఈ ఆందోళలను నిర్వహించారు. వ్యవసాయోత్పత్తుల వాణిజ్యంలో తమ మాటకు విలువ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నది వారి డిమాండ్.

యువత చేతుల్లోకి ఆందోళనలు

రైతుల ఉద్యమాలు ఇప్పుడు యువతరం చేతుల్లోకి వచ్చాయి. గతంలో మాదిరిగా వారు ప్రభుత్వ వాగ్దానాలను నమ్మే స్థితిలో లేరు. వారికి కావల్సింది తక్షణ కార్యాచరణ. పూర్వపు ప్రభుత్వాల మాదిరిగా చేస్తాం,చూస్తాం అంటే కుదరదని జై కిసాన్ ఆందోళన కన్వీనర్ అవికా సాహా అన్నారు. మధ్యప్రదేశ్‌కి చెందిన కేదార్‌శిరోహి కేంద్రం ప్రవేశపెట్టిన పంటల బీమా పథకంలోని లోపాలను ఢిల్లీలో ఆధారాలతో బయటపెట్టారు. రైతులకు ప్రభుత్వం నేరుగా చెల్లిస్తేనే లాభమనీ, బీమా ప్రీమియంలకు సబ్సిడీ రూపంలో ఇస్తే ఎందుకూ కొరగాదని ఆయన స్పష్టం చేశారు. బీమా ప్రీమియంలకు ఇచ్చే సబ్సిడీ సొమ్మును బీమా కంపెనీల సిబ్బంది కాజేస్తున్నారని రాజస్థాన్‌కి చెందిన రైతు సంఘం నాయకులు ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో 2018లో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా, ఆ ఎన్నికల ముందు రుణమాఫీని ప్రభుత్వం ప్రకటించవచ్చు.ఎన్నికల ముందు సంవత్సరంలో రుణాలు తిరిగి చెల్లించకుండా ఆపేస్తారని ఆయన అన్నారు. రైతులు అంత తెలివితక్కువ వారేమీ కాదని ఆయన స్పష్టం చేశారు.రైతుల ఉద్యమంలో ప్రవేశిస్తున్న కొత్తతరంలో కూరగాయలు,పండ్ల తోటల యజమానులు కూడా ఉన్నారు. పెట్టుబడి వ్యయం కూడా రానప్పుడు మాత్రం ఆందోళనలు చేస్తూ తమ ఉత్పత్తులను నేలపాలు చేసి నిరసనలు తెలుపుతున్నారు.

పాక్‌కు సమాధానం జలాస్త్రమే...!

శత్రువును దారికి తెచ్చుకోవడానికి సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగించవచ్చని చాణక్య నీతి చెబుతోంది. మన పక్కనున్నది దాయాది దేశమే.. కానీ పక్కలో బల్లెంలా తయారైంది. అమెరికా కాదంటే చైనా.. చైనా కాదంటే..మరో దేశం ఇలా మారుస్తూ తన కుటిలత్వాన్ని భారత్‌పై ప్రయోగిస్తోంది. పాకిస్థాన్‌ను దారికి తెచ్చుకోవడానికి మన చేతిలో బ్రహ్మాస్త్రముంది. అదే సింధు జలాస్త్రం. ఇక ప్రయోగించడమే తరువాయి.



పరస్పర నమ్మకం ఆధారంగానే ఒప్పందాలు అమలవుతాయి. సింధు నదీ జలాల ఒప్పందం ప్రవేశికలోనే ఆ విషయాన్ని స్పష్టీకరించారు. కాబట్టి భారత భూభాగంలో పాక్ ఘాతుకాలకు తెగబడుతున్న ఈ తరుణంలో నదీజలాల నియంత్రణ ద్వారా ఆ దేశంపై ఒత్తిడి పెంచాలి. నదీజలాలను కట్టడి చెప్పినంత సులభం కాదు. ఒప్పందాల విషయంలో ఇతర పొరుగు దేశాలు అదే పద్ధతి అనుసరిస్తే భారత్ ప్రశ్నించే హక్కు కోల్పోతుందన్నది వారి వాదన. కానీ, ఒప్పందాన్ని ఉల్లంఘించకుండానే మన వాటా జలాలను సద్వినియోగం చేసుకోవడంవల్ల కూడా పాక్‌ను ఇరకాటంలో పెట్టవచ్చు.

చైనాను అనుసరించడం అసమంజసం కాబోదు

టిబెట్ నుంచి అరుణాచల్‌ప్రదేశ్ ద్వారా భారత్‌లో ప్రవేశించడానికి కొన్ని కిలోమీటర్లు ముందు బ్రహ్మపుత్ర నదిపై చైనా జలవిద్యుదుత్పాదనకు భారీ డ్యామ్‌లు కట్టి నీటిని దారిమళ్ళిస్తోంది. అలాంటప్పుడు సింధు నదీ జలాలపై భారత్ తన హక్కులను వినియోగించుకుని పాక్‌కు గుణపాఠం చెపడం అసమంజసం కాబోదు. భారత్‌తో ప్రత్యక్ష యుద్ధంచేసి ఎట్టిపరిస్థితుల్లోనూ పాక్ నెగ్గలేదు. కాబట్టే భారత్‌పై దశాబ్దాలుగా పాక్ ప్రచ్ఛన్నయుద్ధం వ్యూహాన్ని అనుసరిస్తోంది. వాజ్‌పేయి హయాంలో నాటి విదేశాంగ మంత్రి యశ్వంత్ సిన్హా సింధు నదీజలాల ఒప్పందానికి మంగళం పాడి పాక్‌కు బుద్ధి చెప్పాలని సూచించారు. సిమ్లా ఒప్పందంలాంటి అనేక కీలక ఒప్పందాలను పాక్ తుంగలో తొక్కినప్పుడు మనమెందుకు జల ఒప్పందాలకు కట్టుబడి ఉండాలి? అని ఆనాడే ఆయన ప్రశ్నించారు. పాకిస్తాన్‌లోని పంజాబ్ రాష్ట్రంతో సహా ఆ దేశంలోని మొత్తం 65 శాతం భూభాగం సింధు నదీ పరీవాహక ప్రాంతమే. ఆ ప్రాంతంలో నిర్మించిన కాలువల వ్యవస్థ ప్రపంచంలోనే అతి పెద్దదిగా గుర్తింపు పొందింది. పాక్‌లోని 90 శాతం ఆయకట్టు ఈ కాలువల ద్వారానే సస్యశ్యామలమవుతోంది.

భారత్ ఆ పనిచేస్తే ఆ ప్రాంతం ఎడారే!

సింధు ఒప్పందాన్ని భారత్ ఉల్లంఘిస్తే తమ దేశం మొత్తంగా ఎడారిగా మారుతుందని ఇస్లామాబాద్ తీవ్ర ఆందోళనకు గురైంది. ఆ అనుమానంతో అమెరికాను ఆశ్రయించింది. పాక్ అభ్యర్థన మేరకు, అమెరికా అణుశక్తి కమిషన్ ఛైర్మన్ డేవిడ్ లీవెంటల్‌ను పంపింది. నదీ జలాలపై అధ్యయనం చేసిన లీవెంటల్ ప్రపంచ బ్యాంకు ద్వారా సింధు నదీ జలాల ఒప్పందం కుదిర్చే ప్రయత్నం చేశారు. సంధానకర్తగా ఉండేందుకు తన పాత్ర పరిమితమన్న ప్రపంచ బ్యాంకు, ఆ తరవాత న్యాయనిర్ణేతగా వ్యవహరించడం ప్రారంభించింది.

ఆ విధంగా 1960లో భారత్, పాక్‌ల మధ్య కరాచీలో కుదిరిన ఒప్పందంపై నాటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, పాక్ అధ్యక్షులు ఆయూబ్‌ఖాన్ సంతకం చేశారు. వాస్తవానికి ఒప్పందంలోని నిబంధనలు పాకిస్తాన్‌కే అనుకూలంగా ఉన్నాయి. అపట్టి ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణ పరిస్థితుల్లో రష్యాను కట్టడి చేయాలంటే పాక్ అవసరం అమెరికాకు ఎంతైనా ఉంది. అందుకే అమెరికా, బ్రిటన్‌లు రెండూ ఒప్పందం ఖరారులో పాక్‌కే వత్తాసు పలికాయి. నిధులకోసం అమెరికా, బ్రిటన్‌లపై ఆధారపడిన భారత్ విధిలేని పరిస్థితుల్లో ఆ ఒప్పందంపై సంతకం చేసింది. 1965, 1971, 1999 లలో యుద్ధాలు జరిగినప్పుడు కూడా భారత్ ఆ ఒప్పందం స్ఫూర్తిని గౌరవిస్తూ వచ్చింది.

అంతర్జాతీయ ఉగ్రవాదంపై ప్రపంచ దేశాలన్నీ ఒక్కటవుతున్న తరుణంలో పాక్‌కు గుణపాఠం నేర్పించేందుకు ఇంతకుమించిన అవకాశం భారత్‌కు లభించదు. సింధు జలాలను నియంత్రించి, వాటిని సద్వినియోగించుకోవడం ద్వారా పాక్‌పై జలాస్త్రం ప్రయోగించడమే సరైన వ్యూహమని నిపుణులు సూచిస్తున్నారు. నదీ ప్రవాహం తగ్గితే పాక్ తీవ్రమైన కరవుబారిన పడుతుంది. ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది.


అప్పుడైనా పాక్ తన వైఖరి మార్చుకోవచ్చునన్నది నిపుణుల అంచనా.

-కీర్తి నాగరాజు

పాక్‌కు జీవనాడి సింధు

సింధునది టిబెట్ లోని మానస సరోవరం, కైలాస పర్వతాలనుంచి జమ్ము కాశ్మీర్ లోని లడఖ్ మీదుగా, గిల్గిట్, బాల్టిస్థాన్ నుంచి పాకిస్తాన్‌లోని పంజాబ్ రాష్ట్రం, కరాచీ మీదుగా అరేబియా మహాసముద్రంలో కలుస్తోంది. సింధు నదికి సంబంధించిన అనేక ఉపనదులు భారత్‌లోని జమ్ము కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హరియానా, రాజస్థాన్‌ల మీదుగా ప్రవహించి పాకిస్తాన్‌లో ప్రవేశిస్తాయి. 3,180 కిలోమీటర్ల పొడవునా ప్రవహించేసింధు నది వార్షిక నీటి ప్రవాహపరంగా చూస్తే ప్రపంచంలో 21వ అతిపెద్ద నదిగా గుర్తింపు పొందింది. చైనా, భారత్, ఆఫ్గానిస్థాన్, పాకిస్తాన్‌ల మీదుగా ప్రవహించే ఈ జీవనది పరీవాహక ప్రాంతం మొత్తం 11,65,000 చదరపు కిలోమీటర్లు సింధు నదీ ఒకరకంగా పాకిస్తాన్‌కు జీవనాడి.

షాబాజ్...పనితీరు విభిన్నం



పాకిస్థాన్‌లో రాజకీయం ఒక కుటుంబానికి సంబంధించింది. ఇటీవలే ఉద్వాసనకు గురైన నవాజ్ షరీఫ్ అందుకు అతీతుడేం కాదు. ఆయన స్థానంలో ప్రధానిగా పగ్గాలు చేపట్టబోతున్న షాబాజ్ షరీఫ్ మాత్రం ఆయనకు నకిలీ కాదు. కొత్త తరహా పాలనతో ప్రభుత్వాన్ని నడపగల సమర్థుడు. షాబాజ్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టేలోగా నవాజ్ నమ్మకస్థుడు షాహిద్ ఖాకన్ అబ్బాసి తాత్కాలిక పగ్గాలు స్వీకరిస్తారు. పార్లమెంటు ఉప ఎన్నికలో షాబాజ్ గెలిచేవరకూ అబ్బాసీదే అధికారం. ఉప ఎన్నిక రెండు నెలల్లో జరిగే అవకాశముంది.

పాకిస్థాన్‌లో ఇంత శాంతియుతంగా అధికార మార్పిడి జరిగిపోవడం ఆ దేశ చరిత్రతో పోల్చుకుంటే విశేషమే. బలీయమైన సైన్యం చూస్తుండగా అధికారం చేతులు మారడం ఆ దేశ చరిత్రలో ఇదే ప్రథమం. ఉద్వాసనకు గురైన షరీఫ్ సోదరుణ్ణే ఆ స్థానంలో కూర్చోబెట్టడానికి సైన్యం అంగీకరించడం ఇక్కడ విడ్డూరం.

మూడు దశాబ్దాలుగా షాబాజ్ నవాజ్‌కు నీడలా వ్యవహరిస్తున్నారు. పని రాక్షసుడిగా పేరు తెచ్చుకున్నారు. పంజాబ్ ప్రావిన్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ఉద్దేశించిన భారీ ప్రాజెక్టులకు ఆయనే ఆద్యుడు. 65ఏళ్ళ షాబాజ్ పాకిస్థాన్‌లోని 190మిలియన్ల జనాభాలో సగం ఉండే ప్రాంతంలో కీలకమైన పట్టును సాధించారు. ఆయన కుటుంబ అధికారానికి అదే కేంద్రం కూడానూ.

ఆయన పనితీరులో వాట్సాప్ సందేశాలు కీలకమైనవి. పంజాబ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన వాట్సాప్ మెసేజీలతో పరుగులు తీయించేవారు. ఆయన ఆదేశాలు ఇవ్వడానికి సమయం ఉండదు. అర్ధరాత్రి అపరాత్రీ ఉండదు. ఆయన నుంచి మెసేజ్ అందిన తక్షణం సమస్య ఉన్న ప్రాంతంలో అధికారులు వాలిపోయి, పరిష్కరించేవారు. ఇదే ప్రజలలో ఆయనపట్ల విపరీతమైన అభిమానాన్ని పెంచింది. షాబాజ్‌తో పనిచేయాలంటే మీరెప్పుడూ బూట్లు వేసుకుని సిద్ధంగా ఉండాలని పంజాబ్ ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. గతంలో ఆయన షాబాజ్ యంత్రాంగంలో పనిచేశారు. నవాజ్ షరీఫ్‌ను ప్రధాని పదవికి అనర్హుడిగా సుప్రీం కోర్టు ప్రకటించిన నేపథ్యంలో ఆయన స్థానంలో షాబాజ్ పేరు బయటకొచ్చింది. పనితీరు పరంగా చూస్తే.. షాబాజ్ కూడా షరీఫ్ మాదిరిగానే వాణిజ్యానికి ప్రాధాన్యమిస్తారు. సైన్యంతో సంబంధాలపైనే ఇద్దరి మధ్య చాలా వ్యత్యాసముంది. పాక్ రాజకీయాలలో కీలకమైన అంశాలలో సైన్యానిదే ప్రధాన భూమికని చెప్పడంలో ఎటువంటి సంశయమూ అవసరం లేదు. వీటిలో అత్యంత ముఖ్యమైనది భారత్‌తో సంబంధాలు.

సైన్యంతో మెరుగైన సంబంధాలు

1999లో నవాజ్ షరీఫ్‌ను పదవీచ్యుతుడిని చేసిన సైనికాధికారులతో షరీఫ్ కంటే మెరుగైన షాబాజ్ మెరుగైన సంబంధాలను ఏర్పరచుకున్నాడు. షాబాజ్‌ను తదుపరి ప్రధానిగా సైన్యం అంగీకరించడానికి ఇదే ప్రధాన కారణమై ఉండవచ్చు. సైన్యంతో కార్యసాధకుడిగానూ, వ్యవహారశీలిగానూ షాబాజ్ వ్యవహరిస్తూ వస్తున్నారు. 300 బిలియన్ డాలర్ల దేశ ఆర్థిక వ్యవస్థను పౌరులు వృద్ధి చేయాలనీ, అభివృద్ధినీ రెట్టింపు చేసే దాదరులు వెదకాలనీ షాబాజ్ భావిస్తుంటారని నవాజ్ షరీఫ్‌కు సన్నిహితంగా ఉండే రాజకీయనేత ఒకరు వెల్లడించారు. సైన్యానికి పగ్గాలు వేయాలనుకునే ముందు ఇది సాధించాలనీ, అప్పుడే ఆర్మీని రాజకీయ వ్యవస్థ చెప్పుచేతల్లో ఉంచుకోగలుగుతుందనీ షాబాజ్ నమ్ముతారన్నది ఆ నేత అభిప్రాయం. దీని గురించి మాట్లాడుతుండగా నేను విన్నాను.. ఇందుకు కొన్ని దశాబ్దాలు పడుతుందని షాబాజ్ అంటుంటారని ఆ నేత చెప్పారు. సైన్యంతో సాధ్యమైనంత తక్కువ విభేదించడం తన ప్రధానమంత్రి అభ్యర్థిత్వానికీ, దేశ ప్రగతికి ఎంతో అవసరమనీ చెబుతారు. సైన్యం తరచూ ప్రభుత్వంపై పైచేయి సాధించడం.. కూల్చేయడం వంటి అలవాటున్న పాకిస్తాన్‌లో ఇది తప్పక అనుసరించాల్సిన వ్యూహమని పేర్కొంటారు.

కార్యసాధకుడు..

షాబాజ్ షరీఫ్ కార్యసాధకుడిగా పేరుపొందారు. అధికారంలో ఉండగా ఆయనేనాడు అన్న నవాజ్ షరీఫ్‌కు ఎదురుచెప్పలేదు. ఆయన నిర్ణయాలను ప్రశ్నించలేదు. పార్టీలో అతి తక్కువ ప్రాధాన్యతను కోరుకునే వారు. తక్కువ సహాయకులతో మంత్రివర్గాన్ని నడపడం ఆయన ధ్యేయం. త్వరలో షాబాజ్ ప్రధాని పదవిలో కూర్చున్నప్పటికీ, ముఖ్యమైన అంశాలలో నవాజ్ ప్రమేయం ఉంటుందని ఓ కీలక నేత అంటున్నారు. నవాజ్ నిర్ణయాలే చెల్లుబాటవుతాయని పేరు చెప్పడానికి సుముఖత వ్యక్తం చేయని ఆ నేత వెల్లడిస్తున్నారు. అంతమాత్రాన నవాజ్ అన్ని అంశాలలోనూ వేలు పెడతారని కాదన్నారాయన. షాబాజ్‌ను పనిలో మెప్పించలేమనీ, ఆయన అత్యంత పని రాక్షసుడనీ అంటున్నారు కొందరు నేతలు. చేపట్టిన ప్రాజెక్టులు నిర్ణీత గడువులోగా పూర్తి కావాల్సిందేనన్నది షాబాజ్ దృఢమైన ఆకాంక్షనీ చెబుతుంటారు. ఆయన కింద పనిచేసే అధికారులు అందుకోసం నిరంతరం శ్రమిస్తుంటారు. మే నెలలో థర్మల్ విద్యుత్తు కేంద్రం, సహజవాయు కేంద్రాలను రికార్డు సమయంలో పాకిస్తాన్ ప్రభుత్వం నిర్మించింది.

ఇమ్రాన్‌పై పరువునష్టం దావా..

అణ్వాయుధ దేశంగా పేరున్న పాకిస్థాన్‌ను పాకిస్థాన్ ముస్లిలీగ్(నవాజ్) పార్టీ నవాజ్ షరీఫ్ కుటుంబ దేశంగా మార్చేసేందుకు ప్రయత్నిస్తున్నారనేది ప్రతిపక్షాల విమర్శ. షాబాజ్‌ను దృష్టిలో ఉంచుకునే వారీ వ్యాఖ్య చేశారు. అవినీతిపరుడిగా చిత్రించారు. ఇది ప్రజాస్వామ్యం కాదనీ, ఒక రాజ్యంలా మారిపోయిందనీ ప్రతిపక్ష పిటిఐకి చెందిన ఇమ్రాన్ ఖాన్ దుయ్యబట్టారు. సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పనామా పేపర్ల కేసును వెనక్కి తీసుకునేందుకు లంచం ఇవ్వజూపారని ఆరోపించారు. దీన్ని తప్పుపడుతూ షాబాజ్ పది బిలియన్ల రూపాయలకు ఇమ్రాన్‌ఖాన్‌పై పరువునష్టం దావా వేశారు.

పుట్టుకతోనే ధనవంతుడు

పారిశ్రామికవేత్త మియన్ ముహమ్మద్ షరీఫ్ సంతానంలో ముగ్గురిలో షాబాజ్ రెండోవాడు. పాకిస్థాన్ స్వాతంత్ర్యం సాధించిన నాలుగేళ్ళ తరువాత అంటే 1951లో జన్మించారు. 1980లో నవాజ్ షరీఫ్ పంజాబ్ ముఖ్యమంత్రిగా ఉండగా షాబాజ్ రాజకీయాల్లోకీ, వ్యాపారంలోకి ఒకేసారి ప్రవేశించారు. 1990లో పంజాబ్ ముఖ్యమంత్రయ్యారు. 1999 కుట్రతో పదవిని కోల్పోయారు. 2008లో తిరిగి పదవిని చేపట్టారు. నవాజ్ షరీఫ్‌కు పెద్ద అండగా నిలబడ్డారు. అవినీతిపరుడిగా ఆరోపణలు ఎదుర్కొన్నారు. కానీ..అవన్నీ రాజకీయ ప్రేరేపితాలని కొట్టిపారేశారు. కరెంటు సంబంధిత సమస్యలను పరిష్కరించగలిగితే.. 2018 ఎన్నికల్లో పిఎమ్ఎల్-ఎన్ గెలుపు నల్లేరుమీద నడకే కాగలదు.

-కె.వి.ఎస్.

కర్ణాటకలో కృష్ణమ్మ బందీ

ఎగువన కళకళ...దిగువన వెలవెల!

- నోళ్లు తెరచుకున్న శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు
- 438 టీఎంసీల లోటు
- భారీ వరద వచ్చినా నిండేందుకు నెలన్నర పైనే!
- ఖరీఫ్ సాగు మరింత ఆలస్యం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వర్షాకాలం రెండు నెలలు గడిచిపోయినా ఇంకా కృష్ణమ్మ కర్నాటకలోనే బందీగా నిలిచిపోయింది. కృష్ణానది పరీవాహకంగా ఎగువన కన్నడనాట ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి స్థాయి నీటి నిలువలతో కళకళలాడుతున్నాయి. మరోవైపు దిగువన తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన ప్రాజెక్టులు చుక్క నీరుకూడా చేరక వెలవెల బోతున్నాయి. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచిపోయింది. ఇప్పటిదాకా జూరాల మినహా మిగిలిన శ్రీశైలం, నాగార్జున సాగర్ తదితర ప్రాజెక్టుల్లోకి ఈ ఏడాది ఇంకా వరదనీటి ప్రవాహాల జాడ కనిపించటంలేదు. ఖరీఫ్ పంటలసాగు అదను దాటిపోతోందని మరోవైపు కృష్ణా నది ప్రాజెక్టుల పరిధిలో ఉన్న ఆయకట్టు రైతాంగం ఆందోళన చెందుతోంది. కనీసం ఈ నెల రెండవ వారానికైనా ప్రాజెక్టుల్లోకి నీరు చేరి ఆయకట్టుకు నీటి విడుదల ప్రారంభమవుతుందా అన్నది కూడా సందేహంగా ఉంది. ఒక్క కృష్ణాడెల్టా మినహా మరెక్కడా కనీసం వరినార్లు పోసుకునే పరిస్థితికూడా లేకుండా పోయింది. కృష్ణానది పరీవాహకంగా ఎగువన కర్నాటకలో ఉన్న ఆల్మట్టి జలాశయంలోకి ఈ ఏడాది జూన్‌నుంచి ఇప్పటివరకూ ఈ వర్షాకాలంలో 140టీఎంసీల వరదనీరు ఎగువ నుంచి చేరుకుంది. ఆల్మట్టి జలాశయం పూర్తి స్థాయి నీటి నిలువ సామర్ధ్యం 129 టీఎంసీలు కాగా, ఈ జలాశయంలోకి గరిష్ట నిలువ సామర్థ్యానికి మించి 11టీఎంసీల నీరు చేరింది. కర్నాటకలోనే ఆలమట్టి జలాశయానికి దిగువన ఉన్న నారాయణపూర్ జలాశయం పూర్తిస్థాయి నీటినిలువ సామర్ధ్యం 37.67టీఎంసీలు కాగా ఇప్పటివరకూ ఈ జలాశయంలోకి ఎగువనుంచి 30టీఎంసీల నీరు చేరింది. డెడ్‌స్టోరేజి నీటితో కలుపి ఈ జలాశయంలో మొత్తం 36.98టీఎంసీల నీరు నిలువ ఉంది.

ఒక వైపు ఆలమట్టి, నారాయణపూర్ జలాశయాల్లోకి ఎగువన కొత్త నీరు చేరుతుండగా వచ్చిన నీటిని వచ్చినట్టే కర్నాటక సర్కారు ప్రధాన పంట కాలువల ద్వారా తాగేస్తోంది. దీంతో నాలుగు రోజుల కిందటే ఈ రెండు ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు గరిష్టస్థాయికి చేరుకుని గేట్లు తెరుచుకుని తెలుగు నేలపైకి పరుగులు పెట్టాల్సిన కృష్ణామ్మ కర్నాటకలోనే బందీగా మారిపోయింది. మంగళవారం నీటి నిలువలు , ఎగువనుంచి వస్తున్న వరదనీటి ప్రవాహాలు పరిశీలిస్తే ఆల్మట్టిలో 1.531 టీఎంసీలు, నారాయణపూర్‌లో 0.666 టీఎంసీల మేరకు మాత్రమే ఖాళీ ఉంది. అయితే ఎగువ నుంచి ఆల్మట్టిలోకి 35521 క్యూసెక్కుల నీరు చేరుతుండగా, బయటకు 18448 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. నారాయణపూర్‌లో ఈ నీటిని నిలవ చేస్తూ పంటకాలువల ద్వారా ఆయకట్టుకు 11340 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పవర్‌హౌస్ ద్వారా 1208క్యూసెక్కుల వినియోగిస్తున్నారు.

438టీఎంసీలు ఖాళీ

కృష్ణానదిపై తెలుగురాష్ట్రాల్లో ఉన్న ప్రధాన జలాశయాలు డెడ్‌స్టోరేజికి దిగువన బిక్కుబిక్కు మంటున్నాయి. ఈ జలాశయాలను పూర్తి స్థాయిలో నిండాలంటే 438 టీఎంసీల నీరు చేరాల్సివుంది. జూరాలలో 3.78టీఎంసీలు ,శ్రీశైలంలో 196.26 టీఎంసీలు, నాగార్జున సాగర్‌లో 195.63 టీఎంసీలు, పులిచింతల జలాశయంలో 42 టీఎంసీల మేరకు ఖాళీ ఉంది. ఎగువన భారీ వర్షాలతో కృష్ణానదికి వరదలు పోటెత్తి రోజుకు లక్ష క్యూసెక్కుల నీరు చేరినా ఈ ప్రాజెక్టులు నిండేందుకు నెలన్నర సమయం పడుతుందని నీటిపారుదల శాఖ అధికారులు నిర్లిప్తత వ్యక్తం చేస్తున్నారు .

> ఎగువన కర్నాటక బంధనాలు తెంచుకుని కృష్ణమ్మ శ్రీశైలం చేరెదెన్నటికో అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కర్నాటక ప్రభుత్వం ముందు జాగ్రత్త కింద ఆలమట్టి, నారాయణపూర్ జలాశయాల్లో ప్రతిఏటా నాలు
>
> **శ్రీశైలం చేరెదెన్నటికో?**
>
> గైదు టీఎంసీల ఖాళీ పెట్టుకుని ఎగువనుంచి వచ్చిన నీటిని వచ్చినట్టే గేట్లెత్తి దిగువకు విడుదల చేసేది. ఈ సారి ఆలమట్టిలో నీటిమట్టం గరిష్టస్థాయి 1704 అడుగులకుగాను 1704.46అడుగులకు చేరుకున్నా ఇంకా గేట్ల ఎత్తివేతకు మనసు రాక మీనమేషాలు లెక్కపెడుతుంది.

ఈ సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లు

- రెండు రోజులుగా ఢిల్లీలో ఎస్సీ కార్పొరేషన్ ఆందోళన



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కనీసం తెలుగు రాష్ట్రాల వరకైనా ఎస్సీ వర్గీకరణకు అవకాశం కల్పించాలని తెలంగాణా ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. ఎస్సీలను ఏబీసీడీ కేటగిరీలుగా వర్గీకరించాలంటూ మాదిగ జేఏసీ, టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ తెలంగాణా భవన్ వద్ద ఆందోళన చేపట్టారు. వెంకయ్య నాయుడు మాదిగలను ఉపయోగించుకుని ఉప రాష్ట్రపతి అవబోతున్నారని రవి విమర్శించారు. బీజేపీ మాదిగలను ఓటు బ్యాంకుగా చూస్తోందని ఆరోపించారు. దళితులపై దాడులు, హత్యలకు ప్రభుత్వమే పాల్పడుతోందని మండిపడ్డారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని రవి హెచ్చరించారు.

కాలుష్య ఉపశమనానికి అర్బన్ పార్కులు

- పార్కుల ఏర్పాటుకు రూ. 25 కోట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నగరాలు, పట్టణాలకు సమీపంలోని అటవీ భూములను గుర్తించి అర్బన్ పార్కులను అభివృద్ధి పర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణవ్యాప్తంగా 80 అర్బన్ పార్కులను అభివృద్ధి చేయాలని సంకల్పించింది. ఇప్పటికే 12 పార్కులను పూర్తి స్థాయిలో అభివృద్ధి పర్చడం జరిగింది. మరో 24 పార్కులు అభివృద్ధి దశలో ఉన్నాయి. ఒక్కో పార్కును ఒక్కో థీమ్‌తో తీర్చిదిద్దడం జరుగుతుంది. హైదరాబాద్ నగరం చుట్టూ అభివృద్ధి చేసిన పార్కులు, వాటి ప్రత్యేకతలను పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. అర్బన్ పార్కుల అభివృద్ధికి రూ. 25 కోట్లు కేటాయించింది. హైదరాబాద్‌తో పాటు అన్ని పట్టణ ప్రాంతాలు, ఆవాసాలకు వీలైనంత సమీపంలో ఈ అర్బన్ లంగ్ స్పేస్‌లను అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో అటవీ శాఖ చర్యలు చేపట్టింది. పట్టణాల్లో నిత్య ట్రాఫిక్ కాలుష్యం నుండి ఉపశమనం కోసం అర్బన్ పార్కుల ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. ఇక మీదట అటవీ శాఖ ఆధ్వర్యంలో పట్టణాలు, నగరాల సమీపంలోని స్థలాల్లో ఉద్యాన వనాలను అభివృద్ధి పర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. నగర పాలక, పురపాలక సంస్థల పరిధిలోని స్థలాలతో పాటుగా అటవీ శాఖ పరిధిలోని స్థలాలు, ఇతర ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో పార్కులను అభివృద్ధి పర్చడానికి చర్యలు తీసుకుంటుంది. నగర, పట్టణ జీవులు రోజూ నడక, యోగా, వారాంతాల్లో కుటుంబంతో సహాసేద తీర్చే విధంగా పార్కులను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆగస్టు 10 లోగా జరిమానా చెల్లించండి

29 కార్పొరేట్ కాలేజీలకు ఇంటర్ బోర్డు ఆదేశం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని 29 కార్పొరేట్ కాలేజీలు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోలేదని ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్ తెలిపారు. శ్రీచైతన్య, నారాయణ విద్యా సంస్థలకు చెందిన 29 కాలేజీలకు విజిలెన్స్ జరిమానా విధించిందని, ఆ బకాయిలను ఇప్పటి వరకు చెల్లించకపోవడంతో ఆయా కాలేజీలకు అనుబంధ గుర్తింపుకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించలేదని స్పష్టం చేశారు. వారు జరిమానా బకాయిలను చెల్లిస్తే వారికి అనుబంధ గుర్తింపు ఇస్తామన్నారు. బకాయిలు చెల్లించడానికి ఆగస్టు 10 తుది గడువుగా నిర్ణయించినట్టు తెలిపారు. బోర్డు కార్యదర్శి అశోక్ బుధవారం మీడియాతో మాట్లాడారు.

ఇంటర్ మొదటి సంవత్సరంలో ఇప్పటి వరకు 98 వేల మంది ప్రవేశాలు పొందారని, గత ఏడాది 92 వేల మంది ప్రవేశాలు పొందగా ఈ ఏడాది అంతకంటే ఎక్కువ ప్రవేశాలు పొందారని చెప్పారు. ఈ ఏడాది లక్ష మంది ప్రవేశాలు పొందుతారని భావిస్తున్నట్టు చెప్పారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం 20 శాతం ప్రవేశాలు పెరుగుతూ వస్తున్నాయన్నారు. ప్రవేశాల కోసం ఆగస్టు 10 వరకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1600 కాలేజీలు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్నాయన్నారు. వాటిలో ఇప్పటికే 1205 కాలేజీలకు అనుబంధ గుర్తింపును ఇచ్చామని, మరో 395 కాలేజీల అనుబంధ గుర్తింపు ప్రక్రియ కొనసాగు తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో డ్రగ్స్ వ్యతిరేక కమిటీలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. లెక్చ రర్లతోపాటు విద్యార్థులతో కలిపి కమిటీలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. శ్రీచైతన్య సంస్థకు చెందిన 16 కాలేజీలకు విజిలెన్స్ రూ.1,04,14,000 జరిమానా విధించారని, నారాయణ సంస్థకు చెందిన 13 కాలేజీలకు రూ.62,74,000జరిమానా విధించారని గుర్తు చేశారు. వారు ఇప్పటి వరకు జరిమానా చెల్లించ లేదని, వారికి ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. అవసరం అయితే అనుబంధ గుర్తింపును ఇవ్వకుండా రద్దు చేస్తామన్నారు. ఇప్పటికే ఆయా కాలేజీల్లో విద్యార్థులు చేరారని వారికి ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించగా ఆయా కాలేజీలకు అనుబంధ గుర్తింపు రాకపోతే వాటిలో చేరిన విద్యార్థులను ప్రభుత్వ, ఇతర ప్రైవేటు కాలేజీల నుంచి వార్షికపరీక్షలకు అనుమతి ఇస్తామని తెలిపారు. కొత్తగా 6, 7 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు కావాలని విజ్ఞప్తులు వచ్చాయని వాటి పై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవల్సి ఉందన్నారు.

8 నుంచి ఐసెట్ తుది కౌన్సెలింగ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎంబిఏ, ఎంసీఏ కోర్సుల్లో చేరడం కోసం నిర్వహించే ఐసెట్ తుది విడత కౌన్సిలింగ్ 8 నుంచి జరగనుంది. 8 నుంచి ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని ప్రవేశాల కన్వీనర్ వాణి ప్రసాద్ తెలిపారు. 8, 9 తేదిల్లో విద్యార్థులు వెబ్ ఆప్షన్లను ఇవ్వాల్సి ఉంటుంది. 11న సీట్ల కేటాయింపు ఉంటుంది.

ఢిల్లీలో మత్స్యకారుల మహాధర్నా

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఏపీలో మత్స్యకారులను ఎస్టీల్లో చేరుస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడా ఊసే ఎత్తడం లేదని కాంగ్రెస్ మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ విమర్శించారు. ఢిల్లీ జంతర్‌మంతర్‌లో అఖిల భారత మత్స్యకారుల సంఘం నిర్వహించిన మహా ధర్నాలో ఆయన పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన మత్స్యకారులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. తీర ప్రాంతాల్లో ప్రమాదకర పరిశ్రమలు పెట్టి తమ పొట్ట కొడుతున్నారని మోపిదేవి మండిపడ్డారు. తీరానికి కనీసం 50 కిమీ దూరంలో పరిశ్రమలు పెట్టుకుంటే తమకే అభ్యంతరం లేదని అన్నారు. పారిశ్రామిక కాలుష్యం వల్ల మత్స్య సంపద నాశనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో తప్ప అన్ని రాష్ట్రాల్లో మత్స్యకారులను ఎస్టీల్లో లేదా ఎస్సీల్లో చేర్చారని మత్స్యకారుల సంఘం నేత ఏఎల్ మల్లయ్య చెప్పుకొచ్చారు. 3 దశాబ్దాల నుంచి తమ అంశం పెండింగ్‌లో ఉందని తెలిపారు. మత్స్యకారులకు ప్రత్యేక కేంద్ర మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని మల్లయ్య డిమాండ్ చేశారు. మత్స్య సంపద ద్వారా దేశానికి లభిస్తున్న విదేశీ మారక ద్రవ్యంలో 10 శాతం వారి అభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సి ఉన్నా, ఇంతవరకూ కనీసం ఒక్క రూపాయి కూడా విదల్చలేదని మండిపడ్డారు.

రోడ్లు వేయకుండా పాయింట్లు వేస్తారా?

కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ నగరంలో రోడ్లు సరిగా వేయకుండా, పార్కింగ్ స్థలాలు కేటాయించకుండా వాహనదారులకు పాయింట్లు పెట్టడం దారుణమని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి దుయ్యబట్టారు. రోడ్లు సరిగా వేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వారికి పాయింట్లు పెట్టి వారి పై చర్యలు తీసుకోవాలని బుధవారం విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. వాహనదారులకు ఎలాంటి సదుపాయాలు కల్పించకుండా పాయింట్లు పెట్టి లైసెన్స్ రద్దు చేస్తామంటూ బెదిరించడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. సీసీ కెమెరాలు లేనిచోట ట్రాఫిక్ పోలీసులు పెద్ద ఎత్తున వసూళ్ళకు పాల్పడుతున్నారని, జంట నగరాల్లో వాహనదారుల నుంచి ఛలాన్ల పేరుతో దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. పోలీసులు ప్రకటించిన పాయింట్లు, ప్రస్తుతం విధిస్తున్న ఛలాన్లు, రోడ్ల పరిస్థితి, పార్కింగ్ స్థలాలపై చర్చించేందుకు ప్రభుత్వం వెంటనే అఖిలపక్షసమావేశం ఏర్పాటు చేయాలని పొంగులేటి కోరారు. ట్రాన్స్‌కో, జెన్‌కోలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బందిని క్రమబద్ధీకరిస్తామని తమ పార్టీ ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిందని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలపై ఉద్యమిస్తుంటే, దాన్ని చూసి భరించలేని తెరాస నాయకులు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. టిడిపి హయాంలో జరిగిన నీరుకొండ, పాదిరికుప్పం సంఘటనలను కాంగ్రెస్‌కే ఆపాదిస్తున్నారని తప్పుబట్టారు. విద్యుత్ సంస్థలో పనిచేసే వారిని రెగ్యులరైజ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ కొందరు కోర్టుకు పోతే, దాన్ని కూడా కాంగ్రెస్‌కే అంటగడతారా అని ఆయన ప్రశ్నించారు.

ఆ దంపతులు ఆదర్శనీయులు



కాకినాడ, ఆంధ్రప్రభ : వారిద్దరూ యువ ఐఎఎస్ అధికారులు. ఒకరు రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ దినేష్‌కుమార్. మరొకరు రాజమహేంద్రవరం సబ్‌కలెక్టర్ విజయ్‌కృష్ణన్. వీరిద్దరూ దంపతులు. విజయకృష్ణన్ గర్భవతికావడంతో ప్రసవానికి భర్త పని చేస్తున్న రంపచోడవరం వచ్చారు. మంగళవారం వీరిద్దరూ రంపచోడవరంలోని ఏరియా ఆసుపత్రికెళ్ళారు. ప్రసవం కోసం విజయ్‌కృష్ణన్ అక్కడే చేరారు. బుధవారం ఉదయం ఆరున్నర గంటలకు మగబిడ్డకు జన్మనిచ్చారు. వాస్తవానికి ఈ ఇద్దరూ ఐఎఎస్ అధికారులు కావాలనుకుంటే అతిపెద్ద కార్పొరేట్ ఆసుపత్రుల్లో ప్రసవానికెళ్ళేవారు. కానీ సాధారణ ప్రజలకు ఆదర్శంగా ఉండాలన్న లక్ష్యం వారిది. అందుకే గిరిజన కేంద్రం రంపచోడవరలో ప్రసవం చేసుకుని ప్రభుత్వాసుపత్రుల్లో కూడా మెరుగైన సదుపాయాలున్నాయన్న విషయాన్ని సాధారణ ప్రజలకు అర్థమయ్యేలా చేశారు. ఇటీవల కాలంలో ప్రభుత్వాసుపత్రుల పట్ల ప్రజల్లో విశ్వసనీయత సడలుతోంది. ఓ వైపు ప్రభుత్వం ఈ ఆసుపత్రుల నిర్వహణ కోసం కోట్లాది రూపాయలు వ్యయంచేస్తోంది. వివిధ రంగాల్లో నిష్ణాతులైన వైద్యుల్ని తెచ్చి వీటిలో నియమిస్తున్నారు. అయితే ఒకరిద్దరు చేస్తున్న పొరపాట్ల కారణంగా ఆసుపత్రుల నిబద్ధతపైనే సందేహాలు వ్యక్తమౌతున్నాయి. ఏ కాస్త ఆర్థిక స్థితిమంతులైనా ప్రభుత్వాసుపత్రుల వైపు తొంగి చూడ్డంలేదు. ఇలాంటి దశలో ఐఎఎస్ అధికారులు తీసుకున్న నిర్ణయం అందరి మన్ననలు పొందుతోంది. ఈ చర్య గిరిజనుల్లో ప్రభుత్వాసుపత్రి పట్ల విశ్వాసాన్ని పెంపొందించేందుకు ఉపయోగపడనుంది. కాగా చింతూరు ఐటిడిఎ పిఓ చినబాబు, రంపచోడవరం ఎఎస్‌పి అడ్మాన్‌అస్మీ, తహశీల్దార్ రామోజీ, ఎపిఓ నాయుడు, అడిషనల్ డిఎమ్‌హెచ్‌ఓ పవన్‌కుమార్, ఎమ్‌పిడిఓ సరస్వతి, సర్పంచ్ నిరంజనీదేవిల్తో పాటు రంపచోడవరం ప్రెస్‌క్లబ్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు ఆ దంపతుల్ని కలసి తమ శుభాభినందనలు తెలియజేశారు.

శ్రీవారి ఆలయంలో అంకురార్పణ



తిరుమల (కెఎన్ఎన్ ప్రతినిధి): తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం నుండి శుక్రవారం వరకు జరుగనున్న పవిత్రోత్సవాలకు బుధవారం రాత్రి 9 నుండి 10 గంటల నడుమ ఘనంగా అంకురార్పణ జరిగింది.ఈ సందర్భంగా రాత్రి 7 నుండి 9 గంటల వరకు సేనాధిపతివారిని వసంతమండపానికి వేంచేపు చేసి మృత్సంగ్రహణం,ఆస్థానం నిర్వహిస్తారు.ఆ తరువాత పవిత్రమండపంలోని యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.ఈ కారణంగా వసంతోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది.

పవిత్రోత్సవాల అంకురార్పణం సందర్భంగా బుధవారం ఉదయం 5 నుండి 6 గంటల నడుమ శ్రీవారి మూలవిరాట్ ఎదుట ఆచార్య రుత్విక్ వరణం నిర్వహించారు.అర్చకుల విధులు కేటాయింపునే రుత్విక్ వరణం అంటారు. యాగకర్మలు, పుణ్యహవచనం, హోమాలు తదితర వైదిక కార్యక్రమాల నిర్వహణ కోసం ఒక్కొక్కరికి ఒక్కో బాధ్యతను అప్పగిస్తారు. సాక్షాత్తు శ్రీవారి ఆజ్ఞ మేరకు తాము విధులు పొందినట్టు అర్చకులు భావిస్తారు.పవిత్రోత్సవాలలో భాగంగా మొదటి రోజు పవిత్రప్రతిష్ఠ,రెండో రోజు పవిత్ర సమర్పణ,చివరి రోజు పూర్ణాహుతి నిర్వహిస్తారు.శ్రీ వారి ఆలయంలో సంవత్సర కాలంలో తెలిసీతెలియక వివిధ కైంకర్యాలలో చోటు చేసుకున్న దోషాల నివారణకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు.ఈ ఉత్సవాన్ని దోష నివారణ,సర్వయజ్ఞ ఫలప్రద,సర్వదోషోపశమన, సర్వతుష్టికర, సర్వకామప్రద తదితర పేర్లతో పిలుస్తారు.పవిత్రం,ఉత్సవం అనే రెండు పదాల కలయిక వల్ల పవిత్రోత్సవం ఏర్పడింది. పవిత్రాలను తయారు చేయడానికి 20 మూరలు పట్టుదారం గాని 200 మూరల నూలు దారం ఉపయోగిస్తారు.ఈ దారాలకు తెలుపు, నలుపు,ఎరుపు,ఆకుపచ్చ,పసుపుపచ్చ రంగులు అద్దకం చేస్తారు. తిరుమల శ్రీవారి ఆలయంలో క్రీ.శ.1463వ సంవత్సరం నుంచి పవిత్రోత్సవాలు జరిగినట్టు శాసనాల ద్వారా స్పష్టమవుతోంది.ఆలయ మొదటి ప్రాకారంలో గల వగపడి వరండాలో ఉత్తరం వైపున రాతి గోడపై పవిత్రోత్సవాల లెక్కలకు సంబంధించిన శాసనం లభ్యమైంది.పవిత్ర తిరునాల్ పేరిట నిర్వహించిన ఈ ఉత్సవాల్లో ఉపయోగించిన వస్తువుల జాబితా,వాటి ధరల వివరాలున్నాయి.క్రీ.శ 1562 తరువాత ఆనాటి పరిస్థితుల కారణంగా ఈ ఉత్సవం ఆగిపోయింది.1962లో ఈ పవిత్రోత్సవాలు తిరిగి ప్రారంభమయ్యాయి.పవిత్రోత్సవాల నేపథ్యంలో నేడు తిరుప్పావడ సేవ, నిజపాద దర్శనం, కల్యాణోత్సవం, అర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, వసంతోత్సవం సహస్ర దీపాలంకార సేవలను రద్దు చేయడమైనది. ఆయా రోజుల్లో అర్చన, తోమాల సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు.

నంద్యాల ఉప ఎన్నికలకు

టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి నామినేషన్ దాఖలు



కర్నూలు, కెఎన్ఎన్ బ్యూరో : నంద్యాల ఉప ఎన్నికల టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. నంద్యాల ఆర్డీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, జెసి ప్రసన్న వెంకటేష్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. అంతకు ముందు నామినేషన్‌ను పురష్కరించుకొని నంద్యాల పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీని నిర్వహించారు. భూమా స్వగృహం నుంచి మున్సిపాలిటి, సంజీవనగర్, శ్రీనివాస సెంటర్, టెక్కె మార్కెట్ యార్డు మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగుతుండగా ప్రత్యేక వాహనంలో ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మంత్రులు అమరనాథ్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అఖిలప్రియ, కాల్వ శ్రీనివాసులు, రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్, ఎమ్మెల్సీ ఫరూక్, ఏవి సుబ్బారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నౌమాన్, భూమా తనయుడు జగన్ విఖ్యాత్‌రెడ్డి, భూమా తనయురాలు మౌనికారెడ్డిలు వెంట రాగా నామినేషన్ పత్రాలను అందజేశారు. తెలుగుదేశం పార్టీ ర్యాలీకి అనూహ్య స్పందన లభించింది.

నంద్యాల పట్టణంతోపాటు మండలం, గోస్పాడు మండలాలతోపాటు ఆళ్ళగడ్డ నియోజకవర్గం నుంచి కూడా కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. నామినేషన్ సమర్పించిన అనంతరం భూమా బ్రహ్మానందరెడ్డి తనను కలసిన విలేఖరులతో మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గంలో కార్యకర్తలకు అండగా ఉంటా నన్నారు. కష్టపడి శ్రమించి నంద్యాల ప్రజల రుణాన్ని తీర్చుకుంటానన్నారు. ప్రజా సమస్యలను పరిష్కారానికే తన మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

వార్డు పర్యటనతోపాటు గ్రామాల్లో పర్యటించినప్పుడు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ఇప్పటి వరకు 70 శాతానికి పైగా గ్రామాలు, పట్టణంలో పర్యటించానన్నారు. నామినేషన్ సందర్భంగా ప్రజల నుంచి లభించిన మద్దతును కళ్ళారా చూసిన తర్వాత తనలో ఉత్సాహం రెట్టింపు అయిందన్నారు. నంద్యాల ఉప ఎన్నికలు ఎంత మెజార్టీ వస్తుందని భావిస్తున్నారని కెఎన్ఎన్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ ఈ సమయంలో మెజార్టీ గురించి మాట్లాడటం బాగుండదని, తనను ఎంత మెజార్టీతో ప్రజలు గెలిపిస్తారో చూద్దామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆళ్ళగడ్డ మార్కెట్ యార్డు ఛైర్మెన్ బివిరామిరెడ్డి, న్యాయవాది సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నంద్యాలలో ప్రలోభాలు నివారించాలి

● రాష్ట్ర ఎన్నికల అధికారికి ఎన్నికల నిఘా వేదిక వినతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నంద్యాల ఉపఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రలోభాలను నివారించాలని ఎన్నికల నిఘా వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ ఉపఎన్నికలో డబ్బు, మద్యం వినియోగం, అధికార దుర్వినియోగం జరుగుతున్నాయని వీటిని నివారించేందుకు సత్వర చర్యలు తీసుకోవలసిందిగా రాష్ట్ర ఎన్నికల అధికారి భన్వర్‌లాల్‌కు ఈ వేదిక విజ్ఞప్తి చేసింది. ప్రజలు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా, ప్రశాంతంగా వినియోగించుకునేందుకు కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ ఎన్నికల వేదిక రాష్ట్ర కమిటీ ఛైర్మన్ జస్టిస్ అంబటి లక్ష్మణ్‌రావు, కన్వీనర్ వి.లక్ష్మణ్‌రెడ్డి బుధవారం ఈ మేరకు భన్వర్‌లాల్‌కు ఒక వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల అక్రమాలను నివారించేందుకు టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటుచేసి తగిన సిబ్బందిని నియమించి ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలని వారు కోరారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పోలీసు, అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. మంత్రులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, దీనిపై నిఘా పెట్టాలని వారు కోరారు.

అలిపిరి చెక్‌పాయింట్ వద్ద

గన్ కలకలం



తిరుమల, కెఎన్ఎన్ ప్రతినిధి : అలిపిరి చెకింగ్ పాయింట్లో గన్, బుల్లెట్లు లభ్యమైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది.తిరుమల ఏఎస్‌పి మురళీకృష్ణ తెలిపిన వివరాల మేరకు తిరుమల శ్రీవారి దర్శనార్థం మహారాష్ట్ర పూణెకు చెందిన విజయ్‌మానే అనే వ్యాపారవేత్త వాహనంలో తిరుమలకు బయలుదేరి బుధవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో అలిపిరి చేరుకున్నారు.చెకింగ్ పాయింట్ వద్ద భద్రతా సిబ్బంది వారి వాహనాన్ని తనిఖీ చేయగా వారి వద్ద ఒక గన్, 14 బుల్లెట్లు లభ్యమయ్యాయి.వారిని విచారించగా అది లైసెన్స్‌డ్ పిస్టల్ అని తేలింది.అయినప్పటికీ స్వంత రాష్ట్రాన్ని దాటి నిషేధిత ప్రాంతమైన తిరుమలకు తీసుకురావడం నేరం కాబట్టి పోలీసులు అతనిపై లీగల్ ఆక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.భక్తుడు తెలియక తీసుకువచ్చానని,మరో ఉద్దేశంతో తీసుకురాలేదని తెలిపారన్నారు.

ఉద్యోగులూ ఆందోళన వద్దు!

వయస్సు కుదించం

● అదంతా దష్ప్రచారం ● నేనే పెంచా... ఎందుకు తగ్గిస్తా... ● డీఏ కూడా చెల్లిస్తాం ● ఎన్జీవో సంఘాల ప్రతినిధులకు ఏపీ సీఎం చంద్రబాబు హామీ



అమరావతి, ఆంధ్రప్రభ: ఉద్యోగుల పదవీవిరమణ వయస్సును నేనే పెంచా.. అటువంటిది నేనే ఎందుకు దానిని తగ్గిస్తాను.. కనీసం అవగాహన లేకుండా కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఏపీఎన్జీవో ఉద్యోగ సంఘాల నేతలతో అన్నారు. బుధవారం ఏపీఎన్జీవో నేత అశోక్‌బాబు నాయకత్వంలో 50 మంది ఉద్యోగ సంఘాల నేతలు ముఖ్యమంత్రిని ఆయన ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా 50 సంవత్సరాలకు వయస్సును కుదిస్తారంటూ జరుగుతున్న ప్రచారంపై సీఎంతో చర్చించారు. దీనిపై ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని వెంటనే ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని వారు సీఎంను కోరారు. దీనికి స్పందించిన ముఖ్యమంత్రి పదవీ విరమణ వయస్సును పెంచిన తానే ఎందుకు తగ్గిస్తాననీ అభిప్రాయపడ్డారు. ఉద్యోగులు ప్రయోజనాలకు ప్రభుత్వం భంగం కలిగించదని హామీ ఇచ్చారు. పెన్షన్, ఫండమెంటల్ రూల్స్ సవరణ, 30 సంవత్సరాల సర్వీసు అమలు వంటివి కేవలం వదంతులు మాత్రమేననీ అన్నారు. 3వ తేదీ క్యాబినెట్ సమావేశంలో డిఏను ప్రకటిస్తామనీ సీఎం ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాలకు హామీ ఇచ్చారు. అనంతరం సీఎంను కలిసి బయటకు వచ్చిన ఏపీఎన్జీవో నేత పి. అశోక్‌బాబు మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగుల ఆందోళనకు సంబంధించిన అన్నీ విషయాల్లో సీఎం తమకు స్పష్టత ఇచ్చారని అన్నారు. సీఎం ఇచ్చిన హామీతో ఉద్యోగుల్లో ఆనందం కనిపిస్తుందన్నారు. ఫండమెంటల్, పెన్షన్ రూల్స్ సవరణ, ఫెర్మార్మెన్స్ ఇండికేటర్స్, 30 సంవత్సరాల సర్వీసు వంటివి ప్రభుత్వం అమలు చేయబోతుందన్న దానిలో ఏ మాత్రం వాస్తవం లేదిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనాలకు భంగం కలిగించే విధంగా ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రభుత్వం చర్యలు తీసుకోబోదని సీఎం హామీ ఇచ్చినట్లు అశోక్‌బాబు తెలిపారు. ఉద్యోగులకు ఇప్పటి వరకు ప్రభుత్వం రెండు విడతల డిఏ బకాయిలు ఉందని, 3వ విడత డిఏ ప్రకటించవలసిన సమయం వచ్చినప్పటికీ ఇప్పటి వరకు డిఏ విడుదలపై ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఉద్యోగులు తీవ్ర నిరాశతో ఉన్నారన్నారు. అలాగే పిఆర్‌సి ఎరియర్స్ చెల్లింపుపై కూడా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చిన్నట్లు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందించి రాష్ట్ర ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ ఉద్యోగుల ప్రయోజనాలకు భంగం కలిగించదని తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులలో ఉన్నప్పటికీ ఉద్యోగులకు ఇవ్వవలసిన రాయితీలను ప్రకటిస్తూనే ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల వయోపరిమితిని 58 నుంచి 60కి పెంచిందని, విద్యుత్, ఆర్టీసీ, గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది వయోపరిమితిని 60 సంవత్సరాలకు పెంచినట్లు ఆశోక్‌బాబు గుర్తుచేశారు. ఎక్సైజ్‌శాఖలో ఉద్యోగుల పదోన్నతులపై త్వరలోనే ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు 90 శాతం సంతృప్తికరంగా ఉందని, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ప్రభుత్వ అంచనాలకు మించి ఉద్యోగులు సేవలు అందిస్తుండడంపై అభినందిస్తున్నట్లు సీఎం తమకు తెలిపారని అశోక్‌బాబు వెల్లడించారు. సీఎంను కలిసిన వారిలో రాష్ట్ర జేఏసి నేతలు ఎన్. చంద్రశేఖరరెడ్డి, ఐ. వెంకటేశ్వరరావు, ఎం. కమలాకర్, పాండురంగప్రసాద్, నరసింహారావు, ఉదయభాస్కర్, ఎన్. సాంబశివరావు, కె. శ్రీనివాసకుమార్, కె.కె.వి భాస్కరరావు, మధుసూధనరావు, ఏపీఎన్జీవో నేతలు పురుషోత్తం, డి.వి రమణ, ఏ. విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

5న రాష్ట్రానికి ఎన్టీపీసీ డైరెక్టర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎన్టీపిసి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎస్సీ పాండే ఈనెల 5న రాష్ట్రానికి రానున్నారు. ఎన్టీపిసి ఆధ్వర్యంలో 1600మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు తొలిదశ పనులు జరుగుతుండగా, ఆయన పరిశీలించనున్నారు. ఇప్పటివరకు జరిగిన పనులు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన నిర్మాణ పనులపై డైరెక్టర్ పాండే ఉన్నతస్థాయి సమీక్ష చేస్తారు. ప్రణాళికల ప్రకారం తెలం గాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు పనులు జరిగే విధంగా ఆయన సూచనలు చేయ నున్నారు.

ప్రభుత్వ భూములు పార్టీ కార్యకర్తలకు

● యునైటెడ్ బహుజన పోరాట సమితి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ భూములను పేదలకు ఇవ్వకుండా తెలుగు దేశం పార్టీ కార్యకర్తలకు ఇస్తున్నారని యునైటెడ్ బహుజన పోరాట సమితి విమర్శించింది. చుక్కల భూమి పేరుతో కేవలం టిడిపి కార్యకర్తలకే ఇస్తున్నారని, నిజమైన నిరుపేదలకు ఇవ్వడం లేదని పార్టీ జాతీయ కన్వీనర్ కరణం తిరుపతినాయుడు విమర్శించారు. చుక్కల భూమిపై ఆర్డీవోలకు సైతం అధికారం లేకుండా చేశారని అన్నారు. చుక్కల భూమిని నిరుపేదలకు ఇవ్వకుండా టిడిపి నాయకులు చెప్పిన వారికే ఇస్తున్నారని దీంతో పేద రైతులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వేసిన జన్మభూమి కమిటీల ద్వారా కూడా నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరగడం లేదన్నారు. జన్మభూమి కమిటీలు సిఫారసు చేసిన టిడిపి కార్యకర్తలకే బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయని, పేదరైతులకు రుణాలు ఇవ్వకపోవడంతో వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి స్పందించి నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. లేకపోతే పేదరైతుల పక్షాన హైకోర్టును ఆశ్రయిస్తామని తిరుపతి నాయుడు హెచ్చరించారు.

అల్లుశిరీష్ ట్వీట్‌కు బాబు రీట్వీట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : టాలివుడ్ హీరో అల్లు శిరీష్ చేసిన ట్వీట్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పందించారు. ట్విట్టర్‌లో ఆయనకు సమాధానంగా రీట్వీట్ చేశారు. రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబుతో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ భేటీ అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పవన్‌ను ప్రశంసిస్తూ చంద్రబాబు ట్వీట్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్దానం ప్రాంతంలోఉన్న కిడ్నీ సమస్య పరిష్కారానికి పవన్ చొరవ తీసుకోవడం అభినందనీయమని అన్నారు. దీనికి అల్లు శిరీష్ స్పందిస్తూ, నాయకులు రాజకీయాలకు అతీతంగా ప్రజల శ్రేయస్సు కోసం పనిచేయడం చూస్తుంటే సంతోషంగా ఉంది. మొదటి ప్రాధాన్యత దేశానికే అని ట్వీట్ చేశారు. శిరీష్ ట్వీట్‌కు చంద్రబాబు తాజాగా ప్రతిస్పదించారు. నీ అభినందనీయమైన మాటలకు ధన్యవాదాలు అల్లు శిరీష్...ప్రజలకు తొలి ప్రాధాన్యం అనేది మా సూత్రం... ప్రజల శ్రేయస్సుకోసం పనిచేయడాన్ని కొనసాగిస్తాం అని చంద్రబాబు ట్వీట్ చేశారు.



ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచండి

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం ● లబ్ధిదారులకు గృహ మంజూరు పత్రాలు

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో ఎన్టీఆర్‌నగర్-పీఎంఏవై పథకం కింద నిర్మించతలపెట్టిన పేదల గృహ సముదాయాలను వేగవంతంగా పూర్తి చేయా లని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదే శించారు. 15 రోజులకు ఒకసారి డ్రోన్ కెమెరాలతో గృహ సముదాయల నిర్మాణం పనుల పురోగతిని చిత్రీకరించి, తన కు వివరించాలని స్పష్టం చేశారు. లబ్ధిదారుల తుది జాబితాను సత్వరం రూపొందించాలని, ఇప్పటికే ఎంపికైన లబ్ధిదారు లకు గృహ మంజూరు పత్రాలను అందించాలని చెప్పారు. బుధవారం పురపాలక పట్టణాభివృద్ధి శాఖపై సచివాలయంలోని తన కార్యాలయంలో సమీక్ష నిర్వహిం చారు. తాడేపల్లి గూడెంలో ఎన్టీఆర్ నగర్‌కు భూమి పూజ చేశా మని, భీమవరం, పాలకొల్లుల్లో వచ్చే వారం శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభిస్తామని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. మిగిలిన జిల్లాల్లో గృహ సముదాయాలు ఏయే దశల్లో ఉన్నాయో వివరించారు. సీఆర్‌డీఏ పరిధిలో మొత్తం 5,024 ఇళ్ల నిర్మాణాన్ని కేఎంవీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థ చేపట్టిందని తెలిపారు. నంద్యాలలో ఎన్టీఆర్ నగర్ నిర్మాణ సంస్థ అయిన షాపూర్‌జీ పల్లంజీ ప్రతినిధులు ప్రతి వారం ప్రగతి నివేదిక తనకు అందించాలని ఆదేశించారు. ప్రకాశం జిల్లా దొనకొండలో కన్‌స్ట్రక్షన్ సిటీని నిర్మిస్తున్నామని, ఇక్కడ నిర్మాణ రంగానికి సంబంధించి అవసరమైన సకల సామాగ్రి అందుబాటులోకి తెస్తామని చెప్పారు. కన్‌స్ట్రక్షన్ సిటీ పూర్తయితే గృహ నిర్మాణ రంగానికి మరింత ఊరట లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే గృహ నిర్మాణాలకు సంబంధించి నాణ్యతను పరిశీలించేందుకు, పనుల పర్యవేక్షణకు నియమించిన ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ తనకు నివేదిక సమర్పించాలని చెప్పారు.

మున్సిపల్ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్య

రాష్ట్రంలో 1,92,870 మంది చిన్నారులు చదువుతున్న అంగన్‌వాడీ స్కూళ్లలో బోధనకు సంబంధించి అత్యాధునిక మౌలిక వసతులు కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. 92 వేల పాఠ్య పుస్తకాలను ఇప్పటికే పంపిణీ చేశామని, కొత్తగా చేరుతున్న చిన్నారుల సంఖ్య 23 శాతం మేర పెరిగిందని అధికారులు వివరించారు. అలాగే మున్సిప ల్ పాఠశాలల్లో చేరే వారి సంఖ్య ఈ ఏడాది మరింత మెరుగైందని తెలిపారు. ఒకటి నుంచి పదో తరగతి మధ్య గత ఏడాది 1,14,107 మంది విద్యను అభ్యసిస్తే వారి సంఖ్య ఈ విద్యా సంవత్సరంలో పది శాతం పెరిగి 1,44,716 చేరిందనీ ఆరు నుంచి పదో తరగతి చదివే విద్యార్థుల సంఖ్య మాత్రం గత ఏడాది కన్నా ఏకంగా 59 శాతం పెరిగిందనీ ఈ కోర్సు విభాగంలో మొత్తం 57,124 మంది చదువుతున్నారనీ వివరించారు.

అందరూ హర్షించేలా తెలుగు భాష పరిరక్షణ

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం చదువులను ప్రవేశపెట్టినప్పటికి తప్పనిసరి చేయొద్దని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. ఇంగ్లీష్ మీడియం విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన వస్తోందని అధికారులు చెప్పగా, సమాజం కూడా హర్షించేలా తెలుగును పదికాలాలు పదిలంగా కాపాడుకుందామని ముఖ్యమంత్రి అన్నారు. ఎవరికి మాతృభాషను నిర్లక్ష్యం చేస్తున్నారనే భావ న రాకూడాదని చెప్పారు. కాగా 45 రోజుల్లో వీధి కుక్కలు, పందుల నియంత్రణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ముఖ్యమంత్రి లక్ష్యం నిర్దేశించారు. పందుల పెంపకంపై రాష్ట్రంలో ఆధారపడి ఉన్న సుమారు 4,752 కుటుంబాలకు ప్రత్యామ్నయ ఉపాధి మార్గాలు చూపాలని సూచించారు. పట్టణ స్థానిక సంస్థల్లో హ్యాపీ సండే పేరుతో కనీసం నెలకో ఆదివారం అయినా ప్రజలు ఆహ్లాదంగా గడిపేలా చర్యలు తీసుకోవాలని, అన్ని పట్టణాల్లోనూ ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని చెప్పారు. పట్టణాలు, నగరాలు ఆకర్షణీయంగా ఉండేలా పోస్టర్లు, ఫ్లెక్సీలు ఎక్కడ పడితే అక్కడ కాకుండా ప్రత్యేక ప్రదేశాల్లో మాత్రమే ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు.

జీఎస్టీ లోపాలు సరిదిద్దండి

● ప్రత్యేక హోదా రాష్ట్రాల మాదిరి ఆంధ్రప్రదేశ్‌కు జీఎస్టీ రీఫండ్ చేయాలి : సవరణ బిల్లుపై చర్చలో గల్లా జయదేవ్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : జీ ఎస్టీలో లోపాలు సరిదిద్దాలని గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ కోరారు. లోక్‌సభలో వస్తు సేవల పన్ను (జీ ఎస్టీ) సవరణ బిల్లుపై జరిగిన చర్చలో ఆయన పలు లోపాలపై చర్చించారు. ఒకే దేశం - ఒకే పన్ను విధానం భారత దేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేసిందని జయదేవ్ పేర్కొన్నారు. అమెరికా, చైనా వంటి అగ్రదేశాల కంటే భారత మార్కెట్ పురోగమనంలో దూసుకెళ్తుందని అన్నారు. ఈ సందర్భంలో పన్ను విధానంలో కొన్ని చిన్న చిన్న లోపాలు, సమస్యలు ఉన్నాయని జయదేవ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని వ్యవసాయ ఉత్పత్తులను వ్యవసాయేతర ఉత్పత్తులుగా జీ ఎస్టీ పన్ను రేట్లలో వర్గీకరించారని వివరించారు. ఉదాహరణకు పచ్చి మిరపకాయలపై జి ఎస్టీ పన్ను లేదని, అయితే పండు మిర్చిపై మాత్రం 5 శాతం జి ఎస్టీ పన్ను విధించారని తెలిపారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో పండు మిర్చి సాగు ఎక్కువగా ఉందని, ప్రపంచ మార్కెట్‌కు ఎక్కువగా ఎగుమతి అయ్యే పండు మిర్చి గుంటూరు మార్కెట్ నుంచే వెళ్తుందని అన్నారు. పండు మిర్చిని ఎండబెడుతున్నారు కాబట్టి 5శాతం పన్ను విధిస్తామనడం సరికాదని జయదేవ్ వ్యాఖ్యానించారు. దీనిపై పునరాలోచించి జీ ఎస్టీ పరిధి నుంచి పండు మిర్చిని తొలగించాలని ఆయన కోరారు.

పసుపు విషయంలో కూడా ఇదే విధానాన్ని అమలు చేస్తున్నారని జయదేవ్ అన్నారు. ఎండ బెట్టిన పసుపుపై 5శాతం పన్ను విధించటం, ఆరబెట్టని పసుపుపై పన్ను విధించకపోవటం సరి కాదన్నారు. పసుపు పంటపై కూడా ఈ జి ఎస్టీ పన్నును తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కొత్త పన్ను చట్టంతో పొగాకు రైతులు కూడా ఇబ్బంది పడుతున్నారని ఎంపి గల్లా జయదేవ్ అన్నారు. గతంలో ముడి పొగాకుపై సెంట్రల్ ఎక్సైజ్ పన్ను తొలగించారని, అయితే కొత్త జీ ఎస్టీలో మాత్రం ముడి పొగాకుపై 5శాతం, పొగాకు ఉత్పత్తులపై 28శాతం పన్నుగా ప్రకటించటంతో పొగాకు రైతులతో పాటు, ఎగుమతి దారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. మరోవైపు విదేశీ ఎగుమతులపై కూడా ఈ ప్రభావం పడే అవకాశ ముందన్నారు. పొగాకు ఎగుమతుల ద్వారా మన దేశానికి రూ. 6,000 కోట్ల ఆదాయం ప్రతి యేటా వస్తోందని గుర్తు చేశారు. ముడి పొగాకుపై పన్ను తొలగించటంతో పాటు, పొగాకు ఉత్పత్తులపై కూడా పన్ను శాతాన్ని 5కు పరిమితం చేస్తే బావుంటుందని అన్నారు. వస్త్ర తయారీ రంగంపై కూడా జి ఎస్టీ విధానంలో స్వల్ప మార్పులు చేయాల్సిన అవసరమున్నట్లు ఎంపి గల్లా జయదేవ్ తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగం కూడా ఒడిదుడుకులు ఎదుర్కొంటోందని, ఇన్ పుట్ క్రెడిట్ కాల పరిమితి విషయంలో సడలింపు ఇవ్వాల్సిన అవసరముందని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం 2030నాటికి విద్యుత్ ఉత్పాదనతో నడిచే వాహనాలను పూర్తిగా అందుబాటులోకి తీసుకొని రావాలని ప్రయత్నిస్తుంటే, జీ ఎస్టీ చట్టంలో మాత్రం అలాంటి వాహనాలపై, సాధారణ పెట్రోల్, డీజిల్ వాహనాల కంటే ఎక్కువగా పన్ను విధించారని గుర్తుచేశారు. పెట్రోల్, డీజిల్ వాహనాల ద్వారా ఎలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయో ఇప్పటికే ఢిల్లీ లాంటి నగరాలు ఉదాహరణగా నిలిచిన నేపథ్యంలో, ఖచ్చితంగా ఎలక్ట్రిక్ అండ్ హైబ్రిడ్ వాహనాలపై పన్ను శాతం తగ్గించాలని కోరారు.

జీఎస్టీ రిఫండ్ మాకూ కావాలి

రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలతో సమానంగా



పారిశ్రామిక ప్రోత్సహకాలు ఇస్తామన్న హామీని ఎంపీ గల్లా జయదేవ్ మరోసారి గుర్తు చేశారు. జీ ఎస్టీ కొత్త చట్టంలో కూడా ఆ ప్రోత్సహకాలను తమ రాష్ట్రానికి కొనసాగించాలని, ఇప్పుడిప్పుడే విభజన నష్టం నుంచి కోలుకుంటున్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి పారిశ్రామిక ప్రోత్సాహకాలు కొనసాగించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉందని ఆయన కోరారు. గతంలో ప్రత్యేక హోదా కారణంగా పారిశ్రామిక రాయితీలు కల్పించిన రాష్ట్రాల్లో వసూలు చేసిన పన్నును రిఫండ్ చేసేలా జీఎస్టీ చట్టంలోనే ప్రస్తావించారు. ఈ తరహా సదుపాయాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కూడా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

పక్కాప్లాన్

సానుభూతి కోసమే... కాల్పుల డ్రామా





● రూ. 50 లక్షల డీల్ ● విక్రమ్‌గౌడ్‌తో సహా ఆరుగురు అరెస్టు
● పరారీలో మరో ఇద్దరు: సీపీ మహేందర్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ తనయుడు విక్రమ్‌గౌడ్ కాల్పుల డ్రామా కలకలం రేపింది. తనపై కాల్పులకు తానే స్కెచ్ గీసుకున్న విక్రమ్‌గౌడ్ వ్యవహారం గురించి హైదరాబాద్ సీపీ మహేందర్‌రెడ్డి బుధవారం మీడియాకు తెలిపారు. కేసులో మొత్తం కథ, స్క్రీన్‌ప్లే,దర్శకత్వం విక్రమ్‌రెడ్డిదేనన్నారు. విక్రమ్‌గౌడ్ కాల్పుల కేసులో 8 మందిని నేరస్తులుగా గుర్తించామని, నిందితుల కోసం ఐదు రాష్ట్రాల్లో(తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్) గాలించి మరీ పట్టుకున్నామన్నారు. విక్రమ్‌గౌడ్ సహా ఆరుగురిని కస్టడీ లోకి తీసుకోగా, మరో ఇద్దరు నిందితులు వెంకటరమణ అలియస్ చిన్నా(ఎ7)(29), గౌస్ (ఎ8)(35)లు పరారీలో ఉన్నట్లు తెలిపారు.ఈ కేసులో మరో ఆరుగురు అరెస్టయిన నిందితుల నుంచి రూ.5.3 లక్షల నగదు, తుపాకీ, కారు, ఎనిమిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తనపై కాల్పుల ప్లాన్‌కు నాలుగు నెలల క్రితమే విక్రమ్‌గౌడ్ ఓ ప్రణాళిక సిద్ధం చేశారని, ఎవరెవరు ఏం చేయాలనే విషయమై కూడా పక్కాగా సిద్ధం చేసుకున్నారన్నారు. మొత్తం రూ.50 లక్షలకు ఈ ఒప్పందం కుదుర్చుకున్నారని చెప్పారు. కాల్పుల డ్రామాలో భాగంగా గోవిందరెడ్డికి రూ.5 లక్షలను విక్రమ్‌గౌడ్ ఇచ్చారన్నారు. మరో నిందితుడు నందకుమార్‌ను విక్రమ్‌గౌడ్‌కు పరిచయం చేసింది గోవిందరెడ్డేనని అన్నారు. ఈ కేసులో నిందితులు జులై 6న విమానంలో ఇండోర్ వెళ్లారని, రూ.30 వేలతో ఓ తుపాకీ, తూటాలు కొను గోలు చేశారని చెప్పారు. జులై 8న విక్రమ్‌గౌడ్‌కు తుపాకీ అందింది. జులై 17న పుట్ట పర్తికి విక్రమ్‌గౌడ్ వెళ్లారని తెలిపారు. మూడు రౌండ్ల కాల్పులు జరపాలని విక్రమ్ సూచించాడని, ఒకవేళ తన భార్య కానీ, వాచ్‌మెన్ కానీ వస్తే వారిని బెదిరించేందుకు గాల్లోకి ఓ రౌండ్ కాల్చుమని విక్రమ్ వారికి చెప్పాడని తమ దర్యాప్తులో తెలిసిందని అన్నారు. నిందితుల కోసం రూ.30 వేలు ఖర్చుపెట్టి ఓ బైక్ కూడా కొనుగోలు చేశారని, ఆ బైక్ ఇంజిన్, చాసిస్ నెంబర్లను నిందితులు చెరిపి వేశారన్నారు. జులై 26వ తేదీనే తనపై కాల్పులు జరిపేందుకు విక్రమ్ నిర్ణయించాడని, అపోలో ఆసు పత్రి సమీపంలో ఓ గెస్ట్‌హౌస్‌లోనే నిందితులు బస చేశారన్నారు. 28వ తేదీ తెల్లవారుజామున నిందితులతో విక్రమ్ గౌడ్ భేటీ అయ్యాడని అన్నారు. నిందితులను విక్రమ్ గౌడ్ తన కారులోనే ఇంటివరకు తీసుకొచ్చారని, వాచ్‌మెన్ తన గదిలోకి వెళ్లిపోగానే వారిని ఇంట్లోకి తీసుకువెళ్లారని చెప్పా రు. తనపై షూట్ చేసిన తర్వాత నిందితులు ఏ మార్గంలో పారిపోవాలో విక్రమ్‌గౌడ్ చెప్పారని, ఆ మార్గాన్ని రెండు సార్లు వారికి చూపించారని, కాల్పుల అనంతరం ఆ తుపాకీనీ పారవేయదలిచిన ప్రాంతాన్ని కూడా విక్రమ్‌గౌడ్ ముందు గానే వారికి చూపించినట్లు చెప్పారు. మూడో రౌండ్ కాల్చే టప్పుడు రయీస్‌ను పారిపొమ్మని విక్రమ్‌గౌడ్ ఆదేశించాడని, మొత్తం ఐదు రౌండ్ల బుల్లెట్లు లోడ్ చేశారని చెప్పారు. బుధవారం ఉదయం హకీంపేట చెరువు నుంచి విక్రమ్‌గౌడ్‌పై కాల్చిన తుపాకీని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. విక్రమ్‌గౌడ్ భార్య షిపాలికి కూడా ఈ ప్లాన్ గురించి ఆయన చెప్పలేదని, ప్రజల సానుభూతి కోసమే విక్రమ్‌గౌడ్ కాల్పుల డ్రామా ఆడారని, 2019 ఎన్నికల్లో ప్రజా ప్రతినిధిగా గెలవాలన్న కోరికతోనే విక్రమ్ తనపై కాల్పులు డ్రామా ప్లాన్ వేశాడని, ఈ మేరకు ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశాని సీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు.

నందకుమార్‌కు నేరచరిత్ర ఉంది...

నిందితుడు నందకుమార్‌కు నేరచరిత్ర ఉంది. కదిరి, చౌటుప్పల్‌లో డెకాయిటీ, హౌస్ బ్రేకింగ్‌కు పాల్పడిన మొత్తం ఏడు కేసుల్లో నిందితుడని పోలీసులు తెలిపారు. ఐదేళ్లుగా మరో నిందితుడు గోవింద్‌రెడ్డికి నందకుమార్ స్నేహితుడు. నందకుమార్‌కు షేక్ అహ్మద్ స్నేహితుడు. మధ్యప్రదేశ్ ఇండోర్‌కు చెందిన రయీస్‌ఖాన్ తన స్నేహితుడు తాహెర్ ద్వారా షేక్ అహ్మద్‌కు మూడేళ్ల క్రితం పరిచ యమయ్యాడు. మరో నిందితుడు కోకంటి బాబుజన్.. పదేళ్లుగా నందకుమార్‌కు స్నేహితుడు. గోవిందరెడ్డి కూడా నందకుమార్‌కు ఐదేళ్ల బట్టి స్నేహితుడని పోలీసులు వెల్లడించారు.

ఘటన జరిగిందిలా...

జులై 27/28, 2017 ఉదయం 01.45 గంటలకు విక్రమ్‌గౌడ్.. నందా, షేక్ అహ్మద్, రయీస్‌ఖాన్‌లను తన కారులో తీసుకువచ్చాడు. ఆ సమయంలో పారిపోవాల్సిన రూట్‌లు, హకీంపేట చెరువులో వెపన్ విసిరేయమని తెలిపాడు. 02.30 గంటలకు విక్రమ్‌గౌడ్, నందా, షేక్ అహ్మద్, రయీస్‌ఖాన్‌లతో ఇంటి సమీపానికి చేరుకు న్నాడు. ఆ ముగ్గురిని ఇంటికి సమీపంలో దించివేశాడు. అనం తరం ఇంట్లోకి వెళ్లి కారును పార్క్ చేశాడు. ఇంట్లోకి వెళుతున్న సమయం లోనే గేట్ తెరిచే వుంచాలని తెలిపాడు. 10-15 నిమిషాలకు ఆ ముగ్గురిని ఇంట్లోకి రమ్మ న్నాడు. వచ్చిన ఆ ముగ్గురిని కూర్చోమని చెప్పి తాను పైకి వెళ్లిన విక్రమ్ గౌడ్ ఐదు రౌండ్లతో కూడిన తుపాకీని తీసుకువచ్చి రయీస్‌ఖాన్‌కు అందజేశాడు. తనపై మూడు రౌండ్లు కాల్చమని ఆదేశిం చా డు. మూడు తన లక్కీ నెంబర్ అని కూడా తెలిపాడు. ఒకటో రౌండ్ కుడి భుజం, రెండో రౌండ్ ఎడమ భుజం, మూడవ రౌండ్ రైట్‌సైడ్ స్టమక్ టచ్ అవ్వాలని సూచించాడు. రయీస్ ఖాన్ తుపాకీ అందుకున్న వెంటనే విక్రమ్ గౌడ్ షేక్ అహ్మద్ బయట పల్సర్ బైక్ ఇంజన్ ఆన్ చేసి సిద్ధంగా ఉండాలన్నాడు.

విక్రమ్ గౌడ్ నందాకు రూ.4 లక్షలు అందజేయడంతో నందా అక్కడ్నించీ నడుచుకుంటూ వెళ్లి పోయాడు. ఆ సమయంలో షేక్ అహ్మద్, రయీస్‌ఖాన్‌లు బయట వేచి ఉన్నారు. నందా వెళ్లిన వెంటనే డోర్ ఓపెన్ చేసిన రయీస్ ఖాన్‌ను పిలిచాడు. తాను సోఫా వద్ద నుల్చొన్నాడు. ఆ సమ యంలో విక్రమ్ గౌడ్‌పై రయీస్‌ఖాన్ కుడిచేతిపై కాల్పులు జరిపాడు. ఎడమచేతిపై రెండో రౌండ్ కాల్పులు జరిపాడు. మొదటి రౌండ్ కాల్పులో బుల్లెట్ కిందపడగా.. రెండో రౌండ్ కాల్పుల్లో బుల్లెట్ శరీరంలోకి దూసుకెళ్లింది. విక్రమ్ గౌడ్ కుప్పకూలిపోయాడు. ఇదే క్రమంలో మూడో రౌండ్ కాల్చబోతున్న రయీస్‌ఖాన్‌ను పారిపోవాల్సిందిగా సూచించాడు. బయట వేచి వున్న షేక్ అహ్మద్ పల్సర్ బైక్‌పై రయీస్ ఖాన్ ఎక్కి పారిపోయారు. పోతూ పోతూ విక్రమ్ గౌడ్ సూచించిన మాదిరిగా వెపన్‌ను హకీంపేట చెరువులో గిరా టేశారు. జులై8 నుంచి వెపన్ విక్రమ్‌గౌడ్ వద్దనే ఉంది. విక్రమ్‌గౌడ్ స్కెచ్, అమలు పరిచిన తీరు మహేష్ నటించిన అతడు సినిమా స్ఫురణకు తేక మానదు.

స్థానిక సంస్థలకు ఇన్సెంటివ్ ఫండ్

● రూ.1.36 కోట్లు విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో జాతీయ ఉత్తమ అవార్డులు పొందిన స్థానిక సంస్థలకు ఇన్సెంటివ్ ఫండ్ రూ. 1.36కోట్లు కేంద్రప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. ఈ అవార్డులను దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ స్వశక్తికరణ్ పురస్కార్ కింద స్థానికసంస్థలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. దీనికి సంబంధించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో జమ చేయనున్నట్లు కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ పేర్కొన్నది. ఈ నిధులను అయా స్థానిక సంస్థల ఖాతాలో జమ చేయాలని రాష్ట్రప్రభుత్వానికి కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

నిధుల వివరాలు

1. కరీంనగర్ జిల్లా పరిషత్	రూ.50లక్షలు
2. ఘన్‌పూర్ మండల పరిషత్	రూ.25లక్షలు
3. తాడ్వాయి మండల పరిషత్	రూ.25లక్షలు
4. వైల్‌పూర్ గ్రామపంచాయతీ	రూ.12లక్షలు
5. కస్‌బేకట్కూర్ గ్రామ పంచాయతీ	రూ.8లక్షలు
6. నిజాల్‌పూర్ గ్రామపంచాయతీ	రూ.8లక్షలు
7. గోపాల్‌రావ్‌పల్లి గ్రామపంచాయతీ	రూ.8లక్షలు
మొత్తం	**రూ. 1.36కోట్లు**

పీఆర్ సీఈలకు విధులు కేటాయింపు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజనీరింగు విభాగంలో పనిచేస్తున్న ఈఎన్‌సీతో పాటు చీఫ్ ఇంజనీర్లకు విధులను రాష్ట్రప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి వికాష్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల్లో అయా ఇంజనీర్లకు సబ్జెక్టలను కేటాయించినట్లు పేర్కొన్నారు. .

సబ్జెక్టల కేటాయింపు వివరాలు

1. ఈఎన్‌సీ: పరిపాలన, రాష్ట్రప్రణాళిక (క్యాపిటల్ హెడ్ గ్రాంట్లు ఎస్‌డీఎఫ్, ఎంపీల్యాడ్స్, డిపాజిట్ వర్క్స్), ఎవరికీ కేటాయించని సబ్జెక్టులు

2. చీఫ్ ఇంజనీర్ (పీఎంజీఎస్‌వై): పీఎంజీఎస్‌వై, డిజైన్లు, ఈ డిజైన్లను ఆమోదింపజేసే బాధ్యత

3. చీఫ్ ఇంజనీర్, పీఆర్: నాబార్డు, రాష్ట్రప్రణాళికేతర గ్రాంట్లు (ఎంఆర్‌ఆర్, ఆర్ఐడీఎఫ్, 13వ ఆర్థిక సంఘం, ఎంటీఎస్ ఎస్‌బీ, రెవెన్యూ గ్రాంట్లు), హరితహారం

4. చీఫ్ ఇంజనీర్, పీఆర్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్, పీఎంజీఎస్‌వై ఎస్‌క్యూసీ

దూలపల్లిలో సుగంధద్రవ్యాల యూనిట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాకతీయ ఫుడ్స్ పేరుతో నాణ్యత ప్రమాణాలతో కూడిన పసుపు, కారం, దనియాలపొడి, అల్లం వెల్లుల్లి మిశ్రమాన్ని వినయోగదారులకు అందుబాటులోకి తేవాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి సంస్థ నిర్ణయించింది. ఈ మిశ్రమాలను తయారు చేయడానికి కుద్బుల్లాపూర్ మండలం దూలపల్లి గ్రామంలోని 15.56 ఎకరాల స్థలంలో సుగంద ద్రవ్యాల ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కేంద్రీయ ఆహార సాంకేతిక, పరిశోదన సంస్థ మైసూరు వారి సహకారంతో ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మార్కెట్‌లో సరియైన నాణ్యత ప్రమాణాలతో కూడిన ఉత్పత్తులను అందుబాటులో ఉంచడం కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా దూలపల్లిలో ఉద్యాన, సుగంధ ద్రవ్యాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కాబోతుందని ఒక ప్రకటనలో తెలియచేశారు. కాకతీయ ఫుడ్స్ పేరుతో మార్కెట్‌లోకి వస్తున్న నిత్యావసరాలు పూర్తిగా నాణ్యమైనవని ప్రభుత్వం తెలిపింది. కల్తీని అరికట్టడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది.

రానా పార్శిల్‌పై నిఘా

(మొదటిపేజీ తరువాయి)

కొందరు అధికారులు స్టూడియోకు చేరుకున్నారు. ఆ పార్సిల్‌ను పరిశీలించాక అందులో డ్రగ్స్ లేవని తేల్చారు. వెన్ను నొప్పికి వాడే పరి కరాన్ని రానా ఈ పార్సిల్‌లో తెప్పించుకున్నాడని ఆ తర్వాత అతడి తండ్రి, నిర్మాత డి.సురేష్‌బాబు తెలిపారు. ఎక్సైజ్ పోలీసులు తన స్టూడి యోకు వచ్చారని, ఈ పార్సిల్‌ని పరిశీలించి ఇందులో డ్రగ్స్ లేవని నిర్ధా రించుకున్నారని ఆయన చెప్పారు. కాగా.. తన వెన్ను నొప్పికి ఆన్‌లైన్ ద్వారా రానా ఈ పార్సిల్‌ను తెప్పించుకున్నాడని తెలిసింది. అటు విదేశాల నుంచి వచ్చే పార్సిల్స్‌ను స్కాన్ చేసేందుకు పూను కోవాలని మూడు కొరియర్ కంపెనీలకు ఎక్సైజ్ శాఖ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది.

పూరీ జగన్నాథ్ మచ్చ లేకుండా బయటికొస్తారు: దర్శకుడు కృష్ణవంశీ

డ్రగ్స్ వ్యవహారంలో సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ దర్శకుడు పూరీ జగన్నాథ్‌పై ఆరోపణలు తలెత్తడం, నోటీసులు అందుకోవడం.. ఆపై సిట్ అధికారులు విచారణ చేపట్టడం తెలిసిందే. ఈ నేపథ్యంలో మరో ప్రముఖ దర్శకుడు కృష్ణవంశీ స్పందిస్తూ పూరీ జగన్నాథ్ వ్యక్తిత్వమేమిటో తనకు బాగా తెలుసని, దిగజారే మనిషి కాదని అన్నారు. ఈ వ్యవహారం నుంచి పూరీ ఎంటువంటి మచ్చ లేకుండా బయటకు వస్తారని కృష్ణవంశీ విశ్వాసం వ్యక్తం చేశారు. సామాజిక అంశాలతో కూడిన.. సమాజాన్ని మేల్కొలిపే ఎన్నో గొప్ప చిత్రాలను ఆయన తీశాడని కృష్ణవంశీ అన్నారు.

ఆ పది రోజులు చీకటి రోజులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: డ్రగ్స్ వ్యవహారంలో తెలుగు చిత్రపరిశ్రమకు చెందిన వారికి ఇటీవల నోటీసులు వెళ్లడం, సిట్ అధికారులు వారిని విచారించి పంపించడం తెలిసిందే. 12 రోజుల పాటు వారిని విచారించారు. ఈ నేపథ్యంలో సినీ పరిశ్రమకు చెందిన వారిపై విమర్శలు గుప్పిస్తూ మీడియా, సామాజిక మాధ్యమాలు విరుచు కుపడటం విదితమే. ఈ క్రమంలో సీఎం కేసీఆర్‌కు తెలుగు చిత్ర పరిశ్రమ తాజాగా ఓ లేఖ రాసింది. ఈ సమస్యను సున్నితంగా పరిష్కరించా లని కోరింది. డ్రగ్స్ వ్యవహారాన్ని వెలుగులోకి తెచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపింది. సినీ పరిశ్రమ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని హుందాగా దర్యాప్తు కొనసాగించాలని కోరుకుంటున్నామని, తమ వంతు సహకారం అందిస్తామని ఆ లేఖలో పేర్కొంది. డ్రగ్స్ సేవించేవారు మాకు ఎప్పటికీ హీరోలు కారు కొందరు చేసిన పొరపాట్లకు చిత్ర పరిశ్రమ తలదించుకునే పరిస్థితి రావడం బాధాకరం. వారిపై మేము క్రమశిక్షణా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వానికి, పోలీసులకు పూర్తిగా సహకరిస్తాం, ప్రతి ఒక్కరూ సినిమా వాళ్ల మీద తీవ్రంగా స్పందించడం బాధించింది. సమాజం నుంచి మీడియా నుంచి సానుభూతి కావాలని కోరుకుంటున్నాం. సినీ పరిశ్రమకు ఈ పదిరోజులు చీకటి రోజులు అని ఆ లేఖలో చిత్రపరిశ్రమ పేర్కొంది.

విద్యార్థులకు కుచ్చుటోపి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్‌లోని విద్యార్థులను ఓ సంస్థ చేసిన ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. దీంతో దేశం కాని దేశంలో నిండా పరిపక్వత రాని వయసు విద్యార్థులు బందీలుగా మారారు. ఆడియన్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో హోటల్ మేనేజ్‌మెంట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, మాల్దీవుల్లో మంచి ఉద్యోగాలు వచ్చాయని చెబుతూ 17 మంది విద్యార్థుల నుంచి 11కోట్ల రూపాయలు వసూలు చేశారు. అనంతరం గత నెలలో విద్యార్థుల చేతుల్లో వీసా, అపాయిం ట్‌మెంట్ ఆర్డర్ చేతిలో పెట్టారు.

మాల్దీవులకు విద్యార్థులను తీసుకెళ్లిన యాజమాన్యం వారిని ఒకహోటల్‌లో ఉంచి పత్తా లేకుండా పోయింది. దీంతో విదేశాల్లో ఉద్యోగాలు వచ్చాయని ఎన్నో ఆశలతో వెళ్లిన 17 మంది విద్యార్థులు హోటల్ రూం అద్దె చెల్లించలేదని దాని యజమాని వారి పాస్‌పోర్టులు లాక్కుని వారందర్నీ ఒకగదిలో వేసి బంధించింది. దీంతో వారు తమను రక్షించాలని కోరుకుంటున్నారు.

బంటి సూసైడ్ కేసులో మరో మలుపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వనస్థలిపురంలో హైకింగ్ బార్ ఓనర్ బంటి అలియాస్ మహేందర్ పాల్ సింగ్ సూసైడ్ కేసులో కొత్త ట్విస్ట్ బయటపడింది. మంగళవారం ఆర్థిక ఇబ్బందుల వల్లే అతడు చనిపోయినట్లు కేసు నమోదు చేసినా.. బుధవారం అతని మొబైల్‌లో సూసైడ్ వీడియో బయటపడింది. స్థానిక టీఆర్ఎస్ నేత అనుచరులు తనను కొట్టారని, కొన్నాళ్లుగా తీవ్రంగా వేధిస్తున్నారని ఆ వీడియోలో చెప్పాడు బంటి. నవీన్, అశోక్, స్వామి తన చావుకు కారణ హంటూ చెప్పి ఉరి వేసుకున్నాడు.

ఈ సూసైడ్ వీడియో తీశాక మరో వీడియో రికార్డు చేశాడు. సెల్‌ఫోన్ కెమెరా ఆన్ చేసి.. తన సూసైడ్ రికార్డయ్యేలా చూసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తను ఆర్థికంగా ఇబ్బందులు పడడానికి, చావు తప్ప మరో మారగ్ం లేదని డిసైడ్ అవ్వడానికి స్థానిక టీఆర్ఎస్ నేత అనుచరులే కారణమని అతడు చెప్పడంతో కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.



మాదకద్రవ్యాల వినియోగంపై

జాగ్రత్త అవసరం

● డ్రగ్స్‌పై అవగాహన సదస్సులో విద్యావేత్తలు ● విద్యార్థులకు హాజరు తప్పనిసరి చేయాలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మాదక ద్రవ్యాల వినియోగానికి సంబంధించి కాలేజీ యాజమాన్యాలు ముందు జాగ్రత్తగా వ్యవహరించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్ ఎం.భగవత్ సూచించారు. డ్రగ్స్ వినియోగంతో ఏర్పడే విష పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆయన కోరా రు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిరోధించడంపై ప్రభుత్వ డిగ్రీ కాలేజీల బోధనా సిబ్బందికి బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అడ్మిన్‌స్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కీ), రాష్ట్ర ప్రభుత్వ రాష్ట్రీయ ఉచితార్ శిక్షా అభియాన్ సంయుక్తంగా ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్య క్రమంలో వివిధ కళాశాలలకు చెందిన 50 మంది లెక్చరర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భగవత్ మాట్లాడుతూ, విద్యార్థులకు హాజరును విధిగా అమలు చేయాలని, దీనిపై టీచింగ్ స్టాఫ్ దృష్టిసారించాలన్నారు.

విద్యాసంస్థల పరిసరాల్లో డ్రగ్స్ విక్రయిం చే వారిని గుర్తించాలని, హాస్టల్స్‌లో విద్యార్థు లను తనిఖీ చేస్తుండాలని ఆయన సూచించారు. విద్యార్థులు కాలేజీ నుంచి మధ్యలో మానేసే వారిపై సరైన కారణాలు తెలుసుకోవాలని ఆయన సూచించారు. అలాగే పాఠశాలల్లో కూడా బోధనా సిబ్బంది, హాస్టల్ వార్డెన్లు విద్యార్థులు పాఠశాల మానేయడాన్ని కూడా గమనించాలని ఆయన చెప్పారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ పాపిరెడ్డి మాట్లాడు తూ, టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి మాదక ద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించాలన్నారు. డ్రగ్స్ వినియోగాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు కాలేజీల్లో ప్రచారం చేస్తామని ఆయన చెప్పారు. కాలేజీ విద్యా కమిషనర్ ఎ.వాణీప్రసాద్ మాట్లాడుతూ, విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, డ్రగ్ వినియోగంతో వచ్చే అనర్థాలను యువ తరానికి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.యువతను సన్మార్గంలో నడిపించేందుకు కళాశాలలే మంచి వేదికలుగా ఉంటాయని ఆమె అన్నారు.

కళాశాలల్లో హాజరును తప్పనిసరి చేయా లని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సే న్ సూచించారు. విద్యారంగం ఉన్నత ప్రమాణాలతో పటిష్టపడితే కాలేజీల్లో ఎలాంటి రుగ్మతలకు చోటు లేదన్నారు. విద్యార్థులు క్రమశిక్షణా నిబంధనలు ఉల్లంఘించకుండా ప్రవర్తనా నియమావళి కాలేజీ యాజమాన్యాలు అమలు చేయాలని ఆయన చెప్పారు.

పెళ్ళిళ్లకు జీఎస్టీ సెగ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పవిత్ర శ్రావణ మాసం కళ తప్పుతోంది. అత్యంత పవిత్ర మాసంగా పేరున్న ఈ నెల వస్తూ వస్తూనే తనతో జీఎస్టీని మోసుకు రావడంతో పెళ్లిళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ ఏడాది శ్రావణం ప్రజలపైకి లక్షల కోట్ల జీఎస్టీ పన్ను భారాన్ని మోసుకోస్తోంది. దీంతో హిందువులు అత్యంత శుభ ముహూర్తంగా భావించే శ్రావణ మాసం ఈ ఏడాది పన్ను భారంతో కీడును శంకిస్తోంది. ఇదంతా ప్రధానంగా పెళ్లిళ్లకు శుభగడియలుగా భావించే శ్రావణ మాసంపై జీఎస్టీ(వస్తు సేవల పన్ను)పెను ప్రభావంతోనేని చెప్పుకోవచ్చు. తద్వారా పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు మరింత కాస్ట్‌లీ కానున్నాయన్న అనుమానాలు కూడా అదేస్థాయిలో పెరిగాయి. పెరిగిన ఖర్చులతో ఆశాఢ మాసం తర్వాత వచ్చే శ్రావణం కోసం ఎదురుచూసిన వారికి జీఎస్టీ తీవ్ర నిరాశను మిగిల్చింది. శ్రావణమాసంలో శుభ కార్యాలు చేసుకుందామని వేచిచూసిన వారందరికీ జీఎస్టీతో ఖర్చులు భారీగా పెరిగే ఛాన్స్ కనిపిస్తోంది. ప్రధానంగా పెళ్లిళ్లకు కొనుగోలు చేసే అన్ని రకాల వస్తువులు 10నుంచి 20 శాతం భారం కానున్నాయి. ఈ కార్యాలకు తప్పనిసరైన వస్త్రాలు, ఆభరణాలు, చెప్పులు, గృహోపకరణాలు, కాస్మొటిక్స్, ఇతర వినియోగ వస్తువులపై పన్ను భారం తప్పనసరి. అలంకరణ, ఫోటోలు, వీడియోగ్రఫీ అన్నీ పెరిగి మధ్య తరగతి ప్రజల నడ్డివిరచనుంది. పెళ్లిళ్లకు అందించే సేవలన్నీ వర్క్ కాంట్రాక్టు పరిధిలోకి చేరడంతో ఏ ఒక్కటీ ఇంతకుముందులా లేని పరిస్థితి నెలకొంది. ఒక్కో సేవపై పన్ను పరిధి 15నుంచి 18 శాతానికి, బంగారంపై 1.8 శాతంనుంచి 3 శాతానికి, క్యాటరింగ్, డెకరేషన్, లైటింగ్, కొరియర్, ఆతిథ్యం వంటి సేవలపై పన్ను 15నుంచి 18శాతానికి పెంచారు. వస్త్రాలపై దేశంలో తొలిసారిగా పన్ను విధించడం సామాన్యుల పాలిట శాపంగా మారింది. సామాన్యులు 18నుంచి 28శాతం పన్నును భరించడం కష్టంగా మారింది.

ఐటీ నిఘాతో అయోమయం

మరోవైపు పులిమీద పుట్రలా ఐటీ శాఖ నిఘా పెళ్ళిళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఐటీశాఖ నిఘా పెరగడం, ఖర్చులపై ఆరా తీయడం, నగదు వినియోగం, పెద్ద నోట్ల రద్దు తర్వాత రూ. 2లక్షలు మించిన నగదు లావాదేవీలపై లెక్కలు అడగటం వంటివి ప్రతికూలంగా మారాయి. రూ. 2లక్షలు దాటితే చెక్కులు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారానే జరపాలన్న నిబంధన కొత్త కష్టాలు తెచ్చి పెడుతోంది.

ముందు టికెట్ కొనండి.. తర్వాత డబ్బు చెల్లించండి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ముందస్తు నగదు చెల్లించకుండా రైల్ టికెట్ బుక్ చేసుకొనే సరికొత్త సదుపాయం అందరికీ అందుబాటులోకి వచ్చింది. రైల్ టికెట్ కొనండి - తర్వాత డబ్బు చెల్లించండి అనే విధానంతో నగదు రహిత సేవలు అందిస్తుంది. అర్థశాస్త్ర ఫిన్‌టెక్ అనే సంస్థ ప్రయోగాత్మకంగా ఈ సదుపాయం ఐఆర్‌సిటిసి వెబ్‌సైట్ ద్వారా రైలు ప్రయాణికులకు అందిస్తుంది. టికెట్ బుక్ చేసుకున్న పక్షం రోజుల్లో డబ్బులు చెల్లించే విధంగా ఈ సంస్థ ఈ - టికెట్ ఆన్‌లైన్ విధానం రూపొందించింది. ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పోరేషన్ లిమిటెడ్ ఈ సరికొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ - పే లాటర్ పేరుతో ఉన్న వెబ్‌సైట్ ద్వారా టికెట్ కొనుగోలు చేసిన ప్రయాణికులు పదిహేను రోజుల వ్యవధిలో డబ్బులు చెల్లించే వెసులుబాటు కలిగించడం సరి కొత్త విధానంలో అందుబాటులోకి వస్తున్న సదుపాయంగా నిర్వాహకులు వెల్లడించారు. ఈ - పే లాటర్ ద్వారా టికెట్ బుక్ చేసుకున్న వారి నుండి సర్వీస్ ఛార్జిగా 3.50 శాతం వసూలు చేయడం జరుగుతుంది. ఐఆర్‌సిటిసీ వెబ్‌సైట్‌లో ఈ - పే లాటర్ గురించి కూడా పొందుపర్చబడింది. ఐఆర్‌సిటీసీ వెబ్‌సైట్‌లో ఉన్న ఈ పే లాటర్ ఆప్షన్ ద్వారా నగదు రహిత పద్ధతుల్లో పక్షం రోజుల తర్వాత టికెట్ ఛార్జీలు చెల్లించే విధంగా రైలు టికెట్లను కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుంది. కొంత కాలం పాటు పక్షం రోజుల్లో నగదు చెల్లించే అవకాశం ఉంటుంది.

సౌదీలో తెలంగాణ యువకుడి మృతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉపాధి కోసం సౌదీ అరేబియా వెళ్లిన తెలంగాణలోని యాదాద్రి భువనగిరికి జిల్లా రామనపేటకు చెందిన షేక్ అజాం రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. ఆజాం 18 నెలల క్రితం సౌదీలోని ఓ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. డ్యూటీ అయ్యాక సోమవారం రాత్రి కారులో ఇంటికి వెళ్తుండగా వెనుకనుండి వచ్చి ట్రక్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయాలు కావడంతో ఆజాంను దగ్గర్లోని ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయాడు ఆజాం. ఉపాధి కోసం సౌదీ వెళ్లిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో చనిపోయాడని తెలియడంతో.. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవు తున్నారు. ఆజాం మృతదేహాన్ని త్వరగా తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతు న్నారు బంధువులు.. నిరుపేద కుటుం బానికిచెందిన షేక్ ఆజాం ఉపాధి కోసం వెళ్లి మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు ఆయనపై పెట్టుకున్న ఆశలు అడియాసల య్యాయని స్థానికులు పేర్కొన్నారు. ఆజాం తండ్రి షేక్ వలీ వ్యవసయ పనిముట్లు చేస్తూ జీవనం గడుపుతుంటారు. కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటాడని అనుకున్న ఆజాంమరణ వార్త తెలుసుకుని గ్రామస్తులు సైతం కన్నీటి పర్యంతమవుతున్నారు.

హార్టికల్చర్ వర్సిటీలో ఉద్రిక్తత

● పోలీసులు, తేదేపా శ్రేణుల మధ్య తోపులాట ● కేసీఆర్‌పై నిప్పులు చెరిగిన టీడీపీ నేత



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆందోళన చేస్తున్న రాజేంద్రనగర్ హార్టికల్చర్ విద్యార్థులను పరామర్శించడానికి వెళ్ళిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, తెదేపా శ్రేణుల మధ్య కొద్ది సేపు తీవ్ర వాగ్వివాదం, తోపులాట చోటుచేసుకుంది. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. పోలీసుల చర్యలపై తెదేపా నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. దీంతో రేవంత్‌రెడ్డిని బలవతంగా అరెస్టు చేసి శంషాబాద్ గ్రామీణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రేవంత్‌కు స్వల్పగాయాలయ్యాయి. అనంతరం పోలీసు స్టేషన్ ఆవరణలో రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, రాక్షసబలంతో ప్రజలను అణిచివేయాలనుకున్న నిజాం నవాబులు, రజాకారులు, ఆంధ్రపాలకులే తెలంగాణ సమాజం ముందు నిలబడలేకపోయారని అన్నారు. వారితో పోలీస్తే సిఎం కేసీఆర్‌ఎంత అని ప్రశ్నించారు. నిజాం నవాబుకు ఏ గతి పట్టిందో చివరకు కేసీఆర్ కూడా అదే గతి పడుతుందని ఆయన హెచ్చరించారు.


రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని విమర్శించారు. న్యాయం కోసం ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న హార్టికల్చర్ విద్యార్థులను అణిచివేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూడడం అత్యంత దుర్మార్గమని ఆయన విమర్శించారు. గడిచిన మూడేళ్ళకాలంలో ఇప్పటి వరకు హార్టికల్చర్ ఆఫీసర్లు, హార్టికల్చర్ విస్తారణాధికారుల నియమాకాలను చేపట్టడం జరగలేదని విమర్శించారు. వాస్తవానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న578 మండలలాలో హెచ్‌వోలు, హెచ్ఇవోలు నియామకాలను చేపడితే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు వేలమందికి పైగా హార్టికల్చర్ విద్యార్థులందరికి ఉద్యోగాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ న్యాయమైన డిమాండ్‌తో ఆందోళన చేస్తున్న విద్యార్దులను కూడా అణిచివేయాలని చూడడం అన్యాయమని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఒక ఎమ్మెల్యేగా తాను వెళ్ళి సమస్యలు తెలుసుకోవాలనుకుంటున్న దానికి రాష్ట్ర ప్రభుత్వం ఆటంకం సృష్టిం చడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. అసలు ప్రభుత్వం ఎందుకు భయపడుతుంతో తనకు అర్ధంకావడం లేదన్నారు. తనమీదనే పోలీసులతో దాడి చేయించే గాయపరిచారని అన్నారు. తనకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఇలాంటి అణిచివేతలను వందల సంవత్సరాలుగా తెలంగాణ సమాజం చూస్తోందన్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్‌ను ఎదుర్కోవడం పెద్దలెక్క కాదన్నారు. వ్యవసాయశాఖ మంత్రిగా రాష్ట్రానికి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కొనసాగుతుండడం తెలంగాణకు గ్రహచారంగా మారిందని ఆయన ఎద్దేవా చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆందోళన చేస్తున్న హార్టికల్చర్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షం లో విద్యార్థులతో కలిసి ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సామరంగారెడ్డి, బిఎన్‌రెడ్డి, తాజుద్దీన్, సతీష్‌మాదిగ, మన్నె సతీష్, చిలుక మదుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Andhraprabha business 2017

బిజినెస్



సెన్సెక్స్	నిఫ్టీ	క్రూడ్
పాయింట్లు	పాయింట్లు	రూ.
32,476.74	10,081.50	3,148.00
98.43	33.15	13.00
0.30%(-)	0.33%(-)	0.41%(+)





వడ్డీ రేట్లు తగ్గాయ్!

• 0.25 శాతం కోత • ఆరున్నర ఏళ్ల కనిష్ఠానికి • తగ్గనున్న గృహ, కార్ల వడ్డీ రేట్లు

ముంబై : ఊహించినట్లే రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బుధవారం నాడు 0.25 శాతం వడ్డీరేట్లు (రెపోరేటు)ను కుదించింది. వడ్డీరేటను 6.25 శాతం నుంచి 6 శాతానికి సవరించింది. దీంతో వడ్డీరేట్లు ఆరున్నరేళ్ల కనిష్ఠానికి దిగివచ్చాయి. అయితే మార్కెట్ వర్గాలు మాత్రం 0.50 శాతం వరకు తగ్గిస్తాయని ఆశించాయి. కానీ ఆర్‌బీఐ మాత్రం 0.25 శాతం కోతతో సరిపెట్టింది. ఇక అందరి దృష్టి బ్యాంకులపై ఉంటుంది. ఎందుకంటే ఆర్‌బీఐ తగ్గించిన వడ్డీరేట్లు బ్యాంకులు ఖాతాదారుడికి బదలీ చేస్తాయా లేదా అనేది చూడాల్సి ఉంటుంది.

ఆర్‌బీఐ మానటరీ పాలసీ కమిటి (ఎంపీసీ) మధ్య కాలికానికి రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ)4 శాతం బ్యాండ్‌కు ప్లస్ రెండు లేదా మైనస్‌గా రెండు శాతంగా ఖరారు చేస్తూ.. దీంతో పాటు వృద్ధిరేటుపై ప్రభావం పడకుండా వడ్డీరేట్లలో కోత విధించాలని నిర్ణయించింది.

బుధవారం నాడు జరిగిన ఆర్‌బీఐ మూడవ ద్వైమాసిక ద్రవ్యపరపతి సమీక్షలో ఈ ఆర్థిక సంవత్సరం మొదటి అర్థభాగంలో రిటైల్ ద్రవ్యోల్బణం సరాసరి 2.0 నుంచి 3.5 శాతం గాను రెండవ అర్థభాగంలో 3.5 శాతం నుంచి 4.5 శాతం ఉండొచ్చనే అభిప్రాయానికి వచ్చింది.


ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం ముగిసింది. అయితే భవిష్యత్తులో ద్రవ్యోల్బణం పెరిగే అవకాశాలు కొట్టిపారేయలేమని ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ చెప్పారు. దీనికి ఆయన చెబుతున్న కారణాలు ఇలా ఉన్నాయి. (1) ప్రభుత్వం 7వ వేతన కమిషన్‌లో ఇంటి అద్దె అలవెన్స్ (హెచ్‌ఆర్‌ఏ) అమల్లోకి తేవడం (2) జీఎస్టి అమల్లోకి తేనున్న నేపథ్యంలో కొన్ని వస్తువుల ధరలు పెంచకుండా నిలిపి ఉంచడం (3) అనుకోకుండా కొన్ని పరిణామాల వల్ల కూడా తిరిగి ద్రవ్యోల్బణం పెరిగే అవకాశాలున్నాయని ఉర్జిల్ పటేల్ అభిప్రాయపడ్డారు.

చివరగా ఆర్‌బీఐ వడ్డీరేట్లను అక్టోబర్ 2016లో కుదించింది. వడ్డీరేట్ల కోతపై గవర్నర్ ఉర్జిత్ పటేల్ మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటు అంచనాను 7.3 శాతంగా అంచనా వేశామన్నారు. ఆర్‌బీఐ వడ్డీరేట్లు 0.25 శాతం తగ్గించడం భారత్ కార్పొరేట్లకు రుచించలేదు. కనీసం 0.50 శాతం కోత విధిస్తారని భావించాయి. ఒక విధంగా చెప్పాలంటే భారత కార్పొరేట్లతో పాటు ప్రభుత్వం కూడా ఆర్‌బీఐపై ఒత్తిడి తెచ్చి వడ్డీరేట్లు తగ్గించుకున్నాయని చెప్పవచ్చు.

పరపతి సమీక్షలో ఆర్‌బీఐ ద్రవ్యోల్బణం పెరగడానికి దారి తీసే అంశాల గురించి ప్రధానంగా చర్చించింది. వాటిలో ప్రధానంగా కొన్ని రాష్ట్రాలు వ్యవసాయ రుణాలు ఇష్టం వచ్చినట్లు రద్దు చేస్తూపోయాయని దీంతో ఆర్థిక క్రమశిక్షణ కట్టుతప్పుతుందని, ప్రభుత్వం ప్రాజెక్టులపై పెద్దెత్తున వ్యయం చేయలేదని,, దీంతో మరోసారి ద్రవ్యోల్బణం కోరలు చాచే అవకాశాలున్నాయని అభిప్రాయపడుతోంది. దీంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలతో పాటు భత్యాలు ఇవ్వడం కూడా ద్రవ్యోల్బణం పెరగడానికి దారి తీస్తుందని చెబుతోంది. ఇక వేళ కేంద్రప్రభుత్వంతో పోటీ పడి రాష్ట్రప్రభుత్వాలుకూడా వేతనాలతో పాటు భత్యాలు పెంచుకుంటూపోతే వచ్చే 18-24 నెలల కాలంలో రిటైల్ ద్రవ్యోల్బణం 100 బేసిస్ పాయింట్లు లేదా ఒక శాతం పెరుగుతుందని మింట్‌రోడ్ అంచనా వేస్తోంది.

ఎంపీసీ సమీక్ష ముఖ్యాంశాలు

- కీలక వడ్డీరేట్లను 0.25 శాతం కోత విధించి 6 శాతానికి సవరించింది.
- రివర్స్‌రేపోరేటు 0.25 తగ్గించి 5.75 శాతానికి.
- రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతం దాటకుండా చర్యలు
- ద్రవ్యోల్బణం తిరిగి పుంజుకునే అవకాశాన్ని కొట్టిపారేయలేం, తగ్గించడానికి చర్యలు.
- ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 7.3 శాతం
- ప్రైవేట్ పెట్టుబడులకు ఊతం, ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల అడ్డంకులు తొలగింపు
- విదేశీ మారకద్రవ్యం నిల్వలు జులై 28, 2017 నాటికి 392.9 బిలియన్ డాలర్లు
- నలుగురు సభ్యులు గల మానిటరీ పాలసీ కమిటి 0.25 శాతం వడ్డీరేటు తగ్గించాలని ముక్తకంఠంతో నిర్ణయం
- రాష్ట్రప్రభుత్వాలు ఒకదానితో ఒకటి పోటీ పడి వ్యవసాయరుణాలు మాఫీ చేయడంతో ఆర్థిక క్రమశిక్షణ కట్టుతప్పుతుంది. ప్రభుత్వం మూలధనం వ్యయంలో కోత విధిస్తుందన్న ఆందోళన
- ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకుల్లో ఎన్‌పీఏలు తగ్గించడానికి చర్యలు, మూలధనం సమకూర్చడం.
- బ్యాంకులు, కార్పొరేషన్స్ బ్యాలెన్స్ షీట్లలో పెద్ద మొత్తంలో ఎన్‌పీఏల వల్ల కొత్త పెట్టుబడులు రావు.



దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. గత కొన్ని నెలల నుంచి మాంసాహారం ధరలు భారీగా పెరిగిపోయాయని పేర్కొంది. అయితే దీనికి విరుగుడుగా రుతుపవనాలు అనుకూలంగా నమోదు కావడంతో సరఫరా చెయిన్ చక్కగా పనిచేస్తే ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచవచ్చునని కూడా తెలిపింది.

ఇక తయారీరంగం విషయానికి వస్తే రెండవ త్రైమాసికం నుంచి కార్యకలాపాలు పుంజుకోవచ్చునని అంచనా వేసింది. అయితే బ్యాంకులు, కార్పొరేషన్స్‌లో బ్యాలెన్స్ షీట్లలో మొండిబకాయిలు విపరీతంగా పెరిగిపోవడం వల్ల కొత్తగా పెట్టుబడులు మందగించే అవకాశాలున్నాయి. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ రంగం నియంత్రణా సంస్థ ల పరిధిలోకి రావడంతో కొత్త ప్రాజెక్టులకు కొంత సమయం పడవచ్చు. దీంతో ఈ రంగంలో వృద్ధిరేటు మందగించవచ్చునని, దీంతో నిర్మాణరంగం, దాని విడిభాగాల తయారీ కంపెనీలపై ప్రభావం చూపుతుందని ఆర్‌బీఐ పేర్కొంది.

అనుకూల అంశాలు : ఈ ఏడాది ఖరీఫ్‌లో దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని, దీంతో గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పెరుగుతుందని ఆశిస్తోంది. ప్రభుత్వంకూడా బడ్జెట్‌లో గ్రామీణ ప్రాంతాల్లో గృహాలకు పెద్దమొత్తంలో కేటాయింపులు జరిపింది. బడ్జెట్‌లో రోడ్లు, బ్రిడ్జిలకు కేటాయింపులు ఎక్కువగానే చేసింది. అసంఘటిత రంగంలోని కొన్ని రంగాలను సంఘటితరంగంలోకి మార్చడం, పన్నులు తగ్గించడంతో, వ్యయం, సామర్థ్యం పెరిగి వృద్ధిరేటు పుంజుకుంటుందని అభిప్రాయపడింది.


స్వాగతించిన బ్యాంకర్లు: రుణాల డిమాండ్ పెరుగుతుంది



అరంధతి భట్టాచార్య : రిజర్వుబ్యాంకు రెపోరేటు 0.25శాతం తగ్గించడాన్ని ఎస్‌బీఐ చైర్మన్ స్వాగతించారు. తమ అంచనా ప్రకారం క్రమంగా రుణాల డిమాండ్ కు పెరుగుందన్నారు.



చందా కొచ్చార్ , ఐసీఐసీఐ బ్యాంకు ఎండీ : ఊహించినట్లే ఆర్‌బీఐ వడ్డీరేట్లను తగ్గించిందని, దీంతో గ్లోబల్ ఇన్వెస్టర్లలో విశ్వాసం పెరుగుతుందన్నారు.



రాజీవ్ రిషి : చైర్మన్ ఇండియన్ బ్యాంకు అసోసియేషన్ సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా : ద్రవ్యోల్బణం తగ్గింది కాబట్టి ఆర్‌బీఐ వడ్డీరేట్లను తగ్గించిదని.. గతంలో తగ్గించిన వడ్డీరేట్ల లబ్దిని బ్యాంకులు ఇప్పటికే తమ కస్టమర్లకు బదలీ చేశాయని ఆయన చెప్పారు. ప్రస్తుతం దీనిపై పరిశీలించాల్సి ఉందన్నారు. వడ్డీరేట్లు తగ్గడంతో రుణాల డిమాండ్ పెరుగుతుందని, చౌక గృహాలతో పాటు మౌలికరంగం ప్రాజెక్టుల్లో ప్రైవేట్ పెట్టుబడులు వచ్చే అవకాశాలున్నాయన్నారు.



రానాకపూర్, ఎస్ బ్యాంకు ఎండీ, సీఈవో: తొమ్మిది నెలల తర్వాత ఆర్‌బీఐ 0.25 శాతం వడ్డీరేట్లను తగ్గించడం ఆహ్వానించతగ్గ పరిణామని, తన అంచనా ప్రకారం రాబోయే నెలల్లో 50-75 శాతం వడ్డీరేట్లు తగ్గుతాయన్నారు. దీని వల్ల బ్యాలెన్స్‌షీట్ల ఇబ్బందులతో వృద్ధిరేటుకు ఊతం ఇచ్చినట్లవుతుందన్నారు.

గృహ, కార్ల రుణాలు చౌక: రిజర్వుబ్యాంకు వడ్డీరేట్లను 0.25శాతం కోత విధించి 6 శాతానికి సవరించడంతో ముఖ్యంగా బ్యాంకులు ఇచ్చే రుణాలపై వడ్డీరేట్లు తగ్గుతాయి. ప్రధానంగా చెప్పుకోవాలంటే గృహ, కార్ల రుణాలు తగ్గుతాయి. రాబోయే పండుగ సీజన్ కాబట్టి బ్యాంకులు తక్కువ వడ్డీరేట్లకు రుణాలు ఆఫర్ చేస్తాయని దీంతో నెలసరి కట్టే సులభ వాయిదా (ఈఎంఐ) కూడా తగ్గుతుంది. గృహరుణాలపై వడ్డీరేటు సరాసరి ఏడాదికి 8.2 శాతానికి దిగిరావచ్చునని, కొత్తగా రుణాలు తీసుకునే వారికి ఈఎంఐ కూడా తగ్గుతుంది.

అయితే గతంలో ఎంసీఎల్‌ఆర్ కింద రుణాలు తీసుకున్న వారు కొంత కాలం పాటు ఆగాల్సిందని బ్యాంకింగ్ నిపుణులు చెబుతున్నారు. బ్యాంకు కొత్త ఎంసీఎల్‌ఆర్ రేట్లను ప్రకటించే వరకు పాత వడ్డీరేట్లను చెల్లించాల్సిందేనని అంటున్నారు. సాధారణంగా ఎంసీఎల్‌ఆర్ ఆధారిత గృహ రుణాలు ఏడాదికి ఒకసారి సవరిస్తారని చెబుతున్నారు. అయితే గృహ రుణాలపై పెద్దెత్తున వడ్డీ భారం పడుతుందనుకుంటే కొత్త బ్యాంకునుంచి రుణం తీసుకొని పాత బ్యాంకు రుణాన్ని తిరిగిచ్చే వెసులుబాటు కూడా ఉంటుందని బ్యాంకింగ్ రంగానికి చెందిన నిపుణులు సూచిస్తున్నారు.



పీఎన్‌బీ లాభంలో 12% వృద్ధి

• అదే దారిలో ఎన్‌పీఏ కూడా..

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగానికి చెందిన పంజాబ్ నేషనల్ బ్యాంకు జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 12 శాతం వృద్ధితో రూ.343 కోట్లు ఆర్జించింది. దీంతో పాటు మొండిబకాయిలు కూడా బాగా పెరిగిపోయాయి. మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.262 కోట్లు నికరలాభాన్ని ఆర్జించింది. ఏడాది క్రితంతో పోల్చుకుంటే రూ.5367 కోట్ల నష్టం నుంచి గట్టెక్కింది. ఇక మొండిబకాయిల విషయానికి వస్తే మొదటి త్రైమాసికంలో 13.66 శాతానికి ఎగబాకగా.. మార్చి త్రైమాసికంలో 12.53 శాతంగా నమోదయ్యాయి. ఏడాది క్రితం ఎన్‌పీఏ 13.75 శాతంతో పోల్చుకుంటే స్వల్పంగా తగ్గింది. జూన్ 30, 2017 నాటికి చూస్తే ఎన్‌పీఏ పెరిగి రూ.57,721 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.55,370 కోట్లని తెలిపింది. బీఎస్‌ఈలో దీని షేరు 1.4 శాతం పెరిగి రూ.159.70 వద్ద ముగిసింది.

ఇమామి లాభంలో 88% ఫినిష్

కోల్‌కతా : ఇమామి లిమిటెడ్ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన నికరలాభం రూ.6 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.49 కోట్లు నమోదు చేసింది. టర్నోవర్ కూడా 16 శాతం క్షీణించి రూ.499 కోట్లకు దిగివచ్చింది. కంపెనీ విడుదల చేసిన ప్రకటనలో కొత్తగా అమల్లోకి వచ్చి వస్తు సేవల పన్ను వల్ల పెద్దెత్తున సరకు మిగిలిపోయిందని, దీంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో కూడా సరకు మిగిలిపోయిందని తెలిపింది. ఏకీకృతం ప్రాతిపదికన చూస్తే నికరలాభం 98 శాతం క్షీణించి రూ.1 కోటికి దిగిరాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.57 కోట్లని తెలిపింది. పెద్దనోట్ల రద్దు తర్వాత దేశీయంగా గ్రామీణ, హోల్‌సేల్ మార్కెట్లు క్రమంగా కోలుకుంటున్నాయని, జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత దాని ప్రభావం మళ్లీ తమపై పడిందని పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్ల విషయానికి వస్తే ప్రపంచంలోని కొన్ని దేశాల్లో నెలకొన్న రాజకీయ అనిశ్చితి కూడా తమ వ్యాపారాలపై కనిపించిందని ప్రకటనలో వివరించింది.


వొకార్ట్ నష్టం రూ.411 కోట్లు

న్యూఢిల్లీ : ప్రముఖ ఔషధ కంపెనీ వోకార్డ్ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత నష్టం రూ.409.66 కోట్లు నమోదు చేసింది. బ్రిటన్‌లో వాణిజ్య సెటిల్మెంట్ వ్యయమే కారణమని తెలిపింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ. 15.89 కోట్లు నికరలాభాన్ని నమోదు చేసినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. రెవెన్యూ విషయానికి వస్తే రూ.891.06 కోట్లు కాగా.. ఏడాది క్రితం రూ.1,090.83 కోట్లని తెలిపింది. కంపెనీ నష్టాలకు కారణం వివరిస్తూ.. ఈ ఏడాది ఏప్రిల్ - జూన్ త్రైమాసికంలో కంపెనీకి చెందిన రెండు అనుబంధ సంస్థలతో సరఫరా కాంట్రాక్టు సంబంధించి లండన్ కోర్టులో 43 మిలియన్ పౌండ్ల సెటిల్మెంట్ చేసుకోవాల్సి వచ్చిందని కంపెనీ ఒక ప్రకటనలో వివరించింది. కాగా హైకోర్టు సెటిల్మెంట్‌ను ఆమోదించింది. లిటిగేషన్ ఇక ముగిసిందని తెలిపింది. బీఎస్ఈలో దీని షేరు 3.14 శాతం క్షీణించి రూ.584.95 వద్ద ముగిసింది.

రుచించని కోత

• 98 పాయింట్లు సెన్సెక్స్ నష్టం • ప్రారంభంలో జోరు.. తర్వాత బేజారు

• అయినా సూచీలు రికార్డుస్థాయిల్లోనే



ముంబై : స్టాక్ మార్కెట్లు ట్రేడింగ్ మొదలైన తర్వాత బుధవారం నాడు రికార్డుస్థాయికి ఎగబాకాయి. ఎప్పుడైతే రిజర్వుబ్యాంకు వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు ప్రకటించిన వెంటనే మార్కెట్లు పైకి పోవాల్సింది కాస్తా కిందికి దిగివచ్చాయి. వడ్డీరేట్లలో కోత మార్కెట్లను ఆకట్టుకోలేదు. మొత్తానికి సెన్సెక్స్ 98.43 పాయింట్లు క్షీణించి 32,476.74 పాయింట్లకు, నిఫ్టీ 33.15 పాయింట్లు నష్టపోయి 10,081.50 వద్ద ముగిశాయి.

బీఎస్ఈలో నష్టపోయిన సూచిలు ఇలా ఉన్నాయి. అత్యధికంగా ఐటి సూచి 0.88 శాతం క్షీణించగా.. క్యాపిటల్‌గూడ్స్ 0.83 శాతం, ఎఫ్ఎంసీజీ 0.76 శాతం, టెక్ 0.75 శాతం వరకు నష్టపోయాయి. దీనికి వ్యతిరేకంగా కన్స్యూమర్ డ్యూరబుల్స్, 1.12 శాతం, విద్యుత్ సూచి 0.11 శాతం వరకు నష్టపోయాయి.

బీఎస్ఈలో అత్యధికంగా లాభపడిన ఐదు షేర్లు ఇలా ఉన్నాయి. ఎన్‌టీపీసీ 4.06 శాతం, హీరోమోటోకార్ప్ 21.12 శాతం, అదానీ పోర్ట్స్ 2.08 శాతం, లూపిన్ 1.6 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.59 శాతం కాగా దీనికి వ్యతిరేకంగా నష్టపోయిన షేర్లు ఇలా ఉన్నాయి. సన్‌ఫార్మా 1.95 శాతం, డాక్టర్ రెడ్డీస్ 1.93 శాతం, టాటామోటార్స్ 1.66 శాతం, కొటక్ బ్యాంకు 1.39 శాతం, టీసీఎస్ 1.3 శాతంగా ఉన్నాయి. బీఎస్ఈలో బ్యాంకింగ్ అన్నీ స్వల్పంగా నష్టపోయాయి.

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా షేరు 307.65 వద్ద ముగియగా.. 0.37 శాతం క్షీణించింది. ఐసీఐసీఐ బ్యాంకు 0.2 శాతం క్షీణించి రూ.301.60 వద్ద హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 0.04 శాతం నష్టపోయి రూ.1794.65 వద్ద ముగిసింది. మార్కెట్లు వాస్తవ విలువ కంటే కాస్తా ఎక్కువగా ఉండటంతో మదుపరులు మిడ్‌క్యాప్ షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే మిశ్రమ స్పందన కనిపించింది.



వచ్చేనెల జెట్‌ఎయిర్‌వేస్ జూన్ ఫలితాలు

న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త అకౌంటింగ్ స్టాండర్డ్స్ అమల్లోకి తెచ్చినందు వల్ల జూన్‌తో ముగిసిన త్రైమాసిక ఫలితాలు సెప్టెంబర్‌లో ప్రకటిస్తామని స్టాక్‌మార్కెట్లకు జెట్ ఎయిర్‌వేస్ సమాచారం అందించింది. జూన్ త్రైమాసిక ఫలితాల కోసం బోర్డు సమావేశం సెప్టెంబర్ 14 లేదా అంత కంటే ముందే ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్‌కు మారుతున్నందు వల్ల జూన్‌తో ముగిసిన త్రైమాసిక ఫలితాలు స్టాక్ ఎక్స్ఛేంజికి సెప్టెంబర్ 14, 2017న సమర్పిస్తామని తెలియజేసింది. సెబి నిబంధనల ప్రకారం లిస్టెడ్ కంపెనీ త్రైమాసిక ఫలితాలు త్రైమాసికం పూర్తయిన తర్వాత 45 రోజుల్లోగా సమర్పించాల్సి ఉంటుంది. కాగా బీఎస్ఈలో దీని షేరు స్వల్పంగా తగ్గి రూ.590.95 వద్ద మధ్యాహ్నం ట్రేడ్ అయ్యింది.

లూపిన్ లాభంలో 59 శాతం గండి

• క్యూ1 లాభం రూ.358 కోట్లు

న్యూఢిల్లీ : ప్రముఖ ఔషధ దిగ్గజం లూపిన్ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 59శాతం క్షీణించింది. అమెరికాలో నియంత్రణా సంస్థలతో ఏర్పడ్డ చిక్కుల వల్ల కంపెనీ నష్టాలను చవిచూసింది. అమెరికా ఔషధ నియంత్రణా సంస్థ పలుమార్లు నాణ్యత ప్రమాణాలపై హెచ్చరికలు చేయడంతో అమెరికాలో అమ్మకాలు తగ్గాయి. దీంతో పాటు లాభాల మార్జిన్ కూడా తగ్గింది. అమెరికాలో అమ్మకాలు ఏకంగా 27 శాతం క్షీణించి రూ.1602 కోట్లకు దిగిరాగా.. దేశీయ మార్కెట్లో 1.8 శాతం క్షీణించి రూ.932 కోట్లకు దిగివచ్చాయి. ఇక లాభాల విషయానికి వస్తే జూన్ త్రైమాసికంలో రూ.358 కోట్లకు దిగిరాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.882 కోట్లని తెలిపింది. ఫలితాలు అంచనా కంటే తక్కువగా నమోదయ్యాయి. ప్రధానంగా జీఎస్టి అమలు ప్రభావం తమ అమ్మకాలపై కనిపించిందని కంపెనీ ఎండీ నీలేష్ గుప్తా ఒక ప్రకటనలో వెల్లడించారు.

ఇండిగో వార్షికోత్సవం సేల్ ఆఫర్



న్యూఢిల్లీ : బడ్జెట్ ఎయిర్‌లైన్ 11వ వార్షికోత్సవం సందర్భంగా పరిమితి కాలం ఆఫర్ కింద ప్రారంభ టికెట్ ధర రూ.1,111కు అందుబాటులోకి తెచ్చింది. ప్రత్యేక ఆఫర్ ప్రయాణ తేదీకి 15 రోజుల ముందు బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రత్యేక స్కీం రూట్ల విషయానికి వస్తే ముంబై, గోవా, బెంగళూరు, గువాహతి, కోల్‌కతా, చెన్నై, పూనేలకు వర్తిస్తుంది. టిక్కెట్లు ఈ నెల 2నుంచి 6 వరకు అందుబాటులో ఉంటాయని ఎయిర్‌లైన్ వెబ్‌సైట్‌లో వెల్లడించింది. ఈ టిక్కెట్లు ఆగస్టు 21, 2017 నుంచి మార్చి 24, 2018 వరకు చెల్లుబాటు అవుతాయని వెబ్‌సైట్‌లో పేర్కొంది. అయితే పరిమిత కాలం పాటు ఉండే ఈ స్కీంకు ఎన్ని సీట్లు కేటాయించిందో మాత్రం వెల్లడించింది. ఎన్ని సీట్లు అందుబాటులో ఉంటాయో అన్నింటిని ఆఫర్ చేస్తామని తెలిపింది. ఈ ఆఫర్ ఎంపిక చేసిన నాన్ స్టాప్ విమాన సర్వీసులు ..అగర్తలా, అమృత్‌సర్, బాగ్‌డోరా, బెంగళూరు, భువనేశ్వర్, చెన్నై, కోయంబత్తూరు. ఢిల్లీ, దుబాయి. గోవా, గువాహతి, కోలకతా, పూనే, విశాఖపట్టనం,సింగపూర్‌లని తెలిపింది. అయితే టిక్కెట్లను తమ బుకింగ్ చానల్స్ ద్వారా చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. రూ.1,111కు విక్రయించే టిక్కెల్ల విషయానికి వస్తే గోవా నుంచి బెంగళూరు, అగర్తల నుంచి గువాహతి, బాగ్‌డోగ్రా నుంచి కోలకతా, చెన్నై నుంచి బెంగళూరు, చెన్నై నుంచి కోయంబత్తూరు, ఢిల్లీ నుంచి అమృత్‌సర్, ఢిల్లీ నుంచి జైపూర్‌లని వెబ్‌సైట్ తెలిపింది. ఇతర డిస్కౌంట్ల విషయానికి వస్తే రూ.1,211 టిక్కెట్లపై గువాహతి - బాగ్‌డోగ్రా, అహ్మదాబాద్ - ముంబై, బెంగళూరు - చెన్నై, బెంగళూరు నుంచి గోవా, భువనేశ్వర్ నుంచి కోలకతా, పూనే నుంచి బెంగళూరుకు రూ.1311 టిక్కెట్లను ఆఫర్ చేస్తోంది. ముంబై నుంచి గోవాకు రూ.1,511 టిక్కెట్లు విక్రయిస్తుండగా.. పూనే నుంచి ఢిల్లీకి టిక్కెట్ ధరను రూ.2,311 కు అందుబాటులో ఉంచినట్లు వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఎయిర్ లైన్ వెబ్‌సైట్ నుంచి బుకింగ్ చేస్తే 11 శాతం క్యాష్‌బ్యాక్ చేస్తున్నట్లు ప్రకటించింది. మొబైల్ యాప్‌తో పాటు డిజిటల్ వాలెట్ మొబైక్విక్ ద్వారా వినియోగించుకున్నా క్యాష్‌బ్యాక్ ఇస్తున్నట్లు తెలియజేసింది. 11సంవత్స రంలోకి కాలుమోపుతున్నందుకు 11 శాతం క్యాష్‌బ్యాక్ ఇస్తున్నట్లు ఇండిగో వెబ్‌సైట్ పేర్కొంది. ఈ ఆఫర్ కింద గరిష్ఠంగా రూ.600 వరకు ఇవ్వడం జరుగుతుందని తెలిపింది.



గోద్రెజ్ ప్రాపర్టీస్ లాభం రూ.23 కోట్లు

• క్యూ1 నికరలాభంలో 46 శాతం క్షీణత

న్యూఢిల్లీ: రియల్టీ దిగ్గజం గోద్రెజ్ ప్రాపర్టీస్ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 46 శాతం క్షీణించి రూ.23.37 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.46.47 కోట్లు నమోదు చేసింది. ఆదాయం విషయానికి వస్తే 3 శాతం పెరిగి రూ.345 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.333 కోట్లుగా ఉంది. అమ్మకాల విషయానికి వస్తే రూ.1474 కోట్లకు ఎగబాకగా.. త్రైమాసికంలో కొత్తగా నాలుగు ప్రాజెక్టులు తమ ఫోర్టుపోలియోలో చోటు దక్కించుకున్నాయని ఎగజిక్యూటివ్ చైర్మన్ ఫిరోజ్‌షా గోద్రెజ్ తెలిపారు. ముంబై ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న ఈ కంపెనీ మొత్తం 12 నగరాల్లో 138 మిలియన్ చదరపు అడుగుల ప్రాజెక్టులను చేపడుతోంది.

రిల్ ఇన్‌ఫ్రా లాభంలో 22 శాతం క్షీణత

క్యూ 1 లాభం రూ.334 కోట్లు

ముంబై : అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (రిల్‌ఇన్‌ఫ్రా) జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత నికరాభంలో 22 శాతం క్షీణించి రూ.334 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.439 కోట్లను నమోదు చేసింది. స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన చూస్తే నికరలాభం 5 శాతం పెరిగి రూ.417 కోట్లకు చేరింది. కాగా కంపెనీకి రెండు పెద్ద వ్యాపారాలున్నాయి. వాటిలో విద్యుత్ ఉత్పత్తి, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యాపారంతో పాటు రక్షణ రంగానికి చెందిన వ్యాపారాలు జూన్ త్రైమాసికంలో మందగించాయి. వివరాల్లోకి వెళితే రిలయన్స్ పవర్ నికరలాభం 32 శాతం క్షీణించి రూ.231 కోట్లకు దిగిరాగా.. క్రితం ఏడాది రూ.340 కోట్లు, రిలయన్స్ డిఫెన్స్ ఇంజినీరింగ్ లిమిటెడ్ నికరనష్టం రూ.230 కోట్లకు ఎగబాకింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.134.5 కోట్లుగా నమోదు అయ్యింది. అయితే రిల్‌ఇన్‌ఫ్రా మొత్తం ఆదాయం మాత్రం నాలుగు శాతంపెరిగి రూ.7,484 కోట్లకు ఎగబకాగా.. క్రితం ఏడాది రూ.7,538 కోట్లుగా ఉంది. ముఖ్యంగా విద్యుత్ వ్యాపారం పుంజుకోవడంతో రిల్‌ఇన్‌ఫ్రా పెరగడానికి కారణమైంది. కంపెనీకి చెందిన ఈపీసీ వ్యాపారం రెవెన్యూ రూ.591 కోట్లు చేరగా.. ఆర్డర్ పుస్తకం రూ.5,721 కోట్లకు చేరింది. ముంబై మెట్రోకుచెందిన కొన్ని కాంట్రాక్టులు దక్కించుకుంది. మంగళవారం నాడు బిడ్‌లు దాఖలు చేసింది. అధికారికంగా విజేతలను ప్రకటించలేదు. రిల్ ఇన్‌ఫ్రా సీఈవో లలిత్‌జలాన్ సమాచారం ప్రకారం ప్రతి ఏడాది ఆర్డర్ పుస్తకాన్ని రూ.15వేల కోట్లకు పెంచుకుంటూ.. ఒక లక్ష కోట్ల ప్రాజెక్టులకు బిడ్‌లు దాఖలు చేయాలనుకుంటున్నామన్నారు. ముఖ్యంగా తమ ఫోకస్, రోడ్లు, మెట్రో, విద్యుత్ ప్రాజెక్టులని ఆయన అన్నారు. దీంతో పాటు ఒఈఎం(ఆపరేషన్ అండ్ మెయిన్‌టెనెన్స్) వ్యాపారాలకు విస్తరించాలనుకుంటున్నట్లు తెలిపారు.

పెరిగిపోతున్న రుణాల గురించి వివరిస్తూ..కంపెనీ ఏకీకృత రుణాలు రూ.29వేల కోట్ల వరకు ఉన్నాయని వాటిని రూ.20వేల కోట్ల వరకు తగ్గించుకుంటున్నామన్నారు.

ఐడీబీఐ కార్యాలయం మార్పు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగానికి చెందిన ఐడీబీఐ బ్యాంకు ఢిల్లీ జోనల్ కార్యాలయాన్ని వీడియోకాన్ టవర్స్, జండేవాలెన్ ఎక్స్‌టన్షన్, న్యూఢిల్లీకి మార్చింది. గతంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బిల్డింగ్, రెడ్‌క్రాస్ రోడ్, న్యూఢిల్లీలో ఉండేది. తాజా బ్యాంకును కొత్త ప్రాంతానికి తరలించడంతో ఏడాదికి రూ.25 కోట్ల వరకు అద్దెను ఆదాచేయవచ్చునని బ్యాంకు తెలిపింది. బ్యాంకును గాడిలో పెట్టడానికి ఐడీబీఐ బ్యాంకు వీలైనంత వరకు వ్యయనియంత్రణను పాటిస్తుందని ప్రకటనలో పేర్కొంది.

రూపాయి స్ట్రాంగ్.. రెండేళ్ల గరిష్టానికి

ముంబై : డాలర్ మారకంతో రూపాయి రెండేళ్ల గరిష్ఠానికి ఎగబాకింది. ఫారెక్స్ మార్కెట్లో 38 పైసలు పెరిగి 63.70కి చేరింది. ఎగుమతిదార్లు తమ వద్ద ఉన్న విదేశీ కరెన్సీ పెద్దెత్తున విక్రయించడంతో డాలర్ మారకంతో రూపాయి బలపడింది. చివరగా రెండేళ్ల క్రితం జులై 23 స్థాయికి చేరింది. రూపాయి బలపడ్డంతో ఐటి కంపెనీలు ఎద్దెత్తున డాలర్లు విక్రయించడం మొదలుపెట్టాయి. రిజర్వు బ్యాంకు వడ్డీరేట్లను తగ్గించినట్లు ప్రకటించిన వెంటనే ఫారెక్స్ మార్కెట్లో రూపాయి 63.60 మార్కుకు ఎగబాకింది. విదేశీ ఇన్వెస్టర్లు భారతీయ డెట్ సెక్యూరిటీల్లో పెద్దెత్తున పెట్టుబడులు పెట్టడంతో రాబోయే రోజుల్లో రూపాయి మరింత బలపడే అవకాశాలున్నాయని ఫారెక్స్ నిపునులు అభిప్రాయపడుతున్నారు.

సీసీఈ ఫిన్‌లాండ్‌తో పొట్టర్ వీల్స్ ఒప్పందం

హైదరాబాద్ : భారతీయ విద్యా వ్యవస్థలో మెరుగైన విద్య కోసం పొట్టర్ వీల్స్ కౌన్సిల్ ఫర్ క్రియెటివ్ ఎడ్యుకేషన్ (సీసీఈ) ఫిన్‌లాండ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. కాగా పొట్టర్ వీల్ హైదరాబాద్‌లో 2013లో స్థాపించారు. ప్రీ - స్కూల్ చెయిన్ చిన్న పిల్లలకు మెరుగైన విద్యను అందిస్తోందని సంజయ్ చెప్పారు. ఈ ఒప్పందం వల్ల భాగస్వాములు ఉదాహరణకు పాఠశాలలు, ఉపాధ్యాయులకు,విద్యార్థులకు , తల్లిదండ్రులకు, యాజమాన్యాలకు లబ్ది చేకూరుతుందని ఆయన అన్నారు

గుర్తింపులేని కాలేజీలపై కేసులు

● వాటిని సీజ్ చేయాలి: ఏబీవీపీ డిమాండ్



హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపులేని జూనియర్ కాలేజీలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబివిపి) డిమాండ్ చేసింది. గుర్తింపు లేకుండా అక్రమంగా క్లాసులు నడుపుతున్న కాలేజీలను సీజ్ చేయాలని కోరుతూ సంఘం నాయకులు బుధవారం ఇంటర్మీడియట్ బోర్డు కార్య దర్శి అశోక్‌కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో 29 కార్పొరేట్ కాలేజీలకు అనుబంధ గుర్తింపు లేదని సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎల్ అయ్యప్ప విమర్శించారు. ఆయా కాలేజీలు బోర్డుకు జరిమానాగా రూ. 2.50 కోట్లు చెల్లించాల్సి ఉందని వాటి ని రాబట్టాలని డిమాండ్ చేశారు. వేలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కాలేజీలపై చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోం దన్నారు. ఇందులో మంత్రుల హస్తంతోపాటు, బోర్డు అధికారులకు భాగస్వామ్యం ఉందనే ఏబివిపి భావిస్తోందన్నారు. ఆయా కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల జీవితాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఉత్తమ వార్తా ఛాయా చిత్రాల పోటీలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పత్రికా రంగంలో వార్త ఛాయాచిత్రాలకు లభించే గుర్తింపు, ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. ఈ నేపథ్యంలో వార్త ఛాయాచిత్రా లను తీసే ఫోటో జర్నలిస్టులకు తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టు సంఘం ఉత్తమ చిత్రాలకు పోటీలను నిర్వహిస్తోంది. ప్రపంచ ఫోటోగ్రఫి దినోత్సవాన్ని పురస్కరిం చుకుని ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు జర్నలిస్టు సంఘం అధ్యక్షులు గంగాధర్, ప్రధాన కార్యదర్శి హరి బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో పాల్గొనడానికి ఆసక్తిగల జర్నలిస్టులు ఈ నెల15వ తేదీలోగా తమ చిత్రా లను బషీర్‌బాగ్‌లోని తమ కార్యాలయానికి పంపించాలని కోరారు.

పసుపు బోర్డు కాదు..

స్పైస్ పార్క్ ఇస్తాం

● వరంగల్‌లో స్పైస్ ఏజెన్సీకి ఆమోదం ● రాజ్యసభలో నిర్మాలా సీతారామన్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణలోని నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలన్న డిమాండ్లపై కేంద్రం మరోసారి దాటవేత సమాధాన మిచ్చింది. పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అందాయని చెబుతున్న కేంద్రం, స్థలం కేటాయిస్తే స్పైస్ పార్క్ ఏర్పాటు చేస్తామని డొంకతిరుగుడు సమాధాన మిచ్చింది. కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ విషయాలు పేర్కొన్నారు. అదే సమయంలో తెలంగాణ రాష్ట్రం కోసం స్పైస్ డెవలప్మెంట్ ఏజెన్సీ (ఎస్డీఏ) పేరుతో ఓ సంస్థను వరంగల్ కేంద్రంగా ఏర్పాటు చేయడానికి ఆమోదముద్ర వేశామని పేర్కొన్నారు. సుగంధ ద్రవ్యాలు, మసాలా దినుసుల పంటలకు సంబంధించి శాస్త్రీయ పరిశోధనలు, దిగుబడి పెంపు, పంట నాణ్యతను పెంపొందించడం, మార్కెటింగ్ సహా ఎగుమతులు చేయడంలో ఈ స్పైస్ డెవలప్మెంట్ ఏజెన్సీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం సాధించడానికి దోహదపడుతుందని సమాధానంలో పేర్కొన్నారు.

మిర్చి, పసుపు పంటలు సహా మసాలా దినుసుల పంటల విషయంలో రైతులకు అనేక రూపాల్లో స్పైస్ బోర్డు నుంచి సహాయం అందుతుందని నిర్మలా సీతారామన్ తెలిపారు. పంట దిగుబడి పెంచడం నుంచి పండించిన పంటకు సరైన ధర లభించేలా చేయడం కోసం కార్య క్రమాలను చేపట్టడంతో పాటు ప్రాసెసింగ్ విషయం లోనూ అధునాతన పరి జ్ఞానాన్ని అందించడం కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్టు వివరించారు. అలాగే పంట నాణ్యతను పరీక్షించేందుకు పరి శోధన శాలలు, నాణ్యతను నిర్ధారిం చే సర్టిఫికేషన్లు కూడా ఏర్పాటు చేసినట్టు సీతా రామన్ ఇచ్చిన సమాధానంలో పేర్కొన్నారు. ఎగుమతులను దృష్టిలో పెట్టుకుని అందుకు తగ్గట్టుగా మసాలా దినుసుల దిగుబడి వచ్చేలా ప్రణాళికలు రూపొందించి, వచ్చిన దిగుబడిని అంతర్జాతీయంగా మార్కెట్ చేసి ఎగుమతి చేస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలోనే స్పైస్ పార్కులను ఏర్పాటు చేస్తున్నామని, వీటిలో స్పైస్ ప్రాసెసింగ్‌లో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, నాణ్యతను సర్టిఫై చేసి ప్రపంచంలో ఎక్కడ డిమాండ్ ఉందో తెలుసుకుని అక్కడికి ఎగుమతి చేయడానికి ఉపయోగపడుతుందని అన్నారు.

ఇదిలా ఉంటే నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత మాత్రం పసుపు బోర్డు ఏర్పాటు కోసం అలు పెరుగని పోరాటం చేస్తు న్నారు. కేంద్ర వాణిజ్య శాఖ పసుపు బోర్డు బదులు నాలుగైదు రకాల మసాలా దినుసుల కోసం స్పైస్ పార్కు ఏర్పాటు చేస్తామని చెబుతున్నా, కవిత మాత్రం తన పట్టు వీడడం లేదు. మిర్చి బోర్డు, కాయిర్ బోర్డ్, కాఫీ బోర్డు తరహాలోనే పసుపు పంట కోసం కూడా ప్రత్యేకంగా బోర్డు ఉండాల్సిందేనని ఆమె పట్టుబడుతున్నారు. తెలంగాణతో పాటు పసుపు పంట పండించే రాష్ట్రాల సమాచారం తెలుసుకుని ఆయా రాష్ట్రాల నుంచి మద్దతు సైతం సేకరిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే అస్సాం, మహా రాష్ట్ర, కేరళ రాష్ట్రాల మద్దతు కూడగట్టారు. తద్వారా కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి ఎలాగైనా పసుపు బోర్డు ఏర్పాటు చేయించాలన్న కృతనిశ్చ యంతో ఉన్నారు. ఇదే విషయాన్ని తాజాగా ఆమె ఒక ప్రకటనలో వెల్లడించారు.

పసల్ బీమా యోజన ప్రీమియం గడువు పొడిగించాలి: ఏపీ రైతు సంఘం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఖరీఫ్ సీజన్‌లో రైతాంగం పండించే పంటలకు పసల్ బీమా యోజన ప్రీమియం చెల్లించేందుకు గడువు ముగిసిందని, దీన్ని కేంద్రప్రభుత్వం వెంటనే పొడిగించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి రాంచంద్రయ్య కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. పసల్ బీమా యోజనపై పలుమార్లు కేంద్రప్రభుత్వానికి విన్నవించినా కూడా పట్టించుకోవడం లేదని, దీనిపై వెంటనే స్పందించాలని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే సూమారు 250 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు.

సినీ పెద్దల లేఖపై జనసేనాని ట్వీట్

సమస్య పరిష్కారానికి కేసీఆర్‌కు పరోక్ష వినతి



అమరావతి, ఆంధ్రప్రభ: డ్రగ్స్ దుమారానికి సంబంధించి ప్రతి వాళ్లూ సినిమా వాళ్ల మీద ఇంత తీవ్రంగా స్పందించడం మా అందరికీ చాలా బాధ కలిగించింది. సినీ పరిశ్రమకు ఈ పది రోజులూ చీకటి రోజులు.అయినా గ్రహణం గంట సేపే ఉంటుంది. కానీ ప్రయాణం నిరంతరం సాగుతూనే ఉంటుందని, సదా ప్రజా శ్రేయస్సే కోసం శ్రమించే మనసున్న ముఖ్యమంత్రి ఈ సమస్యకు పులిస్టాప్ పెట్టాలని వినమ్రతతో విన్నవించుకుంటున్నామని సినీ పెద్దలు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చేసిన అప్పీల్ లేఖను జనసేనాని పవన్ కల్యాణ్ ఉన్నది ఉన్నట్లుగా బుధవారం సోషల్ మద్యంలో చేసిన ట్వీట్ హల్‌చల్ చేసింది.డ్రగ్స్‌కు సంబంధించి సినీపరిశ్రమ పడుతున్న ఆందోళనను జనసేనాని పరోక్షంగా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లయింది. సినీ పరిశ్రమలో డ్రగ్స్ వాడకానికి సంబంధించిన వివాదంపై తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్,తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి, తెలంగాణ స్టేట్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ పెద్దలు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి,సమస్యను పరిష్కరించాలని అప్పీల్ చేశారు.ఈ లెటర్‌ను పవన్‌కల్యాణ్ ఉన్నదీ ఉన్నట్లుగా ట్వీట్ చేయడం గమనార్హం.సినీ పెద్దలు సీఎంకు రాసిన లేఖలోని అంశాలు క్లుప్తంగా.. మాకు మాదకద్రవ్యాలు సేవించేవాళ్లు ఎప్పటికీ హీరోలు కారని, అతి కొద్ది మంది చేసిన పొరపాట్లకి ఒక పరిశ్రమ తలవంచుకోవాల్సిన పరిస్థితి రావడం చాలా బాధాకరంగా ఉందన్నారు. క్రమశిక్షణ లేని వాళ్లను పరిశ్రమ భరించినట్లు ఒక్క మచ్చు తునక కూడా ఎక్కడా లేదని, శారీరకంగా ,మానసికంగా ఎంతో ధృడత్వం ఉన్న వ్యక్తులే ఇక్కడ నిల దొక్కుకుని మనగలరని లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి అలవాట్లు ఉన్న వాళ్లు వాళ్లంతట వాళ్లే తెరమరుగైపోతారు. కానీ మా వంతు మేం ..వారి మీద క్రమ శిక్షణా పరమైన చర్యలు తీసుకుంటాం.ప్రభుత్వానికి, పోలీసులకు పూర్తిగా సహకరిస్తాం.మేం కోరుకునేదల్లా ఒక్కటే ..మేం ఏ వర్గం మీద , కులం మీద , మతం మీద ,ప్రభుత్వం మీద ఒక్క చెడ్డమాట లేకుండా సినిమా తీసే ప్రయత్నం చేస్తామని స్పష్టం చేశారు.సమస్యను పరిష్కరించాలని వారు కేసీఆర్‌ను కోరారు.

మహిళా ఎంపీకి ఇమ్రాన్ ఖాన్ అసభ్య మెసేజ్‌లు

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వ్యవహారం



ఇస్లామాబాద్ : పాకిస్థాన్ మాజీ స్టార్ క్రికెటర్, ప్రతిపక్ష పాకిస్థాన్ తెహరీక్ ఇన్సాఫ్ (పీటీఐ) నేత ఇమ్రాన్ ఖాన్‌పై ఆ పార్టీ బహిష్కృత జాతీయ అసెంబ్లీ సభ్యురాలు సంచలన వ్యాఖ్య చేశారు. తన ఫోన్‌కు ఇమ్రాన్ అసభ్య సందేశాలు పంపించారని అయేషా గులాలై ఆరోపించారు. మంగళ వారం జరిగిన ఓ మీడియా సమావేశంలో గులాలై మాట్లా డుతూ మాజీ క్రికెటర్‌పై తాను చేసిన ఆరోపణలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. పార్టీకి తాను రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. తనకు పార్టీ టిక్కెట్ లేదా ఎన్ఏ-1 సీటు రావాలన్న ఆశ లేదని, అసలు ఎన్ఏ-1 సీటుకు, తాను రాజీనామా చేయడానికి సంబంధమే లేదన్నారు. ప్రస్తుతం తాను మానసికంగా కుంగుబాటుకు గురికావడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. పార్టీలో చాలా సమస్యలు ఉన్నప్పటికీ టెక్స్ట్ మెసేజ్‌లు పంపించడం వాళ్లకున్న మరో చెడ్డ అలవాటని విమర్శించారు. తనకు తొలిసారి 2013 అక్టోబర్‌లో ఇమ్రాన్ ఫోన్ నుంచి అసభ్యకర మెసేజ్ వచ్చిందని, కావాలంటే ఆయన బ్లాక్‌బెర్రీ ఫోన్ తనిఖీ చేయవచ్చని గులాలై పేర్కొన్నారు. బ్లాక్ బెర్రీ సెల్‌ఫోన్లలో మెసేజ్ కనిపెట్టే అవకాశం లేనందునమహిళా నేతలంతా అదే ఫోన్లు వాడాలని ఇమ్రాన్ కోరేవాడని చెప్పారు.

ఇమ్రాన్ పంపిన మెసేజ్‌లలో ఉపయోగించిన పదాలను గౌరవమున్న ఏ వ్యక్తీ సహించలేదు. ఇమ్రాన్ ఖాన్ ఏమాత్రం తనను తానుకంట్రోల్ చేసుకోలేదు. పార్టీలో చాలామంది మహిళలు ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. సమర్ధతగల నాయకులంటే ఆయనకు గిట్టదని, ఇమ్రాన్ మానసిక పరిస్థితి కూడా సరిగాలేద న్నారు. ఖైబర్ పక్తున్‌ఖ్వాకి చెందిన గులాలై పీటీఐ క్రియాశీలక సభ్యుల్లో ఒకరుగా గుర్తింపు పొందారు.

2016లో 9235 రైళ్లు రద్దు

న్యూఢిల్లీ: నువ్వేళ్ళాల్సిన రైలు జీవిత కాలం లేటన్న మాట పోయింది.. ఇది రద్దులోకి వచ్చింది. భారతీయ రైల్వేలు ఘనణీయమైన అభివృద్ధి సాధించాయని రైల్వే శాఖ తరచూ చంకలు గుద్దుకుంటూ ఉంటుంది. ఇప్పుడు చెబుతున్న గణాంకాలు వింటే ఔరా! అనిపించక మానదు. 2016 సంవత్సరంలో ఏకంగా 9235 రైళ్ళను రద్దు చేశారట. కారణమేదైనా.. రోజుకు సగటున 25 రైళ్ళను ఎడాపెడా రద్దు చేసి పారేశారన్నమాట. ఈ సమాచారాన్ని ప్రభుత్వమే వెల్లడించింది. 2014తో పోలిస్తే రైళ్ళ రద్దు 250 శాతం పెరిగిందట. ఆ ఏడాది రోజుకు కేవలం ఏడు రైళ్ళనే రద్దు చేశారట. ఇక ఈ ఏడాది సంగతికొస్తే.. జూన్ వరకూ 4409 రైళ్ళను రద్దు చేశారట. వాతావరణం, బోగీలు అందుబాటులో లేకపోవడం రైళ్ళ రద్దుకు కారణమని ప్రభుత్వం సన్నాయి నొక్కులు నొక్కుతోంది.

హైడ్రోజన్ పబ్‌పై పోలీసుల దాడి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 2 లోని హైడ్రోజన్ పబ్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధ వారం రాత్రి దాడి చేశారు. ముంబైకి చెందిన ఏడు గురు యువతులను, 11 మంది యువకులను అదుపు లోకి తీసుకున్నారు. పబ్ యజమానిని కూడా పోలీ సులు అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం వీరందర్నీ జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగిం చారు.

నగ్నంగా ఊరేగించారు

బొకారో(జార్ఖండ్) : జార్ఖండ్ బొకారో జిల్లాలో ఒక వ్యక్తి మరో మతం మహిళతో తిరిగినందుకు అతన్ని నగ్నంగా ఊరేగించిన ఘటన చోటుచేసుకున్నది. మహమ్మద్‌షకీర్ అనే వ్యక్తి జార్ఖండ్ బొకారో జిల్లాలోని ప్రగ్యా సెంటర్‌లో పనిచేస్తున్నాడు. షకీర్ మంగళ వారంనాడు మరో మతానికి చెందిన మహిళతో కార్యాలయంలో సన్నిహితంగా గడుపుతూ పట్టుబడ్డాడు. దీంతో ఒక్కసారిగా పోగైన జనం అతన్ని బయటకు ఈడ్చుకొచ్చి, అతనిపై దాడిచేశారు.

లౌకిక శక్తులన్నీ ఏకం కావాలి

మోడీ వేధింపులు ప్రజలు గమనిస్తున్నారు: వీహెచ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాంగ్రెసేతర ప్రభుత్వాలను కూలగొడుతూ ప్రతిపక్షాలను వేధిస్తున్న ఎన్‌డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాజకీయ పార్టీ లన్నీ ఏకం కావాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎంపీ వి.హనుమంతరావు పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ పాలన నియంతృత్వంగా సాగుతోందని, ఆయన సాగిస్తున్న వేధింపులను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్యుల బతుకులు దుర్భరమయ్యాయని, ప్రజల పక్షాన ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా నిలవాలని బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన కోరారు. మోడీకి వ్యతిరేకంగా ఉన్న ప్రభుత్వాలను వేధిస్తున్న తరుణంలో లౌకిక పార్టీలన్నీ ఏకం కావాలన్నారు. నైతిక విలువలను పక్కనబెట్టి మోడీకి మద్దతు ఇస్తున్న బీహార్ ముఖ్యమంత్రి నితిష్ కుమార్‌కు ప్రజలు బుద్ధి చెబుతారని ఆయన అన్నారు.కేసీఆర్ ప్రభుత్వం దళితులు, బడుగు, బలహీన వర్గాలను అణచి వేస్తోందని హనుమంతరావు ఆరోపించారు. ప్రభుత్వానికి దళితుల ప్రాణాలకన్నా ఇసుక వ్యాపారమే ముఖ్యమైందని, గ్రామాలపై పడి దాడులు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. సిరిసిల్ల జిల్లాలో దళితులపై జరిగిన దాడిపై మీరాకుమార్ సంధించిన ప్రశ్నలకు రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రులు హైదరాబాద్‌లో కూర్చుని నోటికొచ్చినట్లు మాట్లాడు తున్నారని, దమ్ముంటే సిరిసిల్ల వస్తే వాస్తవాలు తెలుస్తాయని ఆయన అన్నారు. జరిగిన సంఘటనను వక్రీకరించి ప్రభుత్వం తమ వారిని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆయన మండిపడ్డారు. ఇసుక అక్రమ వ్యాపారం చేసేవారిపై చర్యలు తీసుకోకుండా దాన్ని అడ్డుకున్న దళితులపై కిరాతంగా దాడిచేసి తెరాస ప్రభుత్వం దళితుల వ్యతిరేకిగా తన నిజస్వరూపాన్ని చాటుకుందని హనుమంతరావు అన్నారు.దిగ్విజయ్ సింగ్‌ను రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి ఎందుకు తప్పించారో తనకు తెలియదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అనేక అంశాలపై తాను గతంలో దిగ్విజయ్‌తో విభేదించిన మాట వాస్తవమేనని, పార్టీ పరిరక్షించుకునేందుకు అధిష్టానానికి తన అభిప్రాయాలు చెప్పేవాడినని హనుమంతరావు అన్నారు. మధ్యప్రదేశ్‌లో పాదయాత్ర చేపడుతున్నందునే రాష్ట్రానికి ఆయన తగిన సమయం కేటాయించలేకపోతున్నందున తప్పించి ఉంటారని తాను భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా నియమించిన రామచంద్ర కుంతియాకు రాజకీయంగా మంచి అనుభవం ఉందని, ఆయన సామర్థ్యం భవిష్యత్తులో తేలుతుందని హనుమం తరావు అన్నారు.

ఎక్కడా బెల్ట్‌షాపులు కనపడకూడదు

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు



అమరావతి,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఎక్కడా బెల్ట్ షాపు అన్నది కనపడ కూడదని, వీటిని పూర్తిగా తొలగించి చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. అదేవిధంగా ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతో పాటు అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన నివాసం నుంచి మద్యం, ఇసుక, భూముల వ్యవహారంపై జిల్లా కలెక్టర్లు, ఎక్సైజ్, మైనింగ్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు తొలగించిన బెల్ట్ షాపులు, నమోదు చేసిన కేసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బెల్ట్‌షాపుల నిర్వాహకులపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 294 ఇసుక రిచ్చులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు సీఎంకు తెలిపారు. 1.45 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుకను గుర్తించామని ఉచిత ఇసుక విధానం కింద 68.58 లక్షల క్యూబిక్ మీటర్లు వినియోగంలోకి వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం 76.82 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అందుబాటులో ఉందని వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్య మంత్రి చెక్‌పోస్టుల వద్ద నిఘాను మరింత పటిష్టం చేయాలని, పొరుగు రాష్ట్రాలకు ఇసుక తరలిపోకుండా అడ్డుకట్ట వేయాలని ఆదేశాలు జారీ చేశారు. మరికొన్ని కొత్త రిచ్‌లు తెరచి ఇసుకను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. జిల్లా స్థాయి కమిటీలు ప్రతినెల ఇసుక ధరలను సమీక్షించి మైనింగ్ కార్యదర్శికి నివేదికలు అందచేయాలన్నారు. ఇసుక, మద్యం, భూముల విషయంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు జవాబుదారిగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్న ప్పుడే ప్రభుత్వానికి గౌరవం పెరుగుతుందని, అవినీతికి పాల్పడితే వ్యవస్థలపై నమ్మకం పోతుం దన్నారు. నమ్మకం కోల్పోయినప్పుడు విశ్వాసనీయత దెబ్బ తినడంతోపాటు తనను ప్రజలు అపార్థం చేసుకునే పరిస్థితి ఏర్పడుతుందన్నిసీఎం అన్నారు.

ముద్రగడ పాదయాత్ర చేస్తే ఏమవుతుంది?

నేటి నుంచి మళ్లీ పాదయాత్ర ప్రయత్నం

కాకినాడ, ఆంధ్రప్రభ : కాపులను బీసీల్లో చేర్చాలనే నినాదంతో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం పాదయాత్రకు పిలుపునివ్వడం, ప్రభుత్వం నిరోధిం చడం గత కొంతకాలంగా జరుగుతున్న తంతు. అయితే ముద్రగడ చేపట్టే పాదయాత్రను ప్రభుత్వం ఎందుకు అడ్డుకుంటుంది, అసలు పాదయాత్ర జరిగితే ఏమవుతుంది వంటి సందేహాలు రాష్ట్రవ్యాప్తంగా వ్యక్తమవుతున్నాయి. పాదయాత్రకు అనుమతి తీసుకోవాలని ప్రభుత్వం, రూట్‌మ్యాప్ ఇచ్చాక అనుమతి తీసుకోవడమేంటి, చంద్రబాబు పాదయాత్ర చేసినప్పుడు అనుమతి తీసుకున్నారా అంటూ ముద్రగడ ప్రశ్నించడం సర్వసాధారణమైపోయింది. గతంలో తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం నుండి అంతర్వేది వరకు రెండుసార్లు ముద్రగడ పాదయాత్రకు పిలుపునివ్వగా భారీ పోలీసుబందోబస్తు మధ్య ముద్రగడతోపాటు జేఏసీ నాయకులందరినీ గృహనిర్బంధం చేపట్టి అడ్డుకున్నారు. అయితే గతనెల 26న కాపుల ఆఖరిపోరాటం నినాదంతో ముద్రగడ తన స్వగ్రామమైన కిర్లంపూడి నుండి అమరావతి వరకు పాదయాత్రకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ పాదయాత్రను అడ్డుకుంటారని ముందే గుర్తించిన ముద్రగడ నిరంతర పాదయాత్రగా పేర్కొన్నారు. అంటే ఆయన వారంరోజులపాటు గృహనిర్బంధంలో ఉన్నట్లు పోలీసు, రెవెన్యూ అధికారులు నోటీసులివ్వగా ఆ గడువు బుధవారంతో ముగిసింది. దీంతో గురువారం నుంచి తిరిగి పాదయాత్ర చేపట్టడానికి ముద్రగడ సన్నాహాలు చేసుకుంటున్నారు. అయితే ఈ గృహనిర్బంధం మరో వారంరోజులపాటు పొడిగించనున్నట్లు స్పష్టమవుతోంది. గత ఏడాది జనవరి 31న తునిలో జరిగిన విధ్వంసకర సంఘటనను దృష్టిలో ఉంచుకుని ఈ పాదయాత్ర చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంలేదని అధికార పార్టీ నేతలు వాదిస్తున్నారు.

నవాజ్ వారసుడు షాబాజ్

● పనితీరు విభిన్నం ● వాట్సప్ మెసేజ్‌లతో ఆదేశాలు
● నిరంతర కార్యశీలి ● భారీ ప్రాజెక్టులకు ఆద్యుడు

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో రాజకీయం ఒక కుటుంబానికి సంబంధించింది. ఇటీవలే ఉద్వాసనకు గురైన నవాజ్ షరీఫ్ అందుకు అతీతుడేం కాదు. ఆయన స్థానంలో ప్రధానిగా పగ్గాలు చేపట్టబోతున్న షాబాజ్ షరీఫ్ మాత్రం ఆయనకు నకిలీ కాదు. కొత్త తరహా పాలనతో ప్రభుత్వాన్ని నడపగల సమర్థుడు. షాబాజ్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టేలోగా నవాజ్ నమ్మకస్తుడు షాహిద్ ఖాకన్ అబ్బాసి తాత్కాలిక పగ్గాలు స్వీకరిస్తారు. పార్లమెంటు ఉప ఎన్నికలో షాబాజ్ గెలిచే వరకూ అబ్బాసీదే అధికారం. ఉప ఎన్నిక రెండు నెలల్లో జరిగే అవకాశముంది.

పాకిస్థాన్‌లో ఇంత శాంతియుతంగా అధికార మార్పిడి జరిగిపోవడం ఆ దేశ చరిత్రతో పోల్చుకుంటే విశేషమే. బలీయమైన సైన్యం చూస్తుండగా అధికారం చేతులు మారడం ఆ దేశ చరిత్రలో ఇదే ప్రథమం. ఉద్వాసనకు గురైన షరీఫ్ సోదరుణ్ణే ఆ స్థానంలో కూర్చోబెట్టడానికి సైన్యం అంగీకరించడం ఇక్కడ విడ్డూరం.

మూడు దశాబ్దాలుగా షాబాజ్ నవాజ్‌కు నీడలా వ్యవహరిస్తున్నారు. పని రాక్షసుడిగా పేరు తెచ్చు కున్నారు. పంజాబ్ ప్రావిన్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ఉద్దేశించిన భారీ ప్రాజెక్టులకు ఆయనే ఆద్యుడు. 65ఏళ్ళ షాబాజ్ పాకిస్థాన్‌లోని 190మిలి యన్ల జనాభాలో సగం ఉండే ప్రాంతంలో కీలకమైన పట్టును సాధించారు. ఆయన కుటుంబ అధికారానికి అదే కేంద్రం కూడానూ.

ఆయన పనితీరులో వాట్సాప్ సందేశాలు కీలకమైనవి. పంజాబ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన వాట్సాప్ మెసేజీలతో పరుగులు తీయించేవారు. ఆయన ఆదేశాలు ఇవ్వడానికి సమయం ఉండదు. అర్ధరాత్రి అపరాత్రీ ఉండదు. ఆయన నుంచి మెసేజ్ అందిన తక్షణం సమస్య ఉన్న ప్రాంతంలో అధికారులు వాలిపోయి, పరిష్కరించేవారు. ఇదే ప్రజలలో ఆయనపట్ల విపరీతమైన అభిమానాన్ని పెంచింది. షాబాజ్‌తో పనిచేయాలంటే మీరెప్పుడూ బూట్లు వేసుకుని సిద్ధంగా ఉండాలని పంజాబ్ ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. గతంలో ఆయన షాబాజ్ యంత్రాంగంలో పనిచేశారు. నవాజ్ షరీఫ్‌ను ప్రధాని పదవికి అనర్హుడిగా సుప్రీం కోర్టు ప్రకటించిన నేపథ్యంలో ఆయన స్థానంలో షాబాజ్ పేరు బయటకొచ్చింది.


పనితీరు పరంగా చూస్తే.. షాబాజ్ కూడా షరీఫ్ మాదిరిగానే వాణిజ్యానికి ప్రాధాన్యమిస్తారు. సైన్యంతో సంబంధాలపైనే ఇద్దరి మధ్య చాలా వ్యత్యాసముంది. పాక్ రాజకీయాలలో కీలకమైన అంశాలలో సైన్యానిదే ప్రధాన భూమికని చెప్పడంలో ఎటువంటి సంశయమూ అవసరం లేదు. వీటిలో అత్యంత ముఖ్యమైనది భారత్‌తో సంబంధాలు.

సైన్యంతో మెరుగైన సంబంధాలు

1999లో నవాజ్ షరీఫ్‌ను పదవీచ్యుతుడిని చేసిన సైనికాధికారులతో షరీఫ్ కంటే మెరుగైన షాబాజ్ మెరుగైన సంబంధాలను ఏర్పరచుకున్నాడు. షాబాజ్‌ను తదుపరి ప్రధానిగా సైన్యం అంగీకరించడానికి ఇదే ప్రధాన కారణమై ఉండవచ్చు. సైన్యంతో కార్యసాధకుడిగానూ, వ్యవహారశీలిగానూ షాబాజ్ వ్యవహరిస్తూ వస్తున్నారు. 300 బిలియన్ డాలర్ల దేశ ఆర్థిక వ్యవస్థను పౌరులు వృద్ధి చేయాలనీ, అభివృద్ధినీ రెట్టింపు చేసే దాదరులు వెదకాలనీ షాబాజ్ భావిస్తుంటారని నవాజ్ షరీఫ్‌కు సన్నిహితంగా ఉండే రాజకీయనేత ఒకరు వెల్లడించారు. సైన్యానికి పగ్గాలు వేయాలనుకునే ముందు ఇది సాధించాలనీ, అప్పుడే ఆర్మీని రాజకీయ వ్యవస్థ చెప్పుచేతల్లో ఉంచుకోగలుగుతుందనీ షాబాజ్ నమ్ముతారన్నది ఆ నేత అభిప్రాయం. దీని గురించి మాట్లాడుతుండగా నేను విన్నాను.. ఇందుకు కొన్ని దశాబ్దాలు పడుతుందని షాబాజ్ అంటుంటారని ఆ నేత చెప్పారు. సైన్యంతో సాధ్యమైనంత తక్కువ విభేదించడం తన ప్రధానమంత్రి అభ్యర్థిత్వానికీ, దేశ ప్రగతికి ఎంతో అవసరమనీ చెబుతారు. సైన్యం తరచూ ప్రభుత్వంపై పైచేయి సాధించడం.. కూల్చేయడం వంటి అలవాటున్న పాకిస్తాన్‌లో ఇది తప్పక అనుసరించాల్సిన వ్యూహమని పేర్కొంటారు.

కార్యసాధకుడు..

షాబాజ్ షరీఫ్ కార్యసాధకుడిగా పేరుపొందారు. అధికారంలో ఉండగా ఆయనేనాడు అన్న నవాజ్ షరీఫ్‌కు ఎదురుచెప్పలేదు. ఆయన నిర్ణయాలను ప్రశ్నించలేదు. పార్టీలో అతి తక్కువ ప్రాధాన్యతను కోరుకునే వారు. తక్కువ సహాయకులతో మంత్రివర్గాన్ని నడపడం ఆయన ధ్యేయం. త్వరలో షాబాజ్ ప్రధాని పదవిలో కూర్చున్నప్పటికీ, ముఖ్యమైన అంశాలలో నవాజ్ ప్రమేయం ఉంటుందని ఓ కీలక నేత అంటున్నారు. నవాజ్ నిర్ణయాలే చెల్లుబాటవుతాయని పేరు చెప్పడానికి సుముఖత వ్యక్తం చేయని ఆ నేత వెల్లడిస్తున్నారు. అంతమాత్రాన నవాజ్ అన్ని అంశాలలోనూ వేలు పెడతారని కాదన్నారాయన. షాబాజ్‌ను పనిలో మెప్పించలేమనీ, ఆయన అత్యంత పని రాక్షసుడనీ అంటున్నారు కొందరు నేతలు. చేపట్టిన ప్రాజెక్టులు నిర్ణీత గడువులోగా పూర్తి కావాల్సిందేనన్నది షాబాజ్ దృఢమైన ఆకాంక్షనీ చెబుతుంటారు. ఆయన కింద పనిచేసే అధికారులు అందుకోసం నిరంతరం శ్రమిస్తుంటారు. మే నెలలో థర్మల్ విద్యుత్తు కేంద్రం, సహజవాయు కేంద్రాలను రికార్డు సమయంలో పాకిస్తాన్ ప్రభుత్వం నిర్మించింది. ఇదే అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ ప్రకటనలు సైతం వెలువరించారు. షాబాజ్‌కున్న పెద్ద బలహీనత నవాజ్ షరీఫేనని ఆయన సన్నిహితులు వ్యాఖ్యానిస్తారు.



ఇమ్రాన్‌పై పరువునష్టం దావా..

అణ్వాయుధ దేశం గా పేరున్న పాకిస్థాన్‌ను పాకిస్థాన్ ముస్లి లీగ్(నవాజ్) పార్టీ నవాజ్ షరీఫ్ కుటుంబ దేశంగా మార్చేసేందుకు ప్రయత్నిస్తున్నా రనేది ప్రతిపక్షాల విమర్శ. షాబాజ్‌ను దృష్టిలో ఉంచుకునే వారీ వ్యాఖ్య చేశారు. అవినీతిపరుడిగా చిత్రించారు. ఇది ప్రజాస్వామ్యం కాదనీ, ఒక రాజ్యంలా మారిపోయిందనీ ప్రతిపక్షపిటిఐకి చెందిన ఇమ్రాన్ ఖాన్ దుయ్యబట్టారు. సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పనామా పేపర్ల కేసును వెనక్కి తీసు కునేందుకు లంచం ఇవ్వజూపారని ఆరోపిం చారు. దీన్ని తప్పుపడుతూ షాబాజ్ పది బిలియన్ల రూపా యలకు ఇమ్రాన్‌ఖాన్‌పై పరువునష్టం దావా వేశారు.

పుట్టుకతోనే ధనవంతుడు

పారిశ్రామికవేత్త మియన్ ముహమ్మద్ షరీఫ్ సంతానంలో ముగ్గురిలో షాబాజ్ రెండోవాడు. పాకిస్థాన్ స్వాతంత్ర్యం సాధించిన నాలుగేళ్ళ తరువాత అంటే 1951లో జన్మించారు. 1980లో నవాజ్ షరీఫ్ పంజాబ్ ముఖ్యమంత్రిగా ఉండగా షాబాజ్ రాజకీయాల్లోకీ, వ్యాపారంలోకి ఒకేసారి ప్రవేశించారు. 1990లో పంజాబ్ ముఖ్యమంత్రయ్యారు. 1999 కుట్రతో పదవిని కోల్పోయారు. 2008లో తిరిగి పదవిని చేపట్టారు. నవాజ్ షరీఫ్‌కు పెద్ద అండగా నిలబడ్డారు. అవినీతిపరుడిగా ఆరోపణలు ఎదుర్కొన్నారు. కానీ..అవన్నీ రాజకీయ ప్రేరేపితాలని కొట్టిపారేశారు. కరెంటు సంబంధిత సమస్యలను పరిష్కరించగలిగితే.. 2018 ఎన్నికల్లో పిఎమ్ఎల్-ఎన్ గెలుపు నల్లేరుమీద నడకే కాగలదు. అందుకే ఆయన ఇప్పట్నుంచే పవర్ ప్రాజెక్టులను సత్వరం పూర్తిచేసే అంశంపై దృష్టిపెట్టారు. షాబాజ్ ప్రధాని అయ్యే అవకాశాలు.. ఆయన కుమారుడు హంజాకు పంజాబ్ ముఖ్యమంత్రి పదవిని కట్టబెడతాయని చెప్పడంలో సందేహం లేదు.

టీడీపీకి, ఎమ్మెల్సీ పదవికి చక్రపాణిరెడ్డి గుడ్‌బై



అమరావతి, ఆంధ్రప్రభ : తెలుగుదేశం పార్టీకి చెందిన శాసనమండలి సభ్యులు శిల్పాచక్ర పాణిరెడ్డి విషయంలో తెలుగుదేశం పార్టీ అధిష్టాన వర్గం జరిపిన రాయభారం ఫలించలేదు. చక్రపాణి రెడ్డి పార్టీ నుంచి బయటకు వెళ్లకుండా టిడిపి నాయకత్వం పలు విధాలుగా ప్రయత్నాలు చేసింది. టిడిపి రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, మంత్రి కాల్వ శ్రీనివాసులు సీఎం తరుపున చక్రపాణి రెడ్డితో స్వయంగా మాట్లాడారు. తగిన గుర్తింపును ఇస్తామని ప్రకటించారు. ఇంతవరకూ జరిగిన సంఘటనలు బాధాకరమని నచ్చజెప్పినప్పటికి చక్రపాణిరెడ్డి వినకుండా బుధవారం కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. కార్యకర్తలు, అనుచరుల సూచనలతో ఆయన టిడిపికి రాజీనామా చేశారు. శ్రీశైలం నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం అయిన అనంతరం పార్టీ మారనున్నట్లు ప్రకటించారు. ఇటీవల నంద్యాల ప్రాంతంలో జరుగుతున్న అధికారిక, అనధికారిక సమావేశాలకు ఆహ్వానించడం లేదని చక్రపాణి రెడ్డి టిడిపిలో తనకు అన్ని అవమానాలే ఎదురయ్యాయని అన్నారు. ఇటీవల పార్టీలో చేరిన వారికి పెద్దపీట వేశారని మండిపడ్డారు. ఎక్కడైతే గౌరవం ఉంటుందో అక్కడే ఉండాలనే లక్ష్యంగా పార్టీ మారుతున్నట్లు ప్రకటించారు. అంతే కాకుండా ఈ నెల 3వ తేదీన వైయస్.జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సిపిలో చేరుతున్నట్లు కూడా ప్రకటించారు. శిల్పా చక్రపాణిరెడ్డి పార్టీ మారకుండా ఎంపీలు, మంత్రులతో పాటు సీనియర్ నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఏవీ సుబ్బారెడ్డిలు చివరిదాకా ప్రయత్నించారు. వారికి ఒకరోజు గడువు ఇవ్వాలని కోరిన చక్రపాణి రెడ్డి ఎట్టకేలకు 24 గంటలు తిరగకముందే టిడిపికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి కలకలం సృష్టించారు.

ఎమ్మెల్సీ పదవి కూడా ..

ఇదిలా ఉండగా ఫిరాయింపులపై పెద్ద ఎత్తున రాష్ట్రంలో చర్చ జరుగుతున్నా సమయంలో శాసనమండలి సభ్యత్వ పదవికి శిల్పాచక్రపాణిరెడ్డి బుధవారం రాజీనామా చేయడం ద్వారా కొత్త సాంప్రదాయానికి తెర లేపారు. పార్టీలో తనకు ప్రాధాన్యత ఇవ్వనందుకే రాజీనామా చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్సీ పదవికి సంబంధించిన రాజీనామా లేఖను ఆయన ఫ్యాక్స్ ద్వారా రాష్ట్ర టిడిపి కార్యాలయానికి పంపించారు

• పునరుజ్జీవ పథకాలను 10న సీఎం శ్రీకారం

• ఏడాదిలోగా పూర్తికి ప్రణాళికలు

• రైతాంగంలో నూతనోత్సాహం

ఉత్తర తెలంగాణకు

శ్రీరాంసాగర్ జీవనాడి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉత్తర తెలంగాణ జీవనాడి శ్రీరాంసాగర్ రూపురేఖలు మారనున్నాయి. కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలకు సాగునీరందించే శ్రీరాంసాగర్ ద్వారా ఆయకట్టు పరిధిలోని ప్రతి చేనుకూ నీరందించేలా ముఖ్యమంత్రి కేసీఆర్ భారీ వ్యూహాన్ని రచించారు. దీని నిర్మాణానికి రూ.2వేల కోట్లు కేటాయించి రైతుల్లో ఆనందం నింపారు. ఎస్సారెస్పీ వద్దే పునర్జీవన పథకానికి ఈ నెల 10న కేసీఆర్ శంఖుస్థాపన చేయనున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టును 14 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేందుకు 112 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించగా, ఇప్పుడు 80 టీఎంసీల వరకు దాని సామర్థ్యం పడిపోయింది. కాళేశ్వరానికి వరద కాలువను మళ్లించడం ద్వారా సాగు, తాగునీటికి కొరత ఉండదని, రెండు పంటలకు నీళ్లు ఇచ్చే అవకాశం ఉంటుందని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. ఎస్సారెస్పీ మొదటి ఫేజ్ నుంచి 9.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇచ్చేందుకు ప్రతిపాదనలు ఉన్నా అందులో సగం ఆయకట్టుకు నీరు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వీటిని మెరుగుపరిచే ప్రణాళిక రూపొందించారు. ఎస్సారెస్పీలో నీళ్లు నింపడం, కాలువల ఆధునీకరణ చేశాక 14 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది.

కాకతీయ కాల్వకు మంచి రోజులు..

కాకతీయ కాలువకు మంచి రోజులు వచ్చాయి. సమైక్య పాలకుల నిర్లక్ష్యంలో సగం కుచించుకుపోయిన కాలువకు తెలంగాణ ప్రభుత్వం మళ్ళీ జీవం పోసింది. 9 జిల్లాల రైతులకు సాగునీరు అందించి తీరాలన్న సీఎం ఆదేశాల మేరకు కాలువ అభివృద్ధి, మరమ్మతులు, లైనింగ్ సహా ఇతర పనుల కోసం ఏకంగా వివిధ దశలలో ఇప్పటి వరకు 630 కోట్లకుపైగా కేటాయించారు. గత సంవత్సరం ఎల్ఎండి దిగువ ప్రాంతాల్లో మరమ్మతులు, ఇతర పనుల కోసం 61.54 కోట్లు మంజూరు చేయగా, ఎల్ఎండి దిగువన 124 కోట్ల 50 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇక ఈ ఏడాది ఎల్ఎండి ఎగువన పనులకు 66 కోట్లు దిగువన 350 కోట్లు కేటాయించడం విశేషం. మానాల దగ్గర దెబ్బతిన్న కట్ట మరమ్మతు పనులకు 21 కోట్ల వ్యయంతో జరుగుతున్నాయి. గత సంవత్సరం జరిగిన పనులవల్ల ఎల్ఎండి ఎగువల కాలువ సామర్థ్యం 7వేల క్యూసెక్కులకు పెరిగింది. అలాగే దిగువన కూడా 5వేల క్యూసెక్కులకు పెరుగుతున్నది. అధికారులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా పనుల్లో భాగస్వామ్యం అవుతున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుండి సాగునీరు కాకతీయ కాలువ ద్వారా లోయర్ మానేరు డ్యామ్‌లోకి వస్తోంది. స్టేజ్ - 1 కింద 9,68,600 ఎకరాల ఆయకట్టు ఉంది. స్టేజ్ - 2 కింద వరంగల్, నల్గొండ జిల్లాల్లో మరో 4.40 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఎల్ఎండి రిజర్వాయర్ నుంచి కాకతీయ కాలువ ద్వారా నీటిని విడుదల చేసిన ప్రతిసారీ చివరి ఆయకట్టుకు నీరు వెళ్ళలేని దుస్థితి నెలకొంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి కెసీఆర్ ఈ పునరుజ్జీవ పథకాలకు శ్రీకారం చుట్టారు.

ఏడాదిలో పునర్జీవన పనులు పూర్తి

మంత్రి హరీష్‌రావు



నిజామాబాద్ ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో సాగునీటి కొరత లేకుండా చేస్తున్న ప్రయత్నంలో ఎస్సారెస్పీ పునర్జీవన పథకానికి శ్రీకారం చుట్టరని రాష్ట్ర నీటిపారుదల శాఖ హరీష్‌రావు అన్నారు. ఈ నెల 10న ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ఎస్సారెస్పీ పునర్జీవన పథకానికి శంఖుస్థాపన చేయనున్న నేపథ్యంలో హరీష్‌రావు వరద కాలువను, సభస్థలి ఏర్పాట్లను బుధవారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం పోచంపాడు అతిథి గృహంలో విలేకరులతో సమావేశమయ్యారు. 1964 లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగి చరిత్ర సృష్టిస్తే వరదకాలువను రిజర్వేయర్‌గా మార్చి అవసరమయ్యే నీటిని ప్రాజెకులోకి తీసుకవచ్చే విధంగా చేపడుతున్న పథకంలో చరిత్ర సృష్టిస్తుందని అన్నారు. నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ పాత జిల్లాలకు చెందిన రైతులు స్వచ్ఛందంగా భారీ సంఖ్యలో తరలివచ్చి సభ ను విజయవంతం చేయాలని హరీష్‌రావు కోరారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, దేవాదయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి, నీటిపారుదల శాఖాధికారులు పాల్గొన్నారు.

గురుకుల ఉద్యోగాలకు లైన్ క్లియర్

• జీవో1274పై స్టే ఎత్తివేత

• త్వరలో షెడ్యూల్‌ను ప్రకటించనున్న టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్,ఆంధ్రప్రభ: గురుకులాల్లోని మహిళా డిగ్రీ కాలేజీల్లో ఉద్యోగాల నియామకానికి లైన్ క్లియర్ అయింది. లెక్చరర్ల నియామకాలకు మహిళలకే అవకాశం ఇవ్వడంపై విధించిన స్టేను ఉమ్మడి హైకోర్టు మంగళవారం ఎత్తివేయగా, గురుకులాల్లో ఉద్యోగాలను మహిళలతోనే భర్తీ చేయాలని ప్రభుత్వం జారీ చేసిన జీవో 1274పై ఉన్న స్టేను కూడా బుధవారం ఎత్తేసింది. దీంతో మహిళా డిగ్రీ కాలేజీ లెక్చరర్ల నియామకంతోపాటు, ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పరీక్షలను నిర్వహించడానికి మార్గం సుగమం అయింది. గతంలో ఇచ్చిన కోర్టు తీర్పు నేపథ్యంలో జూలై 30న జరగాల్సిన డిఎల్ పోస్టుల రాత పరీక్ష వాయిదా పడింది. మంగళవారం, బుధవారం ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పుల నేపథ్యంలో గురుకులాల్లో ఉద్యోగాల భర్తీ కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ త్వరలోనే షెడ్యూల్‌ను ప్రకటించనుంది. త్వరలోనే షెడ్యూల్‌ను ప్రకటిస్తామని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి వాణి ప్రసాద్ బుధవారంఒక ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్ వృత్తి నిపుణుల విభాగం

దక్షిణాది సమన్వయకర్తగా గీతారెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాంగ్రెస్ పార్టీ వృత్తి నిపుణుల విభాగం దక్షిణాది సమన్వయకర్తగా డాక్టర్ జె.గీతారెడ్డిని ఆ అధిష్టానం నియమించింది. రాష్ట్ర కాంగ్రెస్‌లో, ప్రభుత్వంలో అనేక పదవులు నిర్వహించిన గీతారెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం ఈ మేరకు గుర్తించి దక్షిణాది బాధ్యతలను అప్పగించారు. వృత్తి నిపుణుల విభాగం తూర్పు విభాగం సమన్వయకర్తగా గౌరవ్ గగోయ్, ఉత్తరాది సమన్వయకర్తగా సాల్వన్ సోజ్‌ను నియమించారు.

సీఎంకు కృతజ్ఞతలు

• మిగిలిన శాఖల్లోని వారినీ రెగ్యులరైజ్ చేయాలి: ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ శాఖలో పనిచేస్తున్న 20,903 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసినందుకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంత గొప్ప నిర్ణయం తీసుకోలేదని ఆయన అన్నారు. ఇదే విధంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో, అదే విధంగా ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కూడా రెగ్యులరైజ్ చేయాలని ఆయన కోరారు. టిఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని చెప్పారని, ఎంతో ఆశతో వీరందరూ ఉద్యమంలో పాల్గొన్ని రాష్ట్రా న్ని సాధించుకున్నారని గుర్తు చేశారు. 40 ప్రభుత్వ శాఖలతోపాటు 45 ప్రభుత్వ రంగ సంస్థలు, 12 యూనివర్సిటీలు, ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న 1.10 లక్షల మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందిని కూడా రెగ్యులరైజ్ చేయాలని ఆర్ కృష్ణయ్య సీఎంని కోరారు.

బీసీ బిల్లుకు సహకరించాలి



పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి ఆమోదింప చేసేలా కాంగ్రెస్ పార్టీ సహకరించాలని కోరుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర నేతలు బుధవారం ప్రతిపక్ష నేత కె జానారెడ్డిని కోరారు. సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యానారాయణ, గుజ్జ రమేష్ తదితరులు పాల్గొన్నారు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించేలా బీసీ బిల్లు పెట్టి ఆమోదం చెందేలా చూడాలన్నారు. బీసీలకు ప్రత్యేకంగా కేంద్రంలో మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బీసీలకు ఉద్యోగాల ప్రక్రియలో ఉన్న క్రిమిలేయర్‌ను ఎత్తేయాలని కోరారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.

దళితుల హత్యలకు కేటీఆరే బాధ్యుడు

• ఆయనపై కేసులు పెట్టాలి • ఇసుక మాఫియాలో సీఎం బంధువుల పాత్ర

పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : దళితులకు రక్షణ కల్పించలేని రాష్ట్ర ఐటిశాఖ మంత్రి కేటీ రామారావు నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లాలో దళితులపై జరిగిన దాడిని ముఖ్యమంత్రి కేసీఆర్ దాచి పెడుతున్నారని ఆయన ఆరోపించారు. అధికారపక్ష నాయకుల ఇసుక వ్యాపార ధన దాహానికి ఎంతమంది బలి కావాలని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి ఘోరమైన పరిపాలన చేసే నేతలు దేశంలో ఎక్కడా లేరని దుయ్యబట్టారు. దళితులు తమకు జరిగిన అన్యాయంపట్ల రోడ్డెక్కి నిలదీస్తున్నా ప్రభుత్వ నేతలు ఎందుకు స్పందించడం లేదని ఉత్తమ్ ప్రశ్నించారు. సిరిసిల్లలో ఇసుక లారీ కింద మరో దళితుడు నలిగిపోయాడని పాలకుల ధన దాహం ఎంతమంది దళితుల రక్తం తాగుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. గత కొంతకాలంగా సిరిసిల్ల ఇసుక మాఫియా విషయంలో కాంగ్రెస్ పోరాటం చేస్తున్నదని, అధికార పార్టీ, కేసీఆర్ కుటుంబం, కేటీఆర్ స్వయంగా ఇసుక మాఫియాకు అండగా ఉండడంవల్లే వారు చెలరేగిపోతున్నారని ఆరోపించారు. సిరిసిల్ల ఎమ్మెల్యేగా అక్కడి ప్రజలు ఓట్లువేస్తే గెలిచి ఇప్పుడు మంత్రిగా కేటీఆర్ అధికారాన్ని అనుభవిస్తూ వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఇసుక మాఫియాలో కేటీఆర్ సమీప బంధువు, సోదరుడి వరుస అయ్యే సంతోష్ కుమార్‌కు వాటాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఈ విషయమై తాము డాక్యుమెంట్లతో సహ నిరూపించినప్పటికీ మాఫియాను ప్రోత్సహించే విధంగా వారి సహకారం అందిస్తున్నారని అన్నారు. ఇసుక మాఫియా ఇచ్చే కమీషన్ల కక్కుర్తితో 12 మందిపై కేసులు పెట్టించి 8 మందిని థర్డ్ డిగ్రీ పెట్టి చిత్రహింసలకు గురిచేస్తే కాంగ్రెస్ పార్టీ స్పందిస్తే నలుగురే దళితులంటూ అహంకారపు మాటలు మాట్లాడుతున్నారని ఉత్తమ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేటీఆర్‌కు ఓట్లు వేసిన పాపానికి దళితులు, బీసీలు, ఎస్టీలు బలి కావాల్సిందేనా అని ఆయన ఆవేశంగా ప్రశ్నించారు. పోలీసు బలగాలను వెంట బెట్టుకుని మంత్రి కేటీఆర్ బుధవారం సిరిసిల్లలో పర్యటించారని, ఇదే సమయంలో లారీ ప్రమాదంలో మరో దళితుడు బలైనా ఆయన స్పందించకపోవడం విచారకరమన్నారు.

సిరిసిల్లలో జరుగుతున్న ప్రమాదాలను కేటీఆర్ హత్యలుగా భావిస్తున్నామని, వీటిపై కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ హత్యలకు నైతిక బాధ్యత వహించి కేటీ ఆర్ తన పదవికి రాజీనామా చేయాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు.

జూరాలకు 18వేల క్యూసెక్కుల వరద

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎగువన వర్షాలు కురవడంతో ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు నిండుకుండలయ్యాయి. కృష్ణమ్మ బిరబిరమంటూ పరుగున తెలంగాణలోకి ప్రవేశిస్తోంది. నారాయణపూర్ జలాశయం నుండి 18,199 క్యూసెక్కుల నీటిని జూరాల జలాశయానికి విడుదల చేసినట్లు అధికారులు ప్రకటించారు. బుధవారం నారాయణపురం జలాశయంకు 25,301క్యూసెక్కుల నీరు చేరుతోంది. ఇప్పటికే జలాశయంలో 26.14టిఎంసిల నీరుంది. ఎగువన ఆల్మట్టి జలాశయంలో పూర్తిస్థాయిలో 119.26టిఎంసిల అడుగుల నీరుంది. జలాశయానికి 35,672క్యూసెక్కుల నీరు వస్తుండగా, 18,388 క్యూసెక్కులు దిగువకు పంపుతున్నారు. పరిసర ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులున్నా ఎగువన కురిసిన వర్షాలకు డ్యాంలలోకి నీరు వస్తుండడంపై రైతులలో సంతోషం వ్యక్తమవుతోంది.

ఆన్‌లైన్‌లోనే శిశువుల దత్తత



హైదరాబాద్, ఆంధ్రప్రభ: నవజాత శిశువులను దత్తత ఆన్‌లైన్ విధానంలోనే జరగాలని స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం తెలంగాణ సచివాలయంలో స్త్రీ, శిశుసంక్షేమశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావును సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ అడ్వయిజరీ కమిటీ (కారా) ఛైర్మన్ రాంచందర్‌రెడ్డి కలిశారు. ఈ భేటీలో నవజాత శిశువుల దత్తత విధానంపై పలు అంశాలు చర్చించారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ నవజాత శిశువుల దత్తత విషయంలో ప్రైవేటు చైల్డ్ కేర్ సెంటర్స్ పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నేపథ్యంలో చైల్డ్ కేర్ సెంటర్స్ అన్ని కొత్త జిల్లాలోనూ ఏర్పాటుచేస్తున్నామని, సంబంధిత ఫైలు ఇప్పటికే సీఎం కేసీఆర్ ఆమోదం కోసం వెళ్లిందని తుమ్మల తెలిపారు. కొత్త రాష్ట్రంలో నవజాత శిశువు దత్తత విషయంలో ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్నా యని, ఈ పద్ధతిలో దాదాపు 20వేల దరఖాస్తులు పెండింగులో ఉన్న విషయాన్ని తుమ్మల దృష్టికి కారా ఛైర్మన్ రాంచందర్‌రెడ్డి తీసుకొచ్చారు. అలాగే పిల్లల దత్త విషయంలో ఉమ్మడి నల్గొండ జిల్లా అగ్రస్థానం లో ఉన్న విషయాన్ని వారికి వివరించారు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తుల స్వీకరణకు సంబంధించిన ఇబ్బందులను త్వరలో పరిష్కారిస్తామని తుమ్మల హామీ ఇచ్చారు. నవజాతి శిశువుల దత్తత విషయంలో సబ్‌రిజిష్టార్లు, రిజష్టార్ల నుంచి ఎదురౌతున్న ఇబ్బందులను కూడా రాంచందర్‌రెడ్డి ప్రస్తావించా రు. ప్రస్తుతం కారా తరహాలోనే స్టేట్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీని ఏర్పాటు చేస్తామని తుమ్మల హామీ ఇచ్చారు. ఇది సరిగ్గా పనిచేసేందుకు టాస్క్‌ఫోర్స్‌ను కూడా నియమించి, చిన్న పిల్లల దత్తత విషయంలో తనిఖీలు నిర్వహిస్తామని, అక్రమాలకు తావులేకుం డా చేస్తామని అన్నారు. .కేరళ రాష్ట్రంలో ఎవరైనా తల్లి దండ్రులు నవజాత శిశువులను వద్దనుకుంటే అక్కడి ప్రభుత్వం ప్రత్యేక పద్ధతి అవలంభిస్తున్నారని తెలిపా రు. చిన్న పిల్లలను వదిలించుకునేందుకు కంప పొద ల్లో, నిర్మానుష ప్రదేశాల్లో వదిలేస్తున్నారని పేర్కొన్నా రు. దీని కోసం కేరళ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని ప్రస్తావించారు. అదే తరహాలో తెలంగాణ ప్రభుత్వం కూడా నూతన విధానాన్ని తీసుకొస్తామని తెలిపారు.

జీవనోపాధి లేకుండా చేయలేం

•క్రమబద్ధీకరించొద్దు • స్టేటస్‌కో ఆదేశాలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని నాలుగు విద్యుత్ పంపిణీ సంస్థల్లో పనిచేస్తున్న సుమారు 20 వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల విషయంలో హైకోర్టు కీలక సూచనలు చేసింది. విద్యుత్ సంస్థలు నిర్ణయించిన కన్సాలిడేటెడ్ సొమ్మును చెల్లించి పొరుగు సేవల ఉద్యోగుల సేవలను వినియోగించుకోవచ్చునని హైకోర్టు తేల్చి చెప్పింది. అలాగే వారిని బయటికి పంపివేసి జీవనోపాధి లేకుండా చేయలేమని అభిప్రాయపడింది. అయితే తామిచ్చిన ఈ ఆదేశాలు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేకమైన హక్కులు కల్పించినట్లు కాదని ప్రకటించింది. విలీనం పేరుతో వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను విద్యుత్ సంస్థల్లోకి తీసుకోవడం సరికాదని కూడా హైకోర్టు అభిప్రాయపడింది. ఈ పద్ధతి దొడ్డి దారి విధానం కిందికి వస్తుందని పేర్కొంది. వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్ని విలీనం చేస్తే నిరుద్యోగులైన యువకులపై తీవ్ర ప్రభావం పడ్తుందన్న పిటిషనర్ వాదనలతో హైకోర్టు ఏకీభవించింది. విలీనానికి సంబంధించి విద్యుత్ సంస్థలు జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేసింది. తాము తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఎలాంటి విలీన ప్రక్రియ చేపట్టరాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది.. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది ఎస్.సత్యం రెడ్డి వాదనలు వినిపిస్తూ .. .గతంలో కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించొద్దని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో విలీనం పేరుతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడం సరికాదన్నారు. దీనివల్ల నిరుద్యోగ యువత పై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఇది దొడ్డిదారి విధానం కిందికి వస్తుందన్నారు. 2016 డిసెంబర్ 4వ తేదీకి ముందు నుంచి విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న వారిని విలీనం చేశారన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సాంకేతిక, విద్యాపరమైన అర్హతలుండవు. చట్టం గుర్తించిన ఎంపిక




ప్రక్రియ ద్వారా వారి పోస్టులను క్రమబద్ధీరించాల్సి ఉంటుందని పైగా ఆ ఉద్యోగులను కన్‌సాలిడేటెడ్ వేతనం పై కాంట్రాక్టర్లు నియమిస్తారన్నారు. ఆ వాదనలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. విలీనం చేయడాన్ని ఏ విధంగా సమర్థించుకుంటారో చెప్పాలని తెలంగాణ అడ్వకేట్ జనరల్ డి.ప్రకాశ్ రెడ్డిని ఆదేశించింది. పిటిషనర్ 24 వేల మందిని విలీనం చేసుకుంటున్నారని చెబుతున్నారు. అసలు ఎంత మందిని విలీనం చేస్తున్నారో చెప్పాలని హైకోర్టు అడిగింది. ఈ ప్రశ్నలకు సరియైన వివరణ ఇవ్వకపోతే విలీనం ఉత్తర్వులను సస్పెండ్ చేస్తామని వ్యాఖ్యానించింది. టీఏజీ వాదనలు వినిపించేందుకు కొంత సమయం కావాలని అభ్యర్థించారు. భోజన విరామం అనంతరం వివరాలు సమర్పించారు. మొత్తం 20,903 మందిని విలీనం చేసుకోవడానికి నిర్ణయించినట్లు తెలిపారు. వీరందరు విద్యుత్ సంస్థల్లో గత కొన్నేళ్ల నుంచి పనిచేస్తున్నారని తెలిపారు. గత మూడేళ్లుగా సేవలు అందిస్తున్న ఆ 20,903 మందిలో కేవలం 3 వేల మంది మాత్రమే ఉన్నారు. రెగ్యులర్ ఉద్యోగుల మాదిరి 8 గంటలకు పైగా పనిచేస్తున్నారన్నారు. వీరిలో చాలా మంది పదేళ్లకు పైగా సేవలందిస్తున్నారని తెలిపారు. వీరిలో చాలా మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు, డిప్లొమా హోల్డర్లు ఉన్నారన్నారు. జీతాలు చాల తక్కువగా పొందుతున్నారన్నారు. వారు శ్రమదోపిడీకి గురు కాకూడదనే విలీనం ప్రక్రియ చేపట్టినట్లు విన్నవించారు. కేవలం ఇప్పుడున్న వారిని మాత్రమే విలీనం చేస్తామని, ఇకపై పొరుగు సేవల నియామకాలకు స్వస్తి పలుకుతామన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ...పొరుగు సేవల ఉద్యోగుల్ని క్రమబద్ధీకరించొద్దని విద్యుత్ సంస్థలను ఆదేశించింది. నిర్ధారించిన కన్సాలిడేటెడ్ మొత్తాన్ని చెల్లించి ఆ ఉద్యోగుల సేవలను పొందవచ్చునని విద్యుత్ పంపిణీ సంస్థలను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

'నీట్‌పై మోడీతో తమిళ మంత్రి భేటీ

న్యూఢిల్లీ: నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)పై మినహాయింపు కోసం తమిళనాడు ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సి.విజయభాస్కర్ ఈ అంశంపై బుధవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ తంబిదురై కూడా ఆయన వెంట ఉన్నారు. తమిళనాడు హెల్త్‌మినిస్టర్ విజయ భాస్కర్ నీట్‌పై ప్రధాని మోదీని కలవడం మూడు వారాల్లో ఇది రెండోసారి. 12వ తరగతి మార్కుల ఆధారంగా మెడికల్ కోర్సుల్లో ప్రవేశం, నీట్‌నుంచి తమిళనాడుకు మినహాయింపునకు సంబంధించి ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రెండు బిల్లులను అసెంబ్లీలో ఆమోదించింది. వీటికి రాష్ట్రపతి ఆమోదం కోసం జులై 20న మంత్రుల బృందం ప్రధాని మోడీతో సమావేశమైంది. దీని కోసం ఢిల్లీలోనే మకాం వేసిన తమిళనాడు ఆరోగ్యశాఖ మంత్రి సి.విజయభాస్కర్ ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా, కేంద్ర సహాయం మంత్రి జితేంద్ర సింగ్‌లను కలిశారు.

ఎమ్మెల్యే విఠల్ రెడ్డి కన్నుమూత



కామారెడ్డి, కెఎన్ఎన్ : దేశ స్వాతంత్ర్యానంతరం కామారెడ్డి నియోజకవర్గం నుంచి మొదటి సారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన జీడిపల్లి విఠల్‌రెడ్డి(95) బుధవారం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో మృతి చెందారు. కామారెడ్డి డిగ్రీ కళాశాల వ్యవస్థాపకుల్లో ఆయన ఒకరు. విఠల్‌రెడ్డి 1922లో మాచారెడ్డి మండలంలోని ఫరీద్‌పేటలో జన్మించారు. 1944లో న్యాయవాద వృత్తిలోకి వచ్చారు. శుక్రవారం ఆయన అంత్యక్రియలను కామారెడ్డిలో నిర్వహించనున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

డ్రాగన్‌కు కౌంటర్

• సరిహద్దులో శాంతి, ప్రశాంతత ముఖ్యం

• చైనా15 పేజీల వివరణకు.. భారత్ ఘాటైన జవాబు

• డోక్లామ్ నుంచి సైన్యాన్ని వెనక్కి పిలిపించేది లేదని స్పష్టం

• యథాతథస్థితి నెల కోనే వరకు తగ్గేదిలేదని ప్రకటన

న్యూఢిల్లీ: సిక్కిం సరిహద్దులోని డోకలాంలో వివాదంపై కయ్యానికి కాలు దువ్వుతున్న చైనాకు భారత్ ధీటైన జవాబిచ్చింది. డోకలాం నుంచి భారత సైన్యాన్ని భేషరతుగా ఉపసంహరించుకోవాలన్న చైనా విజ్ఞప్తిని తోసిపుచ్చింది.. సరిహద్దుల్లో చైనా తన చర్యలను విరమించుకుంటే తప్పా..సైన్యాన్ని వెనక్కి పిలిపించేది లేదని తేల్చిచెప్పింది. ఈవిషయంలో ఇటీవల జాతీయ భద్రతా సలహాదారు చేసిన ప్రకటనకే కట్టుబడి ఉన్నట్లు భారత్ ప్రకటించింది. డోకలాం వద్ద యథాతథ స్థితి నెలకొనేంత వరకు వెనక్కి తగ్గబొమని స్పష్టం చేసింది. జూలై 27,28 తేదీల్లో చైనాలో జరిగిన బ్రిక్స్ దేశాల జాతీయ భద్రతా సలహాదారుల సమావేశానికి హాజరైన భారత భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చేసిన ప్రకటనకు కట్టుబడి ఉంటామని తెగేసి చెప్పింది. భారత జవాన్లు డోకలాంనుంచి వెనక్కి మళ్లేలా ఆదేశాలు జారీ చేయాలని చైనా విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి ప్రకటించిన నేపథ్యంలో భారత్ పై విధంగా స్పందించింది. సిక్కిం సెక్టర్‌లోని చైనా దళాలను వెంటనే వెనక్కి పిలిపించి యథాతథ స్థితిని కొనసాగించినప్పుడే తమ నిర్ణయం ప్రకటిస్తామని పేర్కొంది. చైనాతో మెరుగైన సంబంధాలకు సరిహద్దులో శాంతి, ప్రశాంత వాతావరణం ముఖ్యమని భారత్ స్పష్టం చేసింది.

డోక్లామ్‌పై చైనా 15 పేజీల వివరణ

వివాదస్పద డోక్లామ్ ప్రాంతంలో మోహరించిన భారత బలగాలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తున్న చైనా విదేశాంగ శాఖ, దీనికి సంబంధించి తన వాదనలను సమర్థించుకుంటూ 15 పేజీల నివేదికను బుధవారం విడుదల చేసింది. చారిత్రక ఆధారాలంటూ రెండు మ్యాపులను కూడా బయటపెట్టింది. 1890లో బ్రిటన్, చైనా మధ్య జరిగిన ఒప్పందాల్లో భాగంగా డోక్లామ్ ప్రాంతం చైనాకు చెందినదేనంటూ సమర్థించుకునేందుకు ప్రయత్నించింది. జూన్ 16న తమ భూభాగంలో రోడ్డు నిర్మించేందుకు ప్రయత్నించగా జూన్ 18న 270 మంది భారత సరిహద్దు సైనికులు అక్రమం గా చొరబడి అడ్డుకున్నారని చైనా ఆరోపించింది. డోక్లామ్‌లో ఉద్రిక్తతల నేపథ్యం లో భారత్ తన సైనికుల్ని 400కు పెంచిందని, అక్కడ మూడు టెంట్లు కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. దీనిపై భారత్‌ను చైనా గట్టిగా హెచ్చరించడంతో పాటు తన బలగాలను రప్పించినట్లు వివరించింది. చైనా రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకునేందుకు ప్రస్తుతం అక్కడ 40 మంది భారత సరిహద్దు సైనికులతో పాటు ఓ బుల్‌డోజర్ ఉన్నట్లు తెలిపింది. ఉద్రిక్తతలు మరింత తీవ్రత దాల్చకుండా ఉండేందుకు అక్కడున్న సైనికుల్ని తక్షణం ఉపసంహరించాలని చైనా మరోసారి డిమాండ్ చేసింది. అయితే చైనా ఆరోపణలను భారత విదేశాంగ శాఖ ఖండించింది. ఆ దేశంతో మెరుగైన సంబంధాలకు సరిహద్దులో శాంతి, ప్రశాంతత ఎంతో అవసరమని స్పష్టం చేసింది. చైనా కూడా తన బలగాలను పూర్తిగా ఉపసంహరించి చర్చలకు సానుకూల వాతావరణం కల్పించాలని భారత్ సూచించింది.



పీఎల్ఏ అధికారి వివాదాస్పద వ్యాఖ్యలు

సిక్కిం సరిహద్దుల్లోని డోక్లామ్ వద్ద భారత్- చైనా సైన్యాలు పోటాపోటీగా మొహరించిన తరుణంలో చైనా లిబరేషన్ ఆర్మీకి చెందిన ఓ సీనియర్ అధికారి న్యూఢిలీలో కీలక వ్యాఖ్యలు చేశారు. డోకలాంలోని పరిస్థితుల నేపథ్యంలో భారత్- చైనా మధ్య సంబంధాల్లో ప్రతిష్టంభన నెలకొందని వ్యాఖ్యానించారు.జులై 31న జరిగిన ఈ కార్యక్రమానికి భారత వైమానిక దళ వైస్ మార్షల్ ఎస్. ప్రభాకరన్ ముఖ్యఅతిథిగా హాజరుకావడం గమనార్హం. తమ దేశ సార్వభౌమాధికారానికి భంగం కలగ కుండా చైనా లిబరేషన్ ఆర్మీ రక్షక కవచంగా ఉంటుందని జో జియాన్ స్పష్టం చేసినట్లు చైనా రాయబార కార్యాలయ వైబ్ సైట్‌లో పేర్కొన్నా రు. చైనా లిబరేషన్ ఆర్మీ అన్ని రకాల పరిస్థితులను తట్టుకోగల సామర్థ్యం కలిగి ఉందని...తమదేశ రక్షణ కోసం సైన్యం చిత్తశుద్ధితో పనిచేస్తుందని జో జియాన్ వ్యాఖ్యానించారు.

నోయిడా భూకుంభకోణం

యూపీ మాజీ చీఫ్ సెక్రటరీ శిక్ష తగ్గింపు

న్యూఢిల్లీ: నోయిడా భూకుంభకోణానికి సంబంధించి ఉత్తర ప్రదేశ్ మాజీ ప్రభుత్వ కారదర్శి నీరా యాదవ్ జైలు శిక్షను మూడేళ్ల నుంచి రెండేళ్లకు సుప్రీం కోర్టు తగ్గించింది. ఈ కేసుకు సంబంధించి మరో ఐఏఎస్ అధికారి రాజీవ్ కుమార్ శిక్షా కాలాన్ని కూడా ఈమేరకు మార్పు చేస్తూ ద్విసభ్య ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 1971 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారిణి నీరా యాదవ్ 1992-95 మధ్య నోయిడా సీఈవోగా ఉన్నారు. ఆ సమయంలో ఆమె నిబంధనలు ఉల్లంఘించి విలువైన ప్రభుత్వ భూమిని ఓ పారిశ్రామిక వేత్తకు అక్రమంగా కేటాయించినట్లు సీబీఐ ఆరోపించింది. మరో ఐఏఎస్ అధికారి రాజీవ్ కుమార్‌తో కలిసి ఈ నేరానికి పాల్పడ్డ నీరా యాదవ్, ఫలితంగా రెండు ప్లాట్లు పొందినట్లు ఆధారాలతో నిరూపించింది. దీంతో ట్రయిల్ కోర్టు వారిద్దరిని దోషులుగా నిర్ధారించి మూడేళ్ల జైలు శిక్ష విధించింది. నిందితులు దీనిపై సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అయితే దిగువ కోర్టు తీర్పును సమర్థించిన సర్వోన్నత న్యాయస్థానం, వారి శిక్షా కాలాన్ని మూడేళ్ళ నుంచి రెండేళ్లకు తగ్గించింది.

నితీష్‌తో శరద్ యాదవ్ కటీఫ్?!



పాట్నా: జనతాదళ్ (యు) సీనియర్ నేత శరద్ యాదవ్ కొత్త పార్టీ పెట్టే యోచనలో ఉన్నట్టు సమాచారం. ఎన్డీఏతో చేతులు కలిపిన నితీశ్ కుమార్ నిర్ణయాన్ని విబేధిస్తున్న ఆయన వేరు కుంపటి పెట్టాలని ప్రయత్నిస్తున్నారు. అలాగే కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏలో భాగస్వామిగా ఉండనున్నారు. ఇప్పటికే ఆ దిశగా శరద్ యాదవ్ ప్రణాళికలు రూపొందిస్తున్నారని, పలువురు జేడీయూ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారని, తనతో కలిసి వచ్చేవారితోనూ చర్చిస్తున్నారని శరద్ యాదవ్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉండే విజయ్ వర్మ పేర్కొన్నారు. కొత్త పార్టీ ప్రకటన ఈ వారంలోనే వచ్చే అవకాశముందన్నారు. ఇప్పటికే జేడీయూ నేతలు నితీశ్ తీసుకున్న నిర్ణయాన్ని శరద్ యాదవ్ సమర్థించడం లేదని గ్రహించారు. ఈ నేపథ్యంలో శరద్ యాదవ్ తమ సీనియర్ నేతని, ఆయన తన నిర్ణయాన్ని స్వేచ్ఛగా తీసుకునే అవకాశముందని జేడీయూ సీనియర్ అధికార ప్రతినిధి సంజయ్ సింగ్ పేర్కొన్నారు.

నితీష్‌కు పదవీ గండం?

ఆర్జేడీతో తెగతెంపులు చేసుకొని బీజేపీతో పొత్తు కుదుర్చుకుని మరోసారి ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన నితీష్ కుమార్ పదవికి ముప్పుందా? ప్రజాతీర్పును కాదని, అప్రజాస్వామికంగా బీజేపీతో పొత్తుపెట్టుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జేడీయూ నేత శరద్ యాదవ్‌కు పార్టీ నుంచి నితీష్‌ను బహిష్కరించేంత శక్తి ఉందా? ఈ ప్రశ్నలకు రాబోయే కాలమే సమాధానం చెప్పాలి. 'బీజేపీ హఠావో దేశ్ బచావో' పేరిట ఆగస్టు 27వ తేదీన ఆర్జేడీ నిర్వహిస్తున్న ర్యాలీకి జేడీయూ పార్లమెంటరీ పార్టీ నాయకుడైన శరద్ యాదవ్ వెళుతున్నారు. ఈ ర్యాలీకి హాజరవడానికి ముందు, అంటే ఆగస్టు ఐదవ తేదీ నుంచి నాలుగైదు రోజులపాటు శరద్ యాదవ్ బీహార్ రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించి పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుసుకుంటారని, నితీష్‌కుమార్ పార్టీకి చేసిన ద్రోహం గురించి చర్చిస్తారని జేడీయూ ప్రధాన కార్యదర్శి అరుణ్ శ్రీవాత్సవ బుధవారం మీడియాకు తెలిపారు. ఆర్జేడీ-జేడీయూ-కాంగ్రెస్ కూటమికి రాష్ట్ర ప్రజలు ఓటేశారని, ఇలా మధ్యలో కూటమికి ద్రోహం చేయడం పట్ల ప్రజల మనోభావాలు ఎలా ఉన్నాయో కూడా ఈ సందర్భంగా శరద్ యాదవ్ తెలుసుకుంటారని ఆయన చెప్పారు.

ట్రంప్ మాస్కులతో బ్యాంకు దోపిడీలు



టురిన్ (ఇటలీ): హాలీవుడ్ సినిమా లోని కేరక్టర్‌ను కాపీకొట్టేసి, ఆ పాత్రల్లో జీవించే ప్రయత్నం చేశారు ఇటలీకి చెందిన ఇద్దరు సోదరులు. ట్రంప్ మాస్కులు ధరించి యథేచ్ఛగా దోపిడీలకు పాల్పడ్డారు. డజన్ల కొద్దీ ఏటీఎంలను కొల్లగొట్టేశారు. దాదాపు 115వేల డాలర్లను దోచేశారు. 1991 నాటి హాలీవుడ్ చిత్రం 'పాయింట్ బ్రేక్'లో ఇద్దరు దొంగలు అమెరికా మాజీ అధ్యక్షుల మాస్కులను ధరించి దోపిడీలు చేస్తుంటారు. సరిగ్గా ఇదే కాన్సెప్ట్‌ను ఇటలీ దుండగులు అందిపుచ్చుకున్నారు. ఈ దోపిడీలకు దొంగిలించిన లగ్జరీ కార్లను, పేలుడు పదార్థాలను, ట్రంప్ మాస్కులను ఉపయోగించారు. చివరకు వారి ముసుగు తొలగింది. పోలీసులకు పట్టుబడ్డారు. ప్రతీసారి ఒకేవిధంగా వీరిద్దరు దోపిడీలు చేసేవారని, అయితే ఒక్కోసారి ఒక్కో ఖరీదైన కారులో వెళ్లేవారని దర్యాప్తు అధికారులు తేల్చేశారు. వారి వద్దనుంచి డొనాల్డ్ ట్రంప్ మాస్కులు, టూల్స్, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, తాము సినిమా నుంచి స్ఫూర్తి పొంది ఇలాంటి దోపిడీలు చేశామని నిందితులు అంగీకరించారు. కానీ అది పాయింట్ బ్రేక్ సినిమా మాత్రం కాదన్నారు.

'హైడల్' భారత్ హక్కు

- కిషన్ గంగ, రాట్లే ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్
- జమ్ములో రెండు ప్రాజెక్టులకు ప్రపంచ బ్యాంక్ ఓకే
- సాంకేతిక సాకుతో పాక్ అడ్డుపుల్ల
- వచ్చేనెల మరోదఫా చర్చలు



వాషింగ్టన్ : జమ్ము కశ్మీర్‌లోని జీలం, చీనాబ్ ఉప నదులపై భారత్ నిర్మించనున్న కిషన్ గంగ, రాట్లే జలవిద్యుత్ కేంద్రాల నిర్మాణానికి భారత్‌కు ఎరిమితులతో కూడిన అనుమతి లభించింది. ఇండస్ వాటర్ ట్రీటీ- ఐడబ్లూటీ ప్రకారం ప్రపంచ బ్యాంక్ ఈ మేరకు ప్రకటన చేసింది. భారత్- పాకిస్థాన్ జలవనరుల శాఖ కార్యదర్శుల స్థాయిలో ఈవారం జరిగన చర్చల్లో భారత్, పాకిస్థాన్ తమ వాదనలు వినిపించాయని పేర్కొంది. అయితే జల విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని పాకిస్థాన్ తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ ప్రపంచ బ్యాంక్ భారత్ నిర్మించబోయే ప్రాజెక్టులకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్లు సమాచారం... రెండు విద్యుత్ కేంద్రాల టెక్నికల్ డిజైల్ ఫీచర్స్ ఐటిడబ్ల్యూటీ ఒప్పందానికి విరుద్దంగా ఉన్నాయని పాకిస్థాన్ వాదిస్తుండటంతో వచ్చేనెలలో వాషింగ్టన్ డీసీలో మరో శమావేశం నిర్వహించనున్నట్లు ప్రపంచ బ్యాంక్ స్పష్టం చేసింది. ఈ సమావేశానికి భారత్, పాకిస్థాన్ ప్రతినిధులు హాజరవ్వాలని కోరింది.

పీఐసీలో రెండు దేశాలు చర్చలు

జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి ఈ ఏడాది మార్చిలో భారత్, పాకిస్థాన్ మధ్య చర్చలు జరిగాయి. పాకిస్థాన్‌లోని పర్మనెంట్ ఇండస్ కమిషన్ -పీఐసీలో జరిగిన ఈ సమావేశంలో రెండు దేశాల ప్రతినిధులు తమతమ వాదనలు వినిపించారు. అయితే జమ్ము కాశ్మీర్‌లో నిర్మించబోతే రెండు జలవిద్యుత్ ప్రాజెక్టుల డిజైన్లపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పాకిస్థాన్ గతేడాది ప్రపంచ బ్యాంక్ ను ఆశ్రయించింది. ఇరు దేశాల మధ్య 57 ఏళ్ల క్రితం జరిగిన నీటి ఒప్పందాల్లోని వివాదాల పరిష్కారాలకు మధ్యవర్తిత్వ న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయాలని కోరింది. ఈ అంశంపై చర్చలకు మధ్యవర్తిత్వం వహించేందుకు తటస్థంగా ఉంటే నిపుణుడిని నియమించాలని ప్రపంచ బ్యాంక్ ను భారత్ కోరింది. దీంతో రెండు దేశాలకు ఉన్న సాంకేతిక అభ్యంతరాలను నివృత్తి చేసేందుకు అంతర్జాతీయ నిపుణుడిని గత నవంబర్‌లో నియమించింది. పాకిస్థాన్ అభ్యంతరాలు మన్నించదగినవి కాకపోవడంతో భారత్ ఈ విషయంలో చర్చలను నిలిపివేసింది. దాంతో ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు వివాద పరిష్కారానికి భారత్, పాకిస్థాన్‌లతో విడివిడిగా చర్చలు జరిపారు.

1960లో ఐడబ్లూటీ ఒప్పందం

ఇండస్ వాటర్ ట్రీటీ- ఐడబ్లూటీ 9 సంవత్సరాల సుధీర్ఘ చర్చల తర్వాత 1960లో నీటిఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై భారత్, పాకిస్థాన్, ప్రపంచ బ్యాంక్ సంతకాలు చేశాయి. ఇటీవల విద్యుత్ అవసరాలు పెరిగిపోవడంతో జమ్ము కశ్మీర్‌లోని కిషన్ గంగలో 330 మెగావాట్ల జలవిద్యుత్ ప్రాజెక్టు, రాట్లేలో 850 మెగావాట్ల జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తోంది. ఈ ప్రాజెక్టులను పాకిస్థాన్ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ప్రపంచ బ్యాంక్ మధ్యవర్తిత్వం చేస్తోంది. రెండు దేశాల ప్రయోజనాలను కాపాడే విధంగా తాము చొరవ తీసుకుంటున్నట్లు ప్రపంచ బ్యాంక్ స్పష్టం చేసింది. భారత్, పాకిస్థాన్ లకు సహాయం చేయడంలో వివక్ష చూపబోమని ప్రకటించింది. అయితే ప్రాజెక్టుల నిర్మాణంలో ఇరుదేశాల మధ్య సామరస్య పూరిత చర్చలు జరగాలని వరల్డ్ బ్యాంక్ ఆకాంక్షించింది. ఈ విషయంలో తమది తటస్థ వైఖరి అని... ఎవరివైపు పక్షపాతం చూపించబోమని ప్రకటించింది.

సూర్యుడి అంతర్ వలయంలోనే భ్రమణవేగం ఎక్కువ

న్యూఢిల్లీ: ఖగోళ శాస్త్రవేత్తలు తాజాగా సూర్యుడి గురించి ఓ రహస్యాన్ని వెల్లడించారు. సూర్యుడి మధ్యలో ఉన్న అంతర్‌భాగం దాని ఉపరితలం కంటే 4 రెట్లు వేగంగా భ్రమిస్తుందని సౌర శాస్త్రవేత్తలు తెలిపారు. సోలార్ కోర్ భ్రమణాన్ని శాస్త్రవేత్తలు తొలిసారి సరిగ్గా అంచనా వేశారు. యురోపియన్ స్పేస్ ఏజెన్సీ, నాసాకు చెందిన సోలార్ అబ్జర్వేటరీ ఈ విషయాన్ని వెల్లడించింది. సూర్యుడి ఉపరితలం ఎంత వేగంగా తిరుగుతుందో, అంతే స్పీడ్‌తో మధ్య భాగం కూడా తిరుగుతుందని మొదట్లో శాస్త్రవేత్తలు అనుకున్నారు. కానీ ఆ అంచనాలు తప్పు అని తేలాయి. 4 దశాబ్దాలుగా సైంటిస్టులు ఈ అంశాన్ని తేల్చేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. సూర్యుడిలో ఉన్న సెసిమిక్ వేవ్‌ల వల్లే మధ్య భాగం భ్రమిస్తున్నట్లు అంచనా వేశారు. జీ మోడ్స్ అనే లో ఫ్రీక్వెన్సీ తరంగాలను అధ్యయనం చేయడం ద్వారా శాస్త్రవేత్తలు ఈ అంచనాకు వచ్చారు. 4.6 బిలియన్ల ఏళ్ల క్రితం సూర్యుడి ఏర్పడ్డ క్షణం నుంచి కోర్ రొటేషన్ జరుగుతున్నదని కాలిఫోర్నియా ప్రొఫెసర్ రోజర్ ఉల్రిచ్ తెలిపారు.

మైనింగ్ పాలసీని పునఃసమీక్షించండి

- కేంద్రానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: ఖనిజ విధానానికి డిసెంబర్ 31 లోపు న్యూ నేషనల్ మినరల్ పాలసీను రూపొందించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. జస్టిస్ మదన్ నేతృత్వంలోని బెంచ్ ఒడిశా, కర్నాటక, గోవా వంటి రాష్ట్రాల్లో నియమాలకు విరుద్ధంగా మైనింగ్ జరుగుతుందని సుప్రీంకోర్టు తెలిపింది. దీనిని అరికట్టేందుకు 2008 నాటి విధానాన్ని మరోసారి సమీక్షించాలని కేంద్రాన్ని ఆదేశించింది. మైనింగ్ కార్యకలాపాలకు ఏవిధమైన తనిఖీలు లేవని ఇష్టారాజ్యంగా గనుల విధానం ఉందంటూ సుప్రీం కోర్టు కోర్టు పేర్కొంది. 2008 లో రూపొందించిన నేషనల్ మినరల్ పాలసీ కేవలం కాగితాలకే పరిమితమైందని, బడా వేత్తల స్వార్ధ ప్రయోజనాల కారణంగా ఈ విధానం అమలు కాలేదని సుప్రీంకోర్టు బెంచ్ తన అభిప్రాయాన్ని తెలిపింది. దాదాపు దశాబ్ద కాలం గడిచినప్పటికీ మార్గదర్శకాలను అమలు చేయకపోవడంతో అక్రమంగా మైనింగ్ జరుగుతుంది. దీనిని అరికట్టేందుకు 2008లో ఏర్పాటు చేసిన నేషనల్ మిరనల్ పాలసీను పునః సమీక్షించి పటిష్ఠమైన విధానాలను అమలు పరిచేందుకు డిసెంబర్ 31లోగా న్యూ నేషనల్ మినరల్ పాలసీను రూపొందించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.

100 శాతం జరిమానా

అక్రమ మైనింగ్‌కు పాల్పడే వారిపై సుప్రీంకోర్టు కొరడా ఝుళిపించింది. సుప్రీంకోర్టు రిటైర్డు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ఏర్పాటైన కమిటి ఒడిషాలో చట్ట విరుద్ధంగా మైనింగ్‌కు పాల్పడుతున్నారని, మళ్లీ ఇది జరుగకుండా నివారించే చర్యలు తీసుకోవాలని చేసిన సిఫారస్‌ను పటిష్టంగా అమలు చేయాలని సుప్రీంకోర్టు తెలిపింది. సెంట్రల్ ఎంపవర్ కమిటి (సీఈసీ) సిఫారస్ ల ప్రకారం నియమాలకు విరుద్ధంగా మైనింగ్ పాల్పడిన వారి నుండి 100 శాతం నష్టపరిహారం పొందాలని సుప్రీంకోర్టు రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. మైనింగ్ ద్వారా వచ్చే మొత్తాన్ని 2017 డిసెంబర్ 31 లోగా జమచేయాలని సూచించింది. సిఫారస్‌ల ప్రకారం 2000-01 నుండి చెల్లించిన ధర సక్రమంగా లేదని సుప్రీంకోర్టు బెంచ్ తన ఆదేశాల్లో పేర్కొంది.



కాంగ్రెస్‌కు ఐటీ షాక్

కర్నాటక మంత్రి, ఎంపీ నివాసాల్లో దాడులు

- ఏకకాలంలో 64 చోట్ల సోదాలు
- రూ. 10 కోట్ల నగదు, బంగారు ఆభరణాలు జప్తు
- రంగంలోకి 120 మంది అధికారుల బృందం
- బెంగుళూరు, ఢిల్లీ, కనకపుర ప్రాంతాల్లో తనిఖీలు
- ఐటీ దాడులను తప్పుబట్టిన కాంగ్రెస్
- తిప్పికొట్టిన జైట్లీ

న్యూఢిల్లీ/బెంగళూరు: కర్నాటక విద్యుత్ శాఖ మంత్రి డీకే శివకుమార్, ఆయన సోదరుడు ఎంపీ సురేశ్ నివాసాలపై ఆదాయపన్ను శాఖ అధికారులు బుధవారం దాడులు జరిపారు. ఆయనకు సంబంధించిన ఆస్తులపై ఏకకాలంలో 64 చోట్ల విస్తృత తనిఖీలు చేపట్టారు. సుమారు 10 కోట్ల రూపాయల నగదును, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సోదాల్లో 120 మంది ఐటీ అధికారుల బృందం పాల్గొన్నది. ఓ కాలేజీలోని టీచర్‌కు చెందిన లాకర్ నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ లాకర్ శివకుమార్ బంధువు పేరున ఉందని చెప్పారు.

గుజరాత్ రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇటీవల తమ ఎమ్మెల్యేలను బెంగళూరుకు తరలించింది. గుజరాత్ నుంచి బెంగళూరు చేరుకున్న 44 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మంత్రి శివకుమార్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలతో కలిసి ఈగల్‌టన్ రిసార్ట్‌లో ఉండగా.. ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. అనంతరం ఆయనను రిసార్ట్ నుంచి తన నివాసానికి తీసుకొచ్చి.. అధికారులు తనిఖీలు నిర్వహించారు. సోదాల సమయంలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు కూడా ఉన్నారు. ఇదే సమయంలో కర్నాటక, ఢిల్లీల్లో శివకుమార్‌కు చెందిన ఆస్తులు, భవనాల్లో సోదాలు నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న నగదును లెక్కించేందుకు ఆరడజను నగదు లెక్కింపు యంత్రాలను ఉపయోగించారు. ఢిల్లీలోని సఫ్దార్‌జంగ్ ఎన్‌క్లేవ్, కర్నాటకలోని హసన్, మైసూరు, బెంగళూరు, కనకపురి ప్రాంతాల్లో ప్రధానంగా సోదాలు జరిగాయి. ఢిల్లీలో చేపట్టిన తనిఖీల్లో రూ. 7.9 కోట్లు, కర్నాటకలో రూ. 2.23 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా.. మంత్రి సహా గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల గదులను కూడా సోదా చేసినట్లు వార్తలు వస్తుండగా ఐటీ అధికారులు వాటిని తోసిపుచ్చారు. రిసార్ట్‌లోని ఒక్క మంత్రి గదిని మాత్రమే తనిఖీ చేశామని.. ఎమ్మెల్యేల గదుల్లో సోదాలు చేపట్టలేదని పేర్కొన్నారు.





ఐటీ దాడులపై రాహుల్ ఆరా

గుజరాత్‌లో రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో కర్నాటకలో ఒక్కసారిగా పరిస్థితి వేడెక్కింది. గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బెంగళూరులోని ఓ రిసార్ట్‌లో బస చేస్తున్న నేపథ్యంలో అనూహ్యంగా బుధవారం ఉదయం ఆదాయపన్నుశాఖ (ఐటీ) రంగంలోకి దిగింది. ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీని ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఇది బీజేపీ రాజకీయ కుట్రలో భాగమేనని ఆరోపిస్తున్న హస్తం నేతలు.. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ఫోన్‌చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. ఐటీ దాడుల నేపథ్యంలో అధైర్యపడొద్దని ఆయన పార్టీ నేతలకు సూచించినట్టు తెలుస్తోంది.


పన్నుఎగవేతపైనే చర్యలు: ఐటీ

రియల్ ఎస్టేట్, ఇతర రంగాల్లో శివకుమార్ పెద్దమొత్తంలో అప్రకటిత ధనాన్ని పెట్టుబడులుగా పెట్టారని, పన్నుల ఎగవేతకు పాల్పడ్డారని ఆదాయపన్ను అధికారులు పేర్కొన్నారు. దేశంలోనే కాకుండా సింగపూర్ తదితర దేశాల్లోనూ శివకుమార్ పెట్టుబడులు ఉన్నాయని, వాటిపైనా దృష్టిసారించామని చెప్పారు. పన్నుఎగవేత కేసులో భాగంగా శివకుమార్ కొన్ని డొల్ల కంపెనీలను నిర్వహిస్తున్నట్లు తేలిందని, దీనిపైనా దర్యాప్తు జరపనున్నట్లు చెప్పారు. దాడుల సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చించివేసిన కొన్ని కాగితం ముక్కలు లభించాయని, వాటిపై పంచనామా చేపడతామని ఐటీ అధికారులు చెప్పారు. తదుపరి విచారణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

పార్లమెంట్‌లో ఐటీ ప్రకంపనలు

మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఈ అంశాన్ని పార్లమెంటు దృష్టికి తీసుకువచ్చింది. బెంగళూరులో ఐటీ దాడుల అంశం రాజ్యసభను కుదిపేసింది. కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఐటీ దాడులను తప్పుబడుతూ.. సభలో ఆందోళనకు దిగారు. శాసనసభ్యులను భయాందోళనకు గురిచేసే ప్రయత్నం దురదృష్టకరమని అన్నారు. కాగా, కాంగ్రెస్ ఆరోపణలను అధికార ఎన్డీయే తిప్పికొట్టింది. రాజ్యసభలో కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ ఈ ఘటనపై వివరణ ఇచ్చారు. పన్నుఎగవేత ఆరోపణల మేరకు మాత్రమే ఆదాయపన్ను శాఖ దాడులు చేపట్టిందని, ఇందులో రాజకీయ ప్రమేయం లేదని స్పష్టంచేశారు.

కేంద్ర మాజీ మంత్రి మోహన్ దేవ్ కన్నుమూత



(ఫైల్ ఫొటో)

న్యూఢిల్లీ: కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సంతోష్ మోహన్ దేవ్ బుధవారం కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన అసోంలోని సిల్‌చార్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 83 ఏళ్ళు. సంతోష్ మోహన్ దేవ్ 1980లో తొలిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. సిల్‌చార్ నుంచి ఐదు సార్లు, త్రిపుర నుంచి రెండుసార్లు కలిపి మొత్తంగా ఏడు సార్లు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా పని చేశారు. గతంలో పలు శాఖలకు సహాయ మంత్రిగా వ్యవహరించారు. సంతోష్ మోహన్ దేవ్‌కు భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తె స్మితా దేవ్ ప్రస్తుతం ఎంపీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సంతోష్ మోహన్ దేవ్ మరణం పట్ల సంతాపం తెలిపారు.

రాజ్యసభ ఎన్నికల్లో నోటా వద్దు

- సుప్రీంను ఆశ్రయించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో 'నోటా'ను ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ బుధవారం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఆ పార్టీ తరుపున ప్రముఖ న్యాయవాది, కేంద్ర మాజీ మంత్రి కపిల్ సిబల్ పిటిషన్ దాఖలు చేశారు. రాజ్యసభ ఎన్నికల్లో 'నోటా' వినియోగంపై ఎలాంటి చట్టబద్ధమైన నిబంధన లేదని ఆయన పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ జరపాలని సుప్రీంను కోరారు. జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని సుప్రీం కోర్టు బెంచ్ దీనికి అంగీకరించింది. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిగే అవకాశ మున్నట్లు తెలుస్తోంది. రాజ్యసభ ఎన్నికల్లో 'నోటా'ను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ మంగళవారం ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. 'నోటా' ప్రవేశంతో రాజ్యాంగం, ఎన్నికల చట్టాలను ఉల్లంఘిస్తున్నట్లు ఫిర్యాదు చేసింది. అయితే 2014 జనవరి నుంచి ఈవీఎంలో 'నోటా'ను తప్పని సరిగా ప్రవేశపెట్టాలని 2013లో సుప్రీం కోర్టు ఆదేశించిందని, ఆ మేరకు దీన్ని ప్రవేశపెట్టినట్లు ఈసీ అధికారులు చెబుతున్నారు.

'నోటా'పై విచారణకు సుప్రీం అంగీకారం

రాజ్యసభ ఎన్నికల్లో 'నోటా'పై విచారణ జరిపేందుకు సుప్రీం కోర్టు అంగీకరించింది. బుధవారం ఈమేరకు స్పష్టం చేసింది. సాధారణంగా రాజ్యసభ ఎన్నికల్లో ఓటేసిన ఎమ్మెల్యేలు ఆ పత్రాన్ని ఆయా పార్టీల పోలింగ్ ఏజెంట్‌కు చూపించిన తర్వాత బ్యాలెట్ బాక్సులో వేస్తారు. అయితే దీనికి భిన్నంగా గుజరాత్‌లోని మూడు రాజ్యసభ స్థానాలకు జరగనున్న ఎన్నికల్లో తొలిసారి రహస్య బ్యాలెట్ విధానాన్ని ప్రవేశపెడుతున్నారు.

'నోటా'పై ఈసీని ఆశ్రయించిన బీజేపీ

మరోవైపు బీజేపీ కూడా 'నోటా'పై బుధవారం కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో 'నోటా' వినియోగంపై రాజకీయ పార్టీల్లో గందరగోళం నెలకొందని, దీనిపై ఏకాభిప్రాయం లేనందున తొలగించాలని కోరుతూ ఓ వినతి పత్రం సమర్పించింది. రాజ్యసభ ఎన్నికల్లో సీక్రెట్ బ్యాలెట్ ఉండదు కాబట్టి 'నోటా' ఉపయోగం అంతగా ఉండదని బీజేపీ అభిప్రాయపడింది.

ఈసీలకు కొలీజియం అక్కర్లేదు



న్యూఢిల్లీ: ఎన్నికల సంస్కరణలో భాగంగా లా కమిషన్ సూచించినట్లు కొలీజియం పద్దతి ద్వారా ఎలక్షన్ కమిషనర్‌లను నియమించే ఆలోచన లేదని కేంద్రం తెలిపింది. దీనికి సంబంధించి ఎలాంటి ప్రతి పాదనలు కూడా చేయలేదని కేంద్ర న్యాయ సహాయ మంత్రి పీపీ చౌదరి లోక్ సభకు రాత పూర్వకంగా సమాధానమిచ్చారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో పాటు ఇతర ఎన్నికల కమిసనర్లను రాష్ట్రపతి సలహా మేరకు ఏర్పాటు చేసిన కొలీజియం ద్వారా నియమించాలని సూచిస్తూ మార్చి 2015 లో లా కమిషన్ నివేదిక ఇచ్చింది. ఈ కొలీజియంలో ప్రధానితోపాటు, ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉండాలని సూచించింది. ఈ సిఫారసుకు అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ జైదీ సుముఖత వ్యక్తం చేశారు. యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు బీజేపీ నేత అద్వానీ కూడా ఎన్నికల కమిషనర్లను కొలీజియం పద్దతిలో నియమించాలని అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌ను కోరిన విషయం పాఠకులకు విదితమే. లా కమిషన్ సూచన ప్రకారం కొలీజియం పద్దతిలో ఎలక్షన్ కమిషనర్‌లను నియమించే ఆలోచన తమకు లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

కర్నాటకలో అప్పాజీ క్యాంటీన్లు

బెంగళూర్: మాజీ ప్రధాని దేవెగౌడ గౌరవార్దం జేడీఎస్ కర్నాటకలో అప్పాజీ క్యాంటిన్లను ప్రారంభించింది. దీనిని హనుమంత నగర్‌లోని 50 అడుగుల రోడ్డు వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా జేడీఎస్ ఎమ్మెల్సీ శరవణ మాట్లాడుతూ అప్పాజీ క్యాంటిన్ల వద్ద తక్కువ ధరకే నాణ్యమైన భోజనం దొరుకుతుందన్నారు. కేవలం ఐదు రూపాయిలకే అల్పాహారం పొందవచ్చన్నారు. ఇడ్లీ, వడ, కేసరి మొదలైనవి అతి తక్కువ ధరకు లభిస్తాయన్నారు. మూడు రూపాయిలకు టీ, రూ. 10 లకు సాంబార్ రైస్, పొంగల్ వంటివి అప్పాజీ క్యాంటిన్లలో దొరుకుతాయన్నారు. ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ క్యాంటిన్లు ఉదయం 7.30 గంటల నుండి మధ్యాహ్నం 2.30 గంటల వరకు తెరచి ఉంటాయన్నారు. ఇది విజయమైతే రాత్రివరకు తెరచి ఉంచుతామని శరవణ తెలిపారు.

ఢిల్లీ ఎయిర్‌పోర్టులో బాంబు కలకలం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బాంబు కలకలం రేగింది. బుధవారం కార్గో టెర్మినల్ వద్ద అనుమానాస్పద వస్తువులు ఉన్నట్లు ఎయిర్‌పోర్టులోని కంట్రోల్ రూమ్‌కు ఎమర్జెన్సీ ఫోన్ కాల్ వచ్చింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు విమానాశ్రయ భద్రతా సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన బాంబ్ స్క్వాడ్ బృందం కార్గో టెర్మినల్‌కు చేరుకుని తనిఖీలు చేసింది. అనుమానాస్పదంగా కనిపించిన పరికరాలు మారుతీ కంపెనీకి చెందిన కారు విడి భాగాలుగా నిర్ధారించింది. అవి బాంబులు కాకపోవడంతో అంతా రిలాక్స్ అయ్యారు.

ముమ్మాటికీ బెదరింపు చర్యే



బెంగళూరు: రాజ్యసభ ఎన్నిక నేపథ్యంలో బీజేపీ మమ్మల్ని బెదరించే ప్రయత్నం చేస్తున్నదని గుజరాత్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి శక్తిసిన్హ్ గోహిల్ ఆరోపించారు. 'రిసార్ట్‌లో దాడులపై పార్లమెంటులో ప్రభుత్వం ప్రకటన వాస్తవ విరుద్ధంగా ఉంది. రిసార్ట్‌లో గుజరాత్ ఎమ్మెల్యేల గదుల్లో సోదాలు చేయలేదన్న ప్రకటన నిజం కాదు. ఇందుకు నావద్ద ఆధారం ఉంది. కావాలంటే వీడియో క్లిప్పింగ్ చూపిస్తా. దీన్ని నా ట్విట్టర్‌లో దీనిని పోస్ట్ చేస్తాను. అనూహ్య సంఘటన ఏదో జరుగుతుందన్న సంకేతాలు వెలువడటంతో ఐటీ అధికారుల చర్యలను వీడియో తీసే ప్రయత్నం చేశాను. వారు మా గదులను తనిఖీ చేస్తుండటాన్ని చిత్రీకరించాను. ఇంతలో ఒక అధికారి 'స్టాప్ దట్' అంటూ గద్దించాడు. వెంటనే ఆపేశాను' అని గోహిల్ మీడియా ప్రతినిధులతో చెప్పారు. బీజేపీ లాలూచీ నుంచి మా ప్రతినిధులను కాపాడుకునేందుకే ఇక్కడకు వచ్చామన్నారు. అయినా బీజేపీ తమను వెంటాడుతోందని అరోపించారు.

దాడులకు ఇదేనా సమయం?

పన్ను ఎగవేతకు సంబంధించి శివకుమార్ నివాసాల్లో దాడులు జరిగాయన్నది సమంజసం కాదు. దాడులు జరిగిన సమయం, సందర్భం అనేక అనుమానాలకు తావిస్తోంది. గత 30 ఏళ్లుగా శివకుమార్ వ్యాపార రంగంలో ఉన్నారు. ప్రతియేడాది ఐటీ రిటర్నులు సమర్పిస్తున్నారు. ఆయనేం హత్యాయత్నానికి పాల్పడలేదు. పన్నుఎగవేత గురించే దాడులు చేస్తున్నామనే వాళ్లు, శివకుమార్‌ను విచారించేందుకు, సోదాలుచేసేందుకు మరో మూడు రోజులు ఎందుకు ఆగలేక పోయారు. ఈ దాడులు ముమ్మాటికీ బెదరింపుచర్యే అని అన్నారు. ఎమ్మెల్యేలకు ముడుపులు ఇచ్చామన్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. కావాలంటే దీనిపై సుప్రీం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన సవాల్ చేశారు.

ఆంధ్రప్రభ
క్రీడాప్రభ
గురువారం 3 ఆగస్టు 2017 | హైదరాబాద్ | 12

వీర్‌దేవ్‌కు కాంస్యం

• ప్రపంచ జూనియర్ రెజ్లింగ్‌చాంపియన్‌షిప్



న్యూఢిల్లీ : ఫిన్‌లాండ్‌లో జరుగుతున్న జూనియర్ ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో ఇండియా తమ పతకాల వేటను మొదలుపెట్టింది. వీర్‌దేవ్ గులియా తొలిరోజున కాంస్య పతకం అందుకున్నాడు. పురుషుల 74 కిలోల ఫ్రీస్టైల్‌లో గులియా, జపాన్‌కు చంఎదిన యామాస్కీ యాజూరోపై 8-5 తేడాతో ప్లేఆఫ్‌లో విజయాన్ని అందుకుని కాంస్యం సాధించాడు. క్వార్టర్ ఫైనల్‌లో గులియా, ఉజ్బెకిస్తాన్ రెజ్లర్ ఇసా షాపివ్‌పై ఓడిపోవడంతోపాటు ఇసా గోల్డ్ మెడల్‌రౌండ్‌కు చేరుకోవడంతో రీపీచేజ్ బౌట్‌లో చాన్స్ దక్కింది. ఇక్కడ కెనడాకు చెందిన స్టూవర్ట్ బ్రిడ్జ్‌వాటర్‌ను ఓడించాడు. మరోవైపు పురుషుల 60 కిలోల ఫ్రీస్టైల్‌లో భారత్‌కు చెందిన రవీందర్ కాంస్య పతకం రౌండ్‌కు చేరుకున్నప్పటికీ జపాన్ ప్రత్యర్థిపై 6-9 తో ఓడిపోయాడు.

క్యాబ్‌లో వెళ్లిన గంగూలీ



కోల్‌కతా : భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ కారుకు అనూహ్యంగా మార్గ మధ్యంలో సమస్య తలెత్తితే..చివరకు అతడు క్యాబ్ బుక్ చేయించుకునే అందులో వెళ్లాల్సి వచ్చింది. మంగళవారంనాడు బీసీసీఐ పర్యటనల ప్రణాళికా కమిటీ సమావేశానికి వెళ్లాల్సి ఉంది. దారిలో తన బీఎండబ్ల్యు కారు ఆగిపోవడంతో క్యాబ్‌ను ఏర్పాటు చేసుకుని అందులో వెళ్లిపోయాడు.గతంలో అతడు సామాన్య ప్రయాణికుడి మాదిరి రైలులో వెళ్లిన విషయం తెలిసిందే.

పాత పద్ధతిలోనే రంజీ: పాతపద్ధతిలోనే దేశవాళీ టోర్నీ రంజీట్రోఫీని నిర్వహించాలని నిర్ణయించారు. తటస్థవేదికల్లో నిర్వహించాలని ప్లాన్ చేసినా అది వివాదాస్పదంగా మారడంతో పాతపద్ధతికే మొగ్గుచూపారు. రంజీట్రోఫీ అక్టోబర్ 6న మొదలై ఇంటా బయట పార్మాట్‌లోనే నిర్వహిస్తారు. సౌరవ్ కమిటీ తీసుకున్న నిర్ణయానికి బీసీసీఐ ఆమోదం తెలిపిది. కాకపోతే నాకౌట్ టోర్నమెంట్‌లు మాత్రం ఎప్పటిలాగానే తటస్థవేదికల్లో నిర్వహిస్తారు.

ఆసీస్ వేతనాల సమస్యకు పరిష్కారం!

• స్టీవ్ స్మిత్ ఆశాభావం



సిడ్నీ : గత కొద్దిరోజులుగా క్రికెట్ ఆస్ట్రేలియాతో వేతనాల సమస్యను ఎదుర్కొంటున్న ఆస్ట్రేలియా క్రికెటర్లకు త్వరలోనే ఇది పరిష్కారమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇరువురి మధ్య ఓ నూతన ఒప్పందం కుదిరే వీలు కనిపిస్తోంది. ఇది కుదిరితే గత కొద్దికాలంగా ఇరువురు మధ్య ఏర్పడిన వేతనాల సమస్య పరిష్కారమై ఆస్ట్రేలియా క్రికెటర్లు తిరిగి యధావిధిగా తమ దేశం తరపున మ్యాచ్‌లు ఆడతారు. తాజాగా ఇరు వర్గాల మధ్య జరిగిన చర్చలు పురోగమనంలో ఉన్నాయని, దాదాపు ఒక ఒప్పందం కుదిరే వీలుందని క్రికెట్ ఆస్ట్రేలియా అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. వేతనాల ఒప్పందం కారణంగా సుమారు 230 మంది ఆస్ట్రేలియా టాప్ ఆటగాళ్లు నిరుద్యోగులుగా మారిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పటికే దక్షిణాఫ్రికాలో జరుగుతున్న ముక్కోణపు సిరీస్‌లో ఆస్ట్రేలియా ఏ జట్టు పాల్గొనలేదు. కాగా ఈ తాజా ఒప్పందం కుదిరే అవకాశాలున్నా యని ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ తెలిపాడు. అది కుదిరితేనే ఈ నెలలో బంగ్లాదేశ్ పర్యటన సాధ్యమవుతుం దన్నాడు. ఆస్ట్రేలియా జట్టు ఈ నెలలో బంగ్లాదేశ్‌లో పర్యటించి రెండు టెస్టులు ఆడనుంది.



కొలంబోలోనే కొట్టేస్తారా!

• నేటి నుంచి లంకతో రెండో టెస్టు
• ఆత్మవిశ్వాసంతో కోహ్లి సేన
• సిరీస్ వశంపై కన్ను
• ఓపెనర్‌గా మళ్లీ రాహుల్... ముకుంద్‌కు ఉద్వాసన!

ఆత్మవిశ్వాసం తొణకిసలాడుతున్న వేళ... తొలి టెస్టులో ప్రత్యర్థిని అలవోకగా చిత్తు చేసిన వేళ.. భారత జట్టు శ్రీలంకతో రెండో టెస్టుకు సిద్ధమవుతోంది. అన్ని రంగాల్లోనూ లంకపై పైచేయి అనిపించుకున్న కోహ్లి సేన కొలంబోలో జరిగే రెండో టెస్టులో గెలిచి సిరీస్‌ను వశం చేసుకోవాలని భావిస్తోంది. మూడు టెస్టుల సిరీస్‌లో 2-0తో తిరుగులేని ఆధిక్యం సాధించాలని కృతనిశ్చయంతో ఉంది. పుజారా ఈ మ్యాచ్‌తో 50 టెస్టులు పూర్తి చేసుకోబోతున్నాడు.

కొలంబో: భారత్, శ్రీలంకల మధ్య మరో ఉత్కంఠ పోరుకు తెర లేవనుంది. ఇక్కడి సింహాళీస్ స్పోర్ట్స్‌క్లబ్ మైదానంలో గురువారం ఇరు జట్ల మధ్య రెండో టెస్టు ఆరంభం కానుంది. విరాట్ కోహ్లి ఈ మ్యాచ్ బరిలోకి ఆత్మవిశ్వాసంతో దిగుతోంది. తొలి టెస్టుకు దూరమైన ఓపెనర్ కేఎల్ రాహుల్ మ్యాచ్‌లో ఆడనున్నాడు. నాలుగు మాసాల విరామం తర్వాత అతను ఆడబోతున్నాడు. ఆ విషయాన్ని కెప్టెన్ కోహ్లి స్పష్టంచేశాడు. అతని కోసం ఓపెనర్లు ధావన్, అభినవ్ ముకుంద్‌లలో ఒకరిపై వేటు తప్పదు. వీరిద్దరిలో ఎవరిని తప్పించాలన్నా కోహ్లికి కష్టమైన నిర్ణయం తీసుకోవలసిందే. అయితే భీకరంగా విజృంభించి లంక బౌలింగ్‌ను ఊచకోత కోసి... తొలి ఇన్నింగ్స్‌లో మెరుపు వేగంతో 190 పరుగులు సాధించిన ధావన్‌ను పక్కన పెట్టడం జరగకపోవచ్చు. తొలి టెస్టులో రాణించినప్పటికీ రాహుల్ కోసం ముకుంద్‌పై వేటు తప్పకపోవచ్చు. ''రాహుల్ కుదురుకున్న ఓపెనర్. అతని కోసం ఓపెనర్లలో ఒకరు త్యాగం చేయాలి. రాహుల్ ప్రాక్టీస్ మ్యాచ్ తిరుగులేని ఆత్మవిశ్వాసంతో ఆడాడు. అతనిలో ఆ విశ్వాసాన్ని తిరిగిపాదుకొలపాల్సిన అవసరం ఉంది'' అని కోహ్లి అన్నాడు.



సోనీ సిక్స్, టెన్ 3లో ఉదయం 10 నుంచి

జట్టు కూర్పు: ఇక్కడి పిచ్ స్పిన్‌కు అనూకూలించే అవకాశం ఉండడంతో రెండు జట్లు కూర్పుపై దృష్టిపెట్టాయి. భారత జట్టు పాండ్య స్థానంలో ఎడమచేతి వాటం స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను ఆడించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మ్యాచ్‌కు ముందే తుది జట్టును ప్రకటిస్తామని కెప్టెన్ కోహ్లి చెప్పాడు. మరోవైపు అస్వస్థత నుంచి కోలుకొని లంక కెప్టెన్ దినేశ్ చండిమాల్ తిరిగి జట్టులోకి వచ్చాడు. ఈ పిచ్‌పై ముగ్గురు స్పిన్నర్లను ఆడించాలని లంక భావిస్తోంది. స్పిన్నర్ మలింద పుష్పకుమార టెస్టు అరంగేట్రం చేసే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

పిచ్: కొలంబో పిచ్‌పై పచ్చిక ఉంది. అయితే గాలె పిచ్ కంటే పొడిబారి వుంది. సాధారణంగా ఈ పిచ్‌పై టర్న్ సాధించాలంటే మూడు రోజులు వేచి ఉండాల్సిందే. ఇటీవల జరిగిన మ్యాచ్‌లలో ఐదు శతకాలు నమోదయ్యాయి.

వాతావారణం: మ్యాచ్ జరిగే ఐదు రోజులూ జల్లులు పడే సూచనలు కనిపిస్తున్నాయి.

తుది జట్లు (అంచనా): భారత్: రాహుల్, ధావన్, పుజారా, కోహ్లి (కెప్టెన్), రహనే, అశ్విన్, సాహా (కీపర్), జడేజా, కుల్‌దీప్ యాదవ్, ఉమేశ్ యాదవ్, షమి.

శ్రీలంక: తరంగ, కరుణరత్నే, కుశాల్ మెండిస్, చండిమాల్ (కెప్టెన్), మాథ్యూస్, నిరోషణ్ (కీపర్), ధనంజయ డిసిల్వా, దిల్‌రువాన్ పెరెరా, హెరాత్, పుష్పకుమార, నువాన్ ప్రదీప్.



పుజారాకు 'ప్రత్యేకం'

మిస్టర్ డిపెండబుల్ చటేశ్వర పుజారాకు కొలంబోలో జరిగే టెస్టు ప్రత్యేకమైంది. 50వ మ్యాచ్ ఆడబోతున్న పుజారా... మరోసారి సత్తా చాటి ఇప్పటికే 1-0తో ఆధిక్యంతో ఉన్న భారత్‌కు సిరీస్ కట్టబెట్టాలని భావిస్తున్నాడు. తద్వారా ఈ టెస్టును చిరస్మరణీయం చేసుకోవాలని తహతహలాడుతున్నాడు. తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో పుజారా సెంచరీ చేసిన సంగతి తెలిసిందే. కొలంబోలో అతనికిది రెండో మ్యాచ్. గత టెస్టులో పుజారా సెంచరీ (145 నాటౌట్) చేయడంతో భారత్ గెలిచింది. గాలెలో మాదిరిగానే అపుడు కూడా తొలి ఇన్నింగ్స్‌లోనే అతను శతకం సాధించడం విశేషం. పుజారా 49 టెస్టుల్లో 52.18 సగటుతో 3966 పరుగులు చేశాడు. దీనిలో 12 సెంచరీలున్నాయి. 4000 పరుగుల మైలురాయికి సమీపంలో ఉన్నాడు. ''ఇంతవరకు నా క్రికెట్ కెరీర్ అద్భుతంగా సాగుతోంది. తదుపరి మ్యాచ్ నాకు ఎంతో ప్రత్యేకమైంది.

50 • అశ్విన్ టెస్టుల్లో 2000 పరుగులు పూర్తి చేయడానికి అవసరమైన రన్స్. • పుజారాకిది 50వ టెస్టు.

145 • పుజారా 2015లో కొలంబో మైదానంలో అజేయంగా చేసిన పరుగులు


అథ్లెటిక్స్‌ను కాపాడాలి



లండన్ : క్రీడాకారులు సమష్టిగా బాధ్యత తీసుకుని అథ్లెటిక్స్‌ను కాపాడాలని పరుగుల చిరుత ఉసేన్ బోల్ట్ సూచించాడు. బోల్ట్‌కు ఇదే చివరి ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్. ఒక్క ఆటగాడు గెలిచినంత మాత్రాన అథ్లెటిక్స్‌ను బతికించలేరని ఆటగాళ్లంతా సమష్టి బాధ్యత తీసుకుని రాణజంచాలన్నాడు. ఎవరైనా ఓ ఆటగాడు రిటైర్మెంట్ తీసుకుంటే అతడి స్థానాన్ని ఎవరు భర్తీచేస్తారన్న ప్రశ్న ఉండకూడదని, ఆ ఆటగాడి వారసత్వాన్ని కొనసాగించాలని లేదంటే అథ్లెటిక్స్ మరుగున పడిపోయే ప్రమాదముం దన్నాడు.క్రీడాకారులు వారి క్రీడాజీవితాన్ని తేలికగా తీసుకున్నట్లయితే అథ్లెటిక్స్ మరుగున పడిపోయే వీలుందన్నాడు. ఇదిలా ఉంటే 400 మీటర్ల స్ప్రింట్ స్వర్ణ విజేత వేడ్ గురించి మాట్లాడుతూ 24 ఏళ్ల వేడ్ చాలా వేగంగా పరిగెడుతున్నాడని కచ్చితంగా తన రికార్డును బద్దలు కొట్టే సామర్థ్యం అతడికి ఉందన్నాడు. 100 మీ, 200 మీ కూడా అతడు పోటీపడితే..తన వేగాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉందన్నాడు.

బోల్ట్‌కు ఇదే చివరి పరుగు : ప్రస్తుత ఐఏఏఎఫ్ ప్రపంచ చాంపియన్‌షిప్ తర్వాత ఈ జమైకా స్ప్రింటర్ ఇక తన పరుగుకు విశ్రాంతి తీసుకోనున్నాడు. 8 సార్ల ఒలింపిక్ చాంపియన్ అయిన బోల్ట్ 11 ప్రపంచ బంగారుపతకాలతోపాటు 100 మీ, 200 మీటర్లలో ప్రపంచ రికార్డులు బద్దలుకొట్టాడు. కాగా బోల్ట్ ఈ చాంపియన్‌షిప్‌లో సింగిల్‌గా 100 మీటర్ల స్ప్రింట్‌లో పాల్గొనడంతోపాటు తదుపరి 100 మీటర్ల రిలేలో పోటీపడతాడు. గత చాంపియన్‌షిప్‌లో బోల్ట్ 100మీటర్ల బంగారు పతకం గెలుచుకున్న విషయం తెలిసిందే. 30 ఏళ్ల బోల్ట్ దీని తర్వాత ఇక ట్రాక్‌కు గుడ్‌బై పలుకుతాడు. దశాబ్దకాలంగా మానవ చిరుతగా ప్రసిద్ధిపొంది పలు రికార్డులు బద్దలు చేసిన బోల్ట్ ప్రపంచ మేటి స్ప్రింటర్ అంటూ ఐఏఏఎఫ్ అధ్యక్షుడు సెబాస్టియన్ కో ప్రకటించాడు. ఇదిలా ఉంటే బోల్ట్ తదుపరి వారసత్వాన్ని దక్షిణాఫ్రికాకు చెందిన వేడ్ భర్తీచేసే అవకాశాలున్నాయి. గత వేసవిలో రియోలో అతడు అమెరికాకు చెందిన మైఖెల్ జాన్సన్ ప్రపంచ రికార్డును సైతం బద్దలు కొట్టి విజతగా నిలిచాడు. తనకు ఉసేన్నే స్ఫూర్తి అంటూ వేడ్ చెప్పడం గమనార్హం. కాకపోతే నేను ఇంకా ప్రయాణించాల్సిన దూరం చాలా ఉందన్నాడు. అలాగే ఈ చాంపియన్‌షిప్‌లో చాలా మంది వీక్షించడానికి ఎదురుచూస్తున్న మరో అథ్లెట్ బ్రిటన్‌కు చెందిన మో ఫరా. వరుసగా అతడు 10వ ప్రపంచ టైటిల్ కోసం ఎదురుచూస్తున్నాడు. ఫరా 5000 మీటర్లు, 10 వేల మీటర్లపై గురిపెట్టాడు. ఇటీవల డైమండ్ లీగ్‌లో 3000 మీటర్లలో విజయకేతనం ఎగురవేయడం ద్వారా 34 ఏళ్ల ఫరా తనలో సత్తా తగ్గలేదని నిరూపించాడు.

వారియర్స్ చేతిలో టైటాన్స్ చిత్తు




ప్రొ కబడ్డీలో నేడు
తెలుగు టైటాన్స్ - పాట్నా పిరేట్స్
(గచ్చిబౌలి ఇండోర్‌స్టేడియం, హైదరాబాద్ రా.8 గం.నుంచి)

హైదరాబాద్ : వరుసగా నాలుగోసారి తెలుగు టైటాన్స్ పరాజయం పాలైంది. ప్రొ కబడ్డీలో ఏ సీజన్‌లోనూ ఇంతవరకు టైటాన్స్ వరుసగా నాలుగు మ్యాచ్‌లు ఓడింది లేదు. బుధవారంనాడు గచ్చిబౌలి ఇండోర్‌స్టేడియంలో బెంగాల్ వారియర్స్‌తో తలపడిన టైటాన్స్ 6 పాయింట్లతో ఓటమిపాలైంది. ప్రథమార్థం ముగిసేసరికి 14-19 తేడాతో వెనుకబడిన టైటాన్స్ తర్వాత కూడా ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. వారియర్స్‌కు ఇది తొలి మ్యాచ్ కాగా, ఈ గెలుపుతో శుభారంభం చేసుకుంది. మణీందర్ సింగ్...బెంగాల్ గెలుపులో 9 రైడ్ పాయింట్లు అందించి కీలకపాత్ర పోషించాడు. అదే టైటాన్స్ కీలకమైన సమయాల్లో కేవలం ఫలితంలేని రైడ్లకే పరిమితమైంది. మరోవైపు వారియర్స్ చక్కటి డిఫెన్స్‌తో అలరించింది. దక్షిణకొరియాకు చెందిన జంగ్ కన్ లీ ఆరంభంలోనే బోనస్ పాయింట్ ఇచ్చి వారియర్స్‌కు శుభారంభం చేశాడు. తర్వాత టైటాన్స్ 2-2 పాయింట్లతో సమం చేసినా , మణీందర్ వరుసగా మూడు రైడ్లతో టైటాన్‌కు చెందిన ఆరుగురు ఆటగాళ్లను అవుట్ చేశాడు. దీంతో వారియర్స్ 13-8 పాయింట్ల ఆధిక్యాన్ని అందుకోగలిగింది. అదే ఊపుతో ప్రథమార్థం ముగిసేసరికి కూడా వారియర్స్ ఆధిక్యం కొనసాగింది. ఇక ద్వితీయార్థంలోనూ వారియర్స్ పైచేయిలోనే (22-14) నిలిచింది. అదేవిధంగా టైటాన్స్ కెప్టెన్ రాహుల్‌ను 10 నిమిషాల వరకు బెంచ్‌కే పరిమితం చేయడంలో వారియర్స్ సఫలీకృతమైంది. దీంతో టైటాన్స్ కెప్టెన్ రాహుల్ చౌదరి కేవలం 5 పాయింట్లు సాధించగా, నీలేశ్ సలుంకే సైతం 5 పాయింట్లు అందించాడు.మొత్తంమీద టైటాన్స్ కేవలం 16 రైడ్ పాయింట్లు సాధించగా వారియర్స్ 19 రైడ్ పాయింట్లు సాధించగలిగారు.

గుజరాత్ హర్యానా మ్యాచ్ టై: అంతకుముందు గుజరాత్ పార్చ్యూన్ జెయింట్స్, హర్యానా స్టీలర్స్ మధ్య జరిగిన మ్యాచ్ టైగా ముగిసింది. ఉత్కంఠగా సాగిన పోరులో ఇరుజట్లు ఒక దశలో నువ్వా?నేనా అన్న రీతిలో ఉన్నప్పటికీ చివరకు 27-27 స్కోరుతో ముగించేశాయి. ప్రథమార్థం ముగిసేసరికి 11-8 తేడాతో గుజరాత్ జట్టు పైచేయిలో ఉంది. అయితే ద్వితీయార్థంలో బాగా పుంజుకున్న హర్యానా 19 పాయింట్లు సాధించగలిగింది. మరో ఆసక్తికర అంశమేమిటంటే ఆఖరి 5 నిమిషాల్లో హర్యానా13 పాయింట్లు సాధించింది. కాకపోతే విజయకేతనం ఎగురవేయలేక పోయింది. హర్యానా రైడర్లు సూర్జిత్‌సింగ్, వికాశ్ ఖండోలా వరుసగా ఆరు, 7 పాయింట్లు సాధించిపెట్టగా, గుజరాత్‌కు సురేందర్ నాడా 7 పాయింట్లు అందించగా మహేంద్ర కుమార్ 5 పాయింట్లు సాధించి పెట్టాడు.

మూడోరౌండ్‌లో కశ్యప్, ప్రణయ్





న్యూఢిల్లీ : కామన్వెల్త్‌గేమ్స్ చాంపియన్ పారుపల్లి కశ్యప్, యుఎస్ ఓపెన్ విజేత హెచ్ ప్రణయ్ న్యూజిలాండ్ గ్రాండ్ ప్రి గోల్డ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మూడోరౌండ్‌కు చేరుకున్నారు. పురుషుల సింగిల్స్‌లో కశ్యప్ సునాయాసంగా స్థానిక షట్లర్ అస్కార్ గుయావోను 21-9, 21-8 తేడాతో ఏకపక్షంగా సాగిన పోరులో కేవలం 25 నిమిషాల్లోనే ఓడించాడు.

అలాగే నాలుగో ర్యాంక్ ప్రణయ్ వరుస గేమ్‌ల్లో ఇండోనేషియాకు చెందిన పిర్‌మాన్ అబ్దుల్ కొలిక్‌ను 23-21, 21-18 తేడాతో 53 నిమిషాల్లో ఓడించాడు. మూడోరౌండ్‌లో కశ్యప్ -సౌరభ్‌తో తలపడనుండగా ప్రణయ్ -10వ సీడ్ వెయినాన్‌పై ఆడాల్సి ఉంది.

అలాగే ఇతర భారతీయ షట్లర్స్ సిరిల్ వర్మ, సౌరభ్ వర్మ సైతం తదుపరి రౌండ్‌కు చేరుకున్నారు. కాగా సాహిల్ సిపాని, నీరజ్ వశిష్ట్ మాత్రం ఓటమిపాలయ్యారు. 16వ సీడ్ సిరిల్ 21-14, 41-16 తో వికీ అగ్గా (ఇండోనేషియా)పై గెలుపొంది మూడోరౌండ్‌లోకి అడుగుబెట్టాడు. తదుపరి అతడు చైనీస్ తైపేకు చెందిన చియా హంగ్ లూను ఎదుర్కొంటాడు.

అదే విధంగా ఏడోసీడ్ సౌరభ్ 21-16, 21-16 తో ఇండోనేషియా ఆటగాడు హెన్రికో విబోవోపై గెలుపొందాడు.

ఖేల్‌రత్నకు మిథాలీ పేరు సిఫార్సు చేయలేదు



న్యూఢిల్లీ : ఇటీవల మహిళల ప్రపంచకప్ ఫైనల్‌లోకి భారత జట్టును ముందుండి తీసుకుని వెళ్లిన కెప్టెన్ మిథాలీరాజ్ పేరును బీసీసీఐ ఈ సంవత్సరం ఖేల్‌రత్న అవార్డుకు సిఫార్సు చేయడంలేదు. ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో క్రీడాకారిణిగా నిలిచిన మిథాలీ సారథ్యంలోనే భారత్ 2015 లో కూడా ఫైనల్‌లోకి వెళ్లిన విషయం తెలిసిందే. అలాగే వన్డే క్రికెట్‌లోనూ అత్యధిక పరుగులు చేసినప్పటికీ మిథాలీ పేరును ఈ ప్రతిష్ఠాకర అవార్డుకు సిఫార్సు చేయలేదు. వాస్తవంగా ఇందుకు తుది గడువు ఏప్రిల్ 30. అయినప్పటికీ కొన్ని అసోసియేషన్లు తమ ఆటగాళ్ల పేరును సిఫార్సు చేస్తున్నాయి. గత సంవత్సరం ఆఖరి నిమిషంలోనే రియో ఒలింపిక్స్‌లో రాణించిన నలుగురిని ఖేల్ రత్న అవార్డుకు ఎంపిక చేయడం జరిగింది.

*Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.*